

# మౌనం

* ఎ. సర్వేశ్వరరావు

"నీడలా నిను వెన్నాడినా ... నా
జాడ కనుగొనలేవో ...!"

మూడవజామువేళలో ఆదమరిచి నిదురించే ప్రకృతి కెవరో వినిపించే మధురమంజుల గానం.

"జే పరిహార, హరిహార చరణ,
భ జహీ భూతగణ ఘోర
తేహి కఇ గతి మోహి దేఉ బిధి,
జౌ జన నీవు తమోర ..."

ఏదో ఆవేదనతో వినిపించే గంభీర నివేదన. ఏమిటి ఈ నివేదనా నిశీథ గీతికలు? ఎవరు, ఎవరికి, ఎందుకు వినిపిస్తున్నట్టు?

తిమ్మనగిరికి రెండున్నరమైళ్ల దూరంలో, శబరి తీరంలో నాలుగంతస్తుల సౌధం. సౌధశిఖరంపై నిలిచి చూస్తే చుట్టుపక్కల అయిదారు పల్లెల ఎల్లలు అవలీలగా దృగ్గోచరమవుతాయి. భవంతికి మూడువైపులా విశాలమైన బయలు. కాని ఈ శతాబ్దపు పూర్వార్ధంలోనే శిథిలమయిపోయిం దది. అయినా నాటి అపురూప శిల్పకళావైభవమటుకు చెక్కుచెదరక అక్కడక్కడ ఇంకా నాటి శిల్పచాతురిని చాటుతూనేఉంది. కాని సౌధం ఉత్తరభాగంమాత్రం నేలమట్టమైపోయింది. కేవలం పెద్ద రాళ్లగుట్ట మాత్రమే నేడక్కడ గోచరమవుతూంటుంది.

విశాలమైన ప్రాంగణాలు. అవి దాటి వెడితే పెద్ద మండపం. మండపాని కటూ, ఇటూ పెద్దపెద్ద గదులు. సున్నపుపెచ్చు లూడిన గదిగోడలూ, రాళ్లు జారి వికృతమయిపోయిన స్తంభాలూ ఆ భవనాన్ని ఇంక ఎన్నోనాళ్లు మోయజాలమని వెల్లడిచేస్తూంటాయి. భవంతి దాటి లోనికి వెడితే, నదీతీరంవరకు అదో అరణ్యంగా కనిపిస్తూంటుంది. అశోకవృక్షాలు, చంపకాల పొదలు, పొన్నచెట్లు, పొదలూ, వాటినంటి పాకే వివిధ లతలూ. కాని ఒకనా డది అతి సుందరమైన

పాడుపడిన మహల్ నుండి వినిపించే విమల గాంధర్వగానానికి కర్తలెవరు? పాటకు పరవశించి, మహల్‌లో అడుగుపెడితే ప్రాణాలతో బయటపడడం సాధ్యంకాదు. ఎవరో ఒకరు ఏదో మంత్రంవేస్తే ఆ పాట ఆగిపోదా! ఆ మందిరంలో ప్రవేశం లభించదా! ఈ సమస్యను హేతువాదం పరిష్కరిస్తుందా?

ఆరామమంటే ఎవరికీ నమ్మ శక్యం కాదేమో!

చంపకాల పొదలకు ఇటువక్క పెద్ద అశోకవృక్షం. అటుపక్క కాస్తదూరంలో ఒక పొన్నచెట్టు. దానికి గజన్నర దూరంలో ఒక బాదంచెట్టు. ఆ రెంటికీ నడుమ ఒక ఉయ్యాల వేలాడుతూఉంటుంది. ఊయలకు కట్టబడిన గొలుసులు ఏనాటివో, తుప్పు పట్టి ఇక గడియో అరగడియో అన్నట్టున్నాయి. ఉయ్యాలకు దిగువ కట్టబడిన బల్ల ఎండకు ఎండి, వానకు తడిసి, చలికి బిగిసి అష్టవంకర్లు తిరిగి అతి వికృతంగా ఉంది. అయినా దాని అవసరం ఈనాడు ఎవరికి ఉంది? ఎవరంత ఆప్యాయంగా ఊగేది?


ఊయలకు పదిగజాల వెనక పొదలమాటున ఒక చిన్న మందిరం. పొదలనంటి దట్టంగా అల్లుకు పోయిన గురివెంద లతలు. ప్రభాతవేళ అతి శోభాయమానంగా ఉంటుం దక్కడి దృశ్యం. కాని చూచేది ఎవరు? అనుభవించేది ఎవరు? ఏనాడు, ఎవరీ మందిరాన్ని, ఏ కారణాన విడిచిపెట్టారో ఎవరికీ తెలియదు. కాని ఆ తరవాత మరెవ్వరికి నివాసయోగ్యం కాలేక పోయిం దది. ఆ దరిదాపులకే ఎవరూ వెళ్ల నిచ్చగించరు. **తెలియక వెళ్లినా తరవాత తెలిసి భయంతో గడ్డ కట్టుకుపోవలసిందే. కారణం?**

**రోజూ రేయి మూడోజాము మొదట్లో ఆ మహలులో నుండి అపురూప గానం వినవస్తూంటుంది. దాని వెంబడే ఏదో గంభీర ఘోష. ఊయల ఎవరో ఊగుతున్నట్టుగా సవ్వడీ వినవస్తూంటుంది. ఆ మంజుల గానానికి ముగ్ధులుకానివా రెవరూ ఉండరు. కాని పరిస్థితులు కారణంగా ఆ స్నిగ్ధత్వ ముగ్ధత్వాల ప్రభావం అంతా వ్యర్థమే అవుతూండేది.** కడు దూరంలో ఉన్నా, ఆలాపన మొదలయిందే తడవుగా నిద్రించే జీవులు ఉల్లిపడి, భయంతో కొయ్యబారి, ముసుగులు తన్ని భగవన్నామస్మరణం కావిస్తూంటారు. పొలాలలోనో, తోటలలోనో తిరుగాడే ప్రాణులు కకావికలై పరుగులు తీస్తూంటారు. అదంతా ఆ ఒక్క మూడోజామున మాత్రమే. ఆ తరవాతగాని, ఇక ఏవేళలగాని ఏ పాటా వినిపించదు. ఏ మాటా, ఏ సవ్వడీ వినిపించదు. అయినా ఏ గడియలోకూడా ఎవరూ ఆ సౌధ ఛాయల్ని కూడా తొక్క సాహసించేవారు కాదు. కనీసం ఆ పాట విని, 'ఎవరిని ఎవ రలా నీడలా వెన్నాడుతున్నారు? ఎవ రా జాడ తెలుసుకొనజాలక ఉన్మత్తులై, ఉత్తేజితులై తిరుగాడుతున్నారు? ఏమిటి దాని ఆంతర్యం?' అని తర్కించడానికికూడా సాహసం చెయ్యలేక పోయేవారు. ఇక ఎవరయినా దుస్సాహసవంతులు తెగించి భవంతిలో అడుగుపెడితే సజీవులై స్మృతితో మరలినవారూ అరుదే. సామాన్యంగా అలాటి వారందరూ భవంతి ముంగిట రెల్లుపొదల్లో రక్తం గక్కుకుని మరణించడం జరిగితే, రాజానగరం యువకుడు రవిశంకరుని మృతి అతి చిత్రంగా జరిగింది. రేయి అతన్ని ఆ ప్రాంతాలకు సాగనంపిన మిత్రులు తెల్లారి వచ్చి అతనికై అన్వేషిస్తే కనీసం శవమైనా ఆ పరిసర ప్రాంతాలలో ఎక్కడా గోచరం కాలేదు. కాని రెండురోజుల పిమ్మట శబరిలో అతని శవం తేలింది; అంతే. అయితే ఆనాటినుండీ ఆ మహలునుండి ఆ పాటా వినిపించడం మానేసింది. ఘోషా వినిపించడం మానేసింది. ఊయలా విరిగి నేలకూలింది. ఎలాటి భయచిహ్నాలూ ప్రస్ఫుటం కాలేదు. అంతా అతి ప్రశాంతమై పోయింది.

అయితే ఏమిటి దీనికి కారణం? ఏ మంత్రశక్తితో రవి శంకరుడీ దుశ్శకునాల నంతంచెయ్యగలిగాడు? చివరి కతనూ శబరికి బలిఅయిపోవడానికి హేతువేమిటి?

• • •

మండపందగ్గిర ఏదో చర్చ జరుగుతూఉంది. పిన్నలూ, పెద్దలూ చాలామంది ఉన్నారక్కడ. సాధారణంగా అలాటి చర్చలలో పాల్గొనటం నాకెప్పుడూ రుచించదు. కాని నా మిత్రులు కొంతమంది అక్కడ కనిపించడంతో అదేదో చూద్దామని వెళ్లాను. సరే, వీళ్లంతా చేస్తున్నదేమిటయ్యా అంటే ఒక వృద్ధ మహాశయుడు ఏదో కథ చెబుతున్నాడు. వీరంతా సావధానచిత్తులై వింటున్నారు. అతను నాకు అపరిచితుడేం కాదు. తిమ్మనగిరి రైతు. వచ్చి రెండు రోజు లయింది. మా బంధువుల ఇంట్లోనే బస. అయితే ఇంతమందిని ఇంత అవధానంతో ఆకట్టుకున్న **అతను సామాన్యుడనడం సాహసంతో కూడిన పనే అవుతుంది. అందుకే నేనూ కాస్త చోటు చేసుకొని కూర్చున్నాను. వృద్ధ మహాశయుడు ఏదో చెబుతున్నాడు. భువనగిరి కవతల ఓ అడివి ఉందిట. ఆ అడివికి ఓమారు కొందరు తెల్లదొరలూ, నల్ల దొరలూ కలిసి వేటకు వచ్చారట.** 'అడివి అంతా తిరిగి వేటాడండిగాని ఒక చెట్టుదగ్గిరికిమటుకు వెళ్లవద్దని చెప్పారట వనచరులు. నల్లదొరలు నమ్మారీ విషయాన్ని. కాని తెల్లదొరలు నమ్మక, పైగా కట్టుకథగా హేళన చేశారట. ముమ్మందుగా ఆ చెట్టుకిందికే ఒకతను తుపాకీ పట్టి వెళ్లాడట. ఇంకేముంది? గొప్ప ఆఘాతం తగిలినట్టుగా ఆ వెంటనే హరీమన్నాడట...ఇదీ కథ. చెట్టుమీద దయ్యమనే సరికి నవ్వు వచ్చింది నాకు. చెట్లమీద దయ్యాలుండట మన్నది ప్రతి ఊళ్లోనూ ఉన్నదే. కాని ఆ చెట్లకిందే చాలారోజులు రాత్రిళ్లూ పగళ్లూకూడా ఆడుకున్నాను నేను. మరి ఇంతవరకు నేను చావలేదేం?




చిత్రం —ఎ. వి. మోహన్ గుప్త

(విజయవాడ-1)

నా నవ్వుతో వాతావరణం కాస్త భంగపడింది. నా నవ్వు నుద్దేశించి, "తమరేనా నవ్వింది?" అన్నాడు వృద్ధ మహాశయుడు. నేను కాస్త దగ్గిరికి జరిగి అవునన్నాను. దానితో వృద్ధుడు కళ్ళు ఇంతలు చేసుకుని, "అయితే తమకు నమ్మకంలేదా?" అని అడిగాడు.

"లేదు." తల ఊపాను.

"అయితే ఇదంతా అబద్ధమంటారా?"

"అవను."

"మరి?"

"నిజమే కావచ్చు. కాని ఆ చెట్టుమీద ఉన్న దయ్యమే వారిని పీక్కుతిన్నదన్నదిమాత్రం నేనంగీకరించను. భయమో, భ్రమో ఏదో అతని చావుకి కారణం అయిఉండాలి. అంతే."

"అయితే అసలు దయ్యాలు లేవనే మీ ఉద్దేశమా?"

"అవును." నా ఈ సమాధానం చాలామందిని విచలింపజేసింది. వృద్ధ మహాశయుడు మందహాసంచేసి ఒకసారి అందరివంకా చూసి, "ఎందుచేత? దాని కేదైనా విశేష కారణం ఉందా?" అని అడిగాడు.

"ఉంది." క్షణంసేపు అందరి ముఖాలూ కుతూహలంతో వెలిగిపోయాయి. అన్ని కళ్ళూ నాపైనే నిలిచి పోయాయి. "దయ్యాలున్నాయని భయపడ్డ ప్రాంతంలో నేను చాలారోజులు తిరిగాను" అన్నాను.

"పగలా?" నవ్వుతూ అడిగాడు వృద్ధ మహాశయుడు.

"కాదు, రాత్రిళ్లే. ఆ సంగతి ఇక్కడ ఉన్నవాళ్లలో చాలామందికి తెలును" అన్నాను నా మిత్రులవంక చూసి. వారు అవునన్నట్టుగా **తలలూపారు.**

"సరే. ఇక్కడి సంగతి అలా ఉంచండి. మాఊరి మహలు సంగతి మీ కేమన్నా తెలుసా? ఆ సంగతి ఇక్కడున్నవాళ్లలో చాలామందికి తెలుసని నేనను కుంటాను..."

"ఆ సంగతి నాకూ తెలుసు." వృద్ధుని పెదవులపై సన్నని హాసరేఖ తళుక్కున మెరిసింది.

"మరి, దానికేమంటారు? అదీ నమ్మరా?" అన్నాడు.

"నమ్మను."

"ఎందుకని? ఇంతవరకు అక్కడికి వెళ్లినవా రెవరూ ప్రాణాలతో తిరిగిరావడంలేదు. వారి అవస్థలను కళ్లతో చూసినవారు చాలామంది ఉన్నారు. అయినా మీరు నమ్మకుండా నవ్వుతున్నారు" అని ఒకరివంక చూసి, "ఇది కేవలం రెండు ఇంగ్లీషు ముక్కలు నేర్చుకున్నందువల్ల కలిగిన దర్పం. ఆ దర్పమే మనిషిని మరీ నాస్తికత్వానికీ, మ్లేచ్ఛత్వానికీ లాక్కుపోతూంది" అన్నాడు. అసలు విషయం ఒకటి; చివరికి తేలింది మరొకటి. నేను నిర్విణ్ణుణ్ణి అయ్యాను. "చూడండి. దీన్ని గురించి వాదించాలని నేను రాలేదు. ఎవరి నమ్మకం వారిది. అలాగే నా నమ్మకం నాది. నేను నాస్తికుణ్ణే. మ్లేచ్ఛుణ్ణే. కాని దయ్యాల సంగతి మాత్రం నేను నమ్మలేను. అయితే ఒకటి. ఆ మహలుకు వెళ్లినవారు వెళ్లవచ్చు. తిరిగిరానివారు రాలేకపోవచ్చు. అయితే అది దయ్యాల ప్రతాపంమటుకు కాదు. ఏదో వింటారు. ఏదో చూస్తారు. భయంతో బిర్రబిగిసి విర్జీవులవుతారు. అంతే. అంతకంటె మరేం నేను నమ్మను" అన్నాను.

వృద్ధుడు చటుక్కున నాచెయ్యి పట్టుకుని, "అయితే తమరు ఆ మహలులోకి వెడతారా?" అని అడిగాడు. నేను నవ్వి, "వెళ్లగలను" అని, "నేను ముందే

చెప్పాను. చిన్నతనంనుండి నేనాడుకున్నది దయ్యాల చెట్ల కిందే'' అని చెప్పాను. ఆయన మండిపడి, ''తమరు బడాయిలు కొట్టకండి, ప్రభూ!'' అని శ్రోతలవంక తిరిగి ఆ మహలును గురించిన భయంకర వర్ణన ప్రారంభించాడు. పట్టపగలు అంతమందిలో కూర్చున్నా చాలామంది భయంతో బిగుసుకుపోయేటంత ఇదిగా చెప్పసాగాడు. కొంతమంది వినే ఓపిక లేక అక్కడ నుండి జారుకున్నారుకూడా.

''ఆ మహలులో ప్రతిరాత్రీ మహాకాళి తన సహచరులతో నృత్యగాన సల్లాపాలతో వినోదిస్తూంటుంది. దూరానికే ఆ ఆటా, పాటా వినిపించి గుండెలను దద్దరిల్ల చేస్తూంటాయి. పాములూ, కప్పలూ, గబ్బిలాలూ, కొండచిలవలూ విచ్చలవిడిగా తిరుగుతూంటాయి. అందుకే పగలుకూడా ఆ ప్రాంతాలకేసి ఎవరూ వెళ్ళలేరు. రోజూ మహల్లో దయ్యాల కల్యాణ మహోత్సవాలు జరుగుతూంటాయి గామోసు, ఏవో మంత్రాలు ఘోషగా వినిపిస్తూంటాయి.

ఎన్నోమార్లు ఎంతోమంది దయ్యాలంటే నమ్మకంలేని ఇంగ్లీషు దొరలూ, వారితోపాటు మన దొరలూ ఆ మహల్లోకి వెళ్ళి తిరిగి రాలేకపోయారు. ఘోరమైన చావు చచ్చేవారు. అంతా రక్తం కక్కుకొని, ప్రేవులు పైకివచ్చి, మహా వికృతంగా ప్రత్యక్షమయ్యేవారు'' అని ఆ మహా భవనం అపూర్వగాథను వినిపించి వృద్ధుడు నావైపు తన స్నిగ్ధ వీక్షణాన్ని విసిరి, ''ఏం బాబుగారూ, వెడతారా!'' అన్నాడు.

తలఊపి, ''ఎందుకు వెళ్ళను? తప్పకుండా వెడతాను'' అన్నాను.

''అయితే తమ సాహసం కొనియాడతగిందే. కాని ఒకవేళ తమరు—'' అన్నాడు.

వృద్ధుని మాట మధ్యలోనే నేను నవ్వి, 'నేను కూడా చస్తానంటారా! చావనీయండి. మరేం పర్వాలేదు. నాకోసం ఏడ్చేవారెవరూ లేరులెండి'' అన్నాను.

''కావచ్చు. కాని రేపేదన్నా జరిగితే...''

''నేరం మీమీదికి వస్తుందని భయపడుతున్నారా? మరేం భయంలేదు. వీరంతా సాక్ష్యం ఉంటారుగా—'' అని లేచాను. విమర్శలూ, సమాలోచనలూ ప్రారంభం కాగా అక్కడనుండి లేచి వచ్చేశాను.

కాస్సేపటికే ఈ వార్త కాస్తా పల్లె నలుమూలలా వ్యాపించిపోయింది. ''దయ్యాలమహలులోని విచిత్రాలు చూడడానికి మన శంకరంబాబు తిమ్మనగిరి వెడతాడట.'' మాతి దగ్గిరా, చెరువుదగ్గిరా, ఎక్కడ చూసినా ఇదేమాట. ఎవరు ఎదురు పడినా ఒకటే మాట. ''మా మాట విను బాబూ! చూసి చూసి మృత్యుకుహరంలోకి వెళ్ళడం దేనికి? ఏం సాధిద్దామని? దిక్కుమాలిన చావు చచ్చి మన పల్లెకు అపకీర్తి తెస్తావా!'' విని విని విసుగెత్తింది. పొద్దుపోయేవేళకు వృద్ధుడు కనిపించి మరోమారు హెచ్చరించాడు. ''ఇన్ని మాటలు అనవసరం. నేను తప్పకుండా వెళ్ళితీరలాను'' అని ఖచ్చితంగా చెప్పాను. ''సరే. రేపు తెల్లారుజామునే నా ప్రయాణం. మీరూ సిద్ధంగా ఉండండి. కలిసి పోదాం'' అన్నాడు. సరేనన్నాను.

నడిరేయివరకు నా మిత్రులు నన్ను విడవలేదు. దూషించేవారు దూషిస్తున్నారు. హితవులు చెప్పే



కూడలి ఫోటో — పి. గురుమూర్తి (మద్రాసు - 10)

వారు చెబుతున్నారు. పిరికిమందు పోసేవారు పోస్తున్నారు. వాళ్ళందర్నీ పంపేసరికి నా తలప్రాణం తోకకు వచ్చింది. నిద్రపోదామని మంచంపై వాలేంతలో ఎవరో పిలిచారు.

''భయ్యా!'' ఎవరైందీ గుర్తుపట్టాను. చాంద్ బీబీ. వకుళ బంధువు. పల్లెలో నిజంగా నన్నభిమానించేవారూ, నా శ్రేయస్సు కోరేవారూ ఎవరన్నా ఉన్నారూ అంటే అది ఈ చాంద్‌బీబీ ఒక్కరే. వెళ్ళి తలుపు తీశాను. లోపలికి వస్తూనే, ''నీకేం మతి పోయిందా, భయ్యా! తిమ్మనగిరి వెళ్ళడానికే నిశ్చయించుకున్నావటగా'' అన్నది.

''అవును'' అన్నాను.

''అంటే ఎవరి మాటా వినదలుచుకోలేదన్నమాట! అంతేనా!''

నిట్టూర్చాను. ''వినడాని కిందులో ఏముందని దీదీ! అయినా ఎవరున్నారు నాకు?''

''ఎవరూ లేరా!'' దీదీ స్వరం కించిత్తు కంపించింది. ''మాటిమాటికీ ఎందు కలా లంటావు, భయ్యా! నీవారంటే నిన్ను కన్నవారూ, పెంచినవారూ మాత్రమేనా? ఇతరులు నీవారు కాలేరా? ఎందు కిలా మమ్మల్ని దుఃఖపెడతావ్, భయ్యా!'' దీదీ స్వరం అశ్రుభరితమైపోయింది.

''దుఃఖపెట్టడం కాదు, దీదీ! ఈ విషయంలో నన్ను మన్నించు. నేను వెళ్ళక తప్పదు'' అన్నాను.

''తప్పదా? ఎందుకని? మాటవచ్చిందనేనా?''

''మాటకోసం కాదు, దీదీ! ఎందుకో నాకు వెళ్ళాలని పిస్తూంది. ఈనాడు ఈ మనిషిద్వారా ప్రేరేపణ రాకపోయినా ఏదో ఒకనాడు నాఅంతట నేనే వెళ్ళవలిసి వచ్చేది'' అన్నాను.

దీదీ విస్మయంగా చూసి, ''ఎందుకని?'' అని అడిగింది.

''ఎందుకో నేను చెప్పలేను, దీదీ! ఏదో శక్తి నన్ను 'రా! రమ్మ'ని పిలుస్తున్నట్టుగా ఉంది. అందుకే...''

''కానీ నీ ఈ నిర్ణయమేమిటో నా కర్థంకావడం లేదు, భయ్యా! వకుళ పోయిన దగ్గిరనుండీ మరీ ఇదిగా తయారయ్యావ్. ఒక మంచీ లేదు, చెడూ లేదు. అన్నీ నీ ఇష్టమే. సరే కానీ. ఏదీ జరగదనే అనుకుందాం. కాని విధివశాత్తూ ఏదన్నా దుర్ఘటన జరిగితే మా సంగతి అలాఉంచి, పరలోకంలోఉన్న వకుళ ఎంతగా క్షోభిల్లుతుందో యోచించు.''

శుష్కహాసం చేశాను. ''నేనూ దానికోసమే ఎదురు చూస్తున్నాను, దీదీ! ఒకవేళ అలాగే జరిగేట్టయితే వకుళ ఎన్నటికీ చింతించదు. సంతోషిస్తుంది. ఎందుకంటే, ఇంత వేగంగా కలుసుకోగలిగినందుకు సంతోషించాలేగాని చింతించే అవసరమేం లేదు'' అన్నాను.

దీదీ ఇక వినలేకపోయింది. ''భయ్యా'' అని ఏడుస్తూ వెళ్ళిపోయింది.

మూడోజాము వేళకల్లా వృద్ధుడు సిద్ధమయ్యాడు. అతనివెంట నడిచాను. ఎంత చెప్పినా వినకుండా నా మిత్రులు కొందరు నావెంట పడ్డారు. ఇక దారి పొడుగునా అదే గొడవ. వృద్ధుడు మరీ భయంకరంగా దయ్యాలను గురించి కథలు చెప్పసాగాడు. కాని నా ధ్యాసే అటు ఉంచలేదు నేను. నా నిర్ణయంలో నేనున్నాను. తిమ్మనగిరి చేరుకున్నాం. నా సంగతి తెలిసి నలుగురూ నన్ను చుట్టుముట్టారు. సలహాలివ్వసాగారు. లేనిపోనివి చెప్పి వెనక్కి పొమ్మని హితవులు చెప్పేవారెక్కువయ్యారు.

''ఏదో పెద్ద ముండాకొడుకుని. చెబుతున్నాను విను, నాయనా! బాపనబిడ్డవు. ఇంత సాహసం మంచిది కాదు. ఈ అధ్వాన్నపు చావుతో చచ్చి స్వర్గాన ఉన్న నీ పెద్దల ఆత్మ క్షోభిస్తుంది'' అని హితవు చెప్పాడొక వృద్ధుడు. ఇక నాకు చిరాకెత్తింది. దూరంగా వెళ్ళిపోయాను.

మహలుకు వెళ్లడానికి సుమారు ఇంకో రెండుగంటల వ్యవధి ఉంది. మేము దిగిన గుడిసె బయట మెల్లిగా పచార్లుచేస్తూ, మనసులో ఆందోళన పడుతూ చూస్తూ ఉన్నాను. నిజానికి అసలు ఏముయి ఉంటుంది? ఆ మాటలూ, పాటలూ, ఆటలూ, మంత్రాలూ వాటి అంతర్యం ఏమిటి? దయ్యాలేమిటి? కల్యాణా లేమిటి? చచ్చినవారందరూ భయంతోనే చచ్చారా, లేక ఏదో మంత్రశక్తి ప్రభావానికి చచ్చారా? కాని మంత్రశక్తుల ప్రభావాలను నేను నమ్మలేను. ఏమంటే ఇరవై ఏళ్ళకు పైగా దయ్యాలున్నాయన్న ప్రాంతంలోనే మసిలాను. నాకుగాని, వకుళకుగాని ఎప్పుడూ ఏ ప్రమాదమూ వాటిల్లలేదు. కాని వకుళేగాని ఈనాడు బ్రతికిఉంటే నా ఈ సాహసానికి ఏమంటుంది?

• • •

వకుళ ఎప్పుడు, ఎక్కడ, ఎలా నాకు పరిచయమయిందో చెప్పలేను. కాని పరిచయమయిన దగ్గిర నుండీ ఆమెను నాదానిగానే నేను భావించాను. వకుళ ఏ జాతికి చెందినదో ఎవరికీ తెలియదు. ముస్లిమ్ దంపతులచేత పెంచబడుతూండేది. ఒక తిరుణాళ్లలో దొరికిన ఆ బిడ్డకు, వకుళవృక్షం క్రింద తటస్థపడిన కారణంగా ఆపేరు పెట్టి పెంచసాగారు. అయితే ఆచారంలోగాని, వ్యవహారంలోగాని వకుళ హిందూ సంప్రదాయాలే అనుసరించేది. ఏ పరిస్థితుల్లో కూడా ఎవరినీ ముస్లిమ్ కన్య అని భ్రమింపజేసి ఎరగదు. చిన్నప్పటినుండి వకుళా, నేనూ ఒకే బడిలో, ఒకే తరగతిలో చదువుకొంటూ ఉండేవాళ్లం. బడివేళ అయిన తరవాత ఊరవతల ఉన్న భైరవస్వామిగుడిలో మా ఆరాధన సాగుతూండేది. వకుళ ఇంట్లో రకరకాల పూలచెట్లుండేవి. ఆ పూలన్నీ తెంచి తెచ్చి మాల కూర్చి, నా మెడలోవేసి ఆనందిస్తూండేది వకుళ. అయితే ఏనాడు కూడా ఆ మాలను తిరిగి ఆమె మెడలో వేసేవాణ్ణికాను నేను.

అంతగా పూజించినా నాలో దయ అన్నది లవలేశంకూడా ఉండేదికాదు. ఒక్కొక్కప్పుడు పూలు తక్కువై మాల అసంపూర్ణంగా ఉండేది. "ఇదేమిటి! మాల ఇవాళ ఇంత పొట్టిగా ఉంది. ఎలా వేసుకొంటానను కున్నావు?" అని కోప్పడేవాణ్ణి.

"ఎంతో కష్టంతో ఈపూలు ఏరి తేవలసి వస్తూంది. మాల కూర్చడం అంతకంటె బాధగా ఉంది. అయినా నీకు కృతజ్ఞత లేదు. ఎందుకలా తిడతావ్?" అని ఎన్నడూ అని ఎరగదు. కొట్టినా, తిట్టినా దిగాలుపడి చూస్తూండేది. వయసు పెరిగేకొద్దీ నా ఈ కాఠిన్యమూ తగ్గుతూ వచ్చింది. పెద్దవాళ్లమయ్యాం. ఆ బడి నేను విడిచిపెట్టాను. కాని ఆ గుడినిమాత్రం మేము విడిచిపెట్టలేదు.

అసలే ముస్లిమ్‌లు. పరదాల పట్టుదలలు హెచ్చు. అయినా ఏదోవిధంగా వీలుచూసుకొని వేళయ్యేసరికి సంకేత స్థలానికి వచ్చేది వకుళ. భైరవుని గుడీ, గుడి వెనక తోటా మా ఆటకు అనువైన స్థలాలు. నరుడన్నవా డెవడూ ఆ ఛాయలకు వచ్చేవాడు కాదు. రాకపోగా దూరాననుంచైనా చూసేందుకు సాహసించరు. కారణం?

ఈ ప్రాంతాన్ని గురించి ఒక గాథ ప్రచారంలో ఉంది. శతాబ్దం క్రిందటో, రెండు శతాబ్దాల క్రిందటో ఇక్కడ ఒక సంఘటన జరిగిందట. అది వాస్తవమో, అభూతకల్పనో ఎవరికీ తెలియదు. కాని నేటికీ ఆ ప్రేమగాథ గానం చేయబడుతూనేఉంది. సంక్షిప్తంగా ఆ గాథ ఇది.

పూర్వపురోజుల్లో ఒక దేశీయయువతి ఒక దేశీయ యువకుణ్ణి ప్రేమించిందట. వారి ప్రేమ సమాజపు ఆమోదముద్రకూడ పొందిందట. కాని విదేశీ రాజబంధువు ఒకడు వారి ప్రేమకు విఘ్నం కలిగించజూచాడట. అయితే సమాజ సంప్రదాయాల ముందు రాజసం తలవంచక తప్పలేదు. ఇక వంచనతో తన వాంఛను తీర్చుకోవాలని నిశ్చయించుకున్నాడు ఆ రాజబంధువు. వివాహపు వేళలో సైన్యంతో వచ్చి విరుచుకుపడ్డాడు. కల్యాణశోభ కల్లోలం కావించాడు. మండపాన్ని ముక్కలు కావించాడు. కల్యాణ ప్రేక్షకులను కాలరాచాడు. కరుకుకత్తుల శెరచేశాడు. మంగళచిహ్నాలన్నీ అగ్నిపాలయ్యాయి. వధువును



తండ్రి మొదటి ప్రపంచ యుద్ధంలో సాహసికుడుగా పేరు పొందాడు. అతడు విమాన సైన్యంలో పైలట్‌గా 72 శత్రువిమానాలను కూల్చి వేశాడు.

కుమారుడు రెండవప్రపంచ యుద్ధంలో పైలట్‌గా పాల్గొన్నాడు. అతడు ఒక సందర్భంలో తండ్రిని గురించి — "మా నాన్న, నేను కూడా యుద్ధంలో బాగానే పని చేశాము. ఉభయులమూ కలిసి 73 శత్రు విమానాల్ని పడగొట్టాము" అన్నాడు.

తస్కరించి పలాయనం చిత్తగించాడు రాజబంధువు. కత్తి చేపట్టి వెన్నంటాడు వరుడు. ఈ తోటదగ్గిర ఇద్దరూ ఢీకొన్నారు. కరుకు కరాసులు తళతళ మెరిశాయి. పోరు సాగింది. రెండూ రెండు శక్తులు. జయాపజయ నిర్ణయ భారం దైవంపైనే పడింది. కల్యాణ భైరవుని కన్నీట ప్రార్థిస్తూంది వధువు. భైరవు డామె మొర విన్నట్టున్నాడు. దుష్టశక్తి నేలకూలింది. కాని వరుని స్థితే అగమ్యగోచరమయిపోయింది. ఆ క్షతగాత్రుని భైరవుని చరణాల చెంతకు చేర్చి అతి దీనంగా ప్రార్థన చెయ్యసాగింది వధువు. కాని దైవం ఈమారు ఆమె మొర వినలేదు. వరుడు మరణించాడు. దానితో వధువుకూడా దైవం రాతిచరణాలపై తన తల పగలగొట్టుకుని మరణించింది. నాటినుండీ ఈ ప్రాంతం దయ్యాల పుంత అయింది. భైరవుడూ పూజావిహీనుడయ్యాడు. పరిసరాలూ పాడుపడ్డాయి.

## 2

ఈ గాథ ఎంతవరకు వాస్తవమో ఎవరికీ తెలియదు. నేడు ప్రచారమవుతున్న ఈ గాథలో అసలు కథ ఎంతో, మరుగుపడినదెంతో ఎవరి ఊహకూ అందదు. కాని మిగిలిన గాథకు చక్కని రూపకల్పనలెన్నో చేర్చి గానం చేస్తూ నిత్యనూతనం కావిస్తున్నారు జనం. అయితే వకుళా, నేనూ చిన్నతనంనుండి ఆడుకొనేదీ, పాడుకొనేదీ ఇక్కడే. కాని ఏనాడూ జను లంటున్న భయచిహ్నాలేవీ మాకు కనిపించలేదు; వినిపించలేదుకూడా. అందుకే పరప్రవేశవిహీనమైన ఈ ప్రాంతంలో మా విహారాలు అతి నిర్భయంగా, రహస్యంగా సాగుతూండేవి.

"చిన్నతనంనుండి నిన్నునేను పూజిస్తూనే ఉన్నాను. కాని అల్లా నా కింతవరకు ఎలాటి ఫలితాన్నీ ప్రసాదించలేదు" అన్నది ఒకనాడు వకుళ.

నేను నవ్వి, "నన్నే నీకు సమర్పించాడుగా. ఇంకా ఏం కావాలి?" అన్నాను.

"నిన్నా! నిజంగా! అయితే నేను చాలా అదృష్టవంతురాలిని. ఇంతవరకు నువ్వు నాకు దక్కవేమోనని భయపడుతూఉన్నాను. కాని ఈవేళ నీ ఈ మాటతో ఆ భయం తీరిపోయింది" అన్నది వకుళ.

నేను మళ్లీ నవ్వాను. "అస లెందుకలా భయపడ్డావు?" అని అడిగాను.

"ఎందుకా!" అని కళ్లు చక్రాల్లా తిప్పి, "భయపడక పోవడానికి ఇదేమన్నా చిన్న సంగతి అనుకున్నావా? నువ్వెక్కడ, నేనెక్కడ? అయినా జాతి వేరు. చూసి చూసి మీవాళ్లు నిన్ను తురకదాన్ని చేసుకోనిస్తారా?"

ఆ 'తురక' శబ్దం నా కసహ్యమనిపించింది.

"వకుళా!" గంభీరంగా అన్నాను. "నువ్వు తురకవని ఎవరన్నారు? ఎవరో పెంచినంతమాత్రాన వాళ్లజాతి దానివి ఎలా అవుతావు? జన్మతః నువ్వు బ్రాహ్మణ కన్యవే" అన్నాను.

"నీకెలా తెలుసు?"

"ఎలాగో తెలుసు" అని వంగి వకుళ చెవిలో "దేవుడే నాకీ విషయాన్ని తెలిపాడు" అన్నాను.

వకుళ పొంగిపోయి నా పాదాలు పట్టి "నేను నమ్ముకున్న ఈ చరణాలూ నాకు ద్రోహం చెయ్యవని నా అల్లా నాకు చెప్పాడు" అనేది.

మా సంగతిమాత్రం అంత తేలిగ్గా పైకి

పొక్కలేదు. పొక్కినా నిందించడానికిగాని, బంధించడానికిగాని తల్లీ, తండ్రీ అంటూ నాకెవరూ లేరు. చిన్నతనానే వారు నన్ను విడిచి వెళ్ళిపోయారు. ఒక వేలువిడిచిన మేనత్త దగ్గిర పెరుగుతున్నాను నేను. అయితే ఆ అత్తే తన అధికారం నాపై ప్రయోగించ జూస్తుందని నేనెన్నడూ అనుకోలేదు. "ఏమిటి?" అని విస్తుపోయి, "చూసిచూసి ఆ తురకదాన్ని కట్టుకుంటానంటావా! ఛీ! ఛీ! నువ్వేం బ్రాహ్మణుడివను కుంటున్నావా? మాలవాడి ననుకుంటున్నావా? అడిగే వారెవరూ లేరని అలా ఎగిరి పడుతున్నావేమో! నే బ్రతికిఉండగా ఇలా జరగడానికి వీల్లేదు. చచ్చాక నీ ఇష్టం. ఏమంటే స్వర్గాన మీ అమ్మకూ, నాన్నకూ, దేవుడికీ సమాధానం చెప్పే బాధ్యత అప్పుడు నాకేం ఉండదు" అని ఖండితంగా చెప్పేసింది మా అత్త. సరే, ఆవిడ సంగతి తరవాత తేల్చుకోవచ్చు. ముందు అవతలిపక్షం తేల్చుకుందామని వకుళ తండ్రిని కలుసుకుని నా నిర్ణయాన్ని తెలిపాను. ఎగిరి గంతులెయ్యవలసిన విషయం. అయినా అతను ముఖం ముడుచుకుని, "బాబూ! మీకూ, మాకూ పొత్తు కుదరదు. మమ్మల్ని క్షమించి విడిచిపెట్టండి. మా మానాన మమ్మల్ని ఇలా బతకనియ్యండి" అన్నాడు మర్యాదగా. కాని ఆ మన్ననకు నేనేం ముచ్చట పడలేదు. కోపంతో నా ఒళ్ళు మండిపోయింది.

"పొత్తుకీ, మర్యాదకీ వకుళ మీ పిల్లేం కాదు. వకుళ నా జాతి పిల్ల. నామనిషి. దాన్ని నేను చేసుకొని తీరుతాను" అన్నాను ఖచ్చితంగా.

"మీ పట్టుదలకు మమ్మల్ని బలిచెయ్యకండి, బాబూ! సమాజం వింటే నన్ను బతకనీదు" అన్నాడు.

"నువ్వూ నేనూ ఒప్పుకుని కలిస్తే సమాజాని కేం పెత్తనముందని, నిన్ను బ్రతకనీయకపోవడానికి? అదేం కుదరదు. నేను వకుళను చేసుకునితీరుతాను" అని చెప్పాను. కాని ఏమీ చెయ్యలేకపోయాను. ఆ రాత్రికి రాత్రే వకుళను తీసుకొని ఆ కుటుంబం ఊరు విడిచి వెళ్ళిపోయారు. వారి జాడ తెలుసుకోడానికి చాలా యాతనపడ్డాను. తీరా ఆచూకీ తెలుసుకుని వెళ్ళేసరికి అంతా మించిపోయింది. ఒక ముస్లిం యువకునితో వకుళ వివాహం నిశ్చయమయిపోయింది. ఆనాటి రాత్రే వివాహం. కాని వధువు అనూహ్యంగా అదృశ్యమయింది. భగ్నహృదయంతో అటూ ఇటూ తిరిగి చివరకు ఇంటిముఖం పట్టాను. వకుళ దారిలోనే కనిపించింది. కాని ఎలా?

వకుళ నాకోసమే మా ఊరికి పారిపోయి వచ్చేసింది. కాని నేనిక్కడ లేను. మా ఇంట్లోగాని, ఊళ్ళోగాని ఎక్కడా ఆమెకు ఆదరమూ ఆశ్రయమూ లభించలేదు. లభించకపోగా దూషణలే ఆమెను చుట్టుముట్టాయి. ఇక దారి లేక మేము విహరించే తోటకు వచ్చి భైరవుని ముందు ఏడ్చి ఏడ్చి ఆ రాతిగుండె కరుణ చూపకపోగా నిరాశ్రయ అయి, పతివిహీన అయి, ఆశాహత అయి ఒక చెట్టుకు ఉరిపోసుకుని మరణించ సిద్ధంగా ఉన్న తరుణంలో అటునించి వస్తున్న నా దృష్టి పథంలో పడింది. కాని అప్పు డేం చెయ్యగలను నేను? ఉరి తప్పించి కిందికి దింపాను. రెండు ఘడియలు నా ఒడిలో గిజగిజ గింజుకుని కన్ను మూసింది నా వకుళ.

• • •

"బాబూ!"

ఉలిక్కిపడి వెనక్కి చూశాను. వృద్ధ మహాశయుడు.

"చైమవుతూంది" అన్నాడు.

"సరే, వెడుతున్నా" అని కదిలాను.

"ఆగు, రవీ! మేమూ వస్తున్నాం." మా మిత్రులు గుడిసెలోంచి బయటికి వచ్చారు.

నేను విస్మయంగా చూసి "ఎక్కడికి?" అన్నాను.

"అక్కడికే" అన్నారు.

"ఊహుఁ, వద్దు. మీరు లేనిపోని ఆపదలలో చిక్కుకోవడంనాకిష్టంలేదు. నేనంటే నాఇష్టపూర్వకంగా బయలుదేరి వెడుతున్నా. కాని మీరు నాలా ఒంటరి వారు కారు."

"మరేం పర్వాలేదు. నీకు లేని భయం మా కెందుకు?"

కాని వారిని వెంటబెట్టుకునివెళ్ళడం నాకు సుతరామూ ఇష్టంలేదు. ఎందుకంటే దీర్ఘకాలపు అనుభవంతో ఇది కేవలం తర్కమీమాంసల పని కాదనీ, సంస్కారగతమనీ గ్రహించాను. దయ్యాలను




చిత్రం —ఎ. వి. మోహన్ గుప్త
**(విజయవాడ-1)**

ఒప్పుకోనీ, ఒప్పుకోకపోనీ పరిసర ధైర్యంతో అడుగు పెడితే అడుగు పెట్టగలరు. కాని అక్కడి పరిసరాల ప్రభావానికి తట్టుకోలేక భయంతో మూర్ఛ పోవడం తప్పదు. అందుకనే నాకోసమన్నాగానీ, లేదా ఆ వింతల్ని చూడాలన్న కుతూహలంతోగానీ వారు వెంటబడినా తీసుకెళ్ళడానికిమాత్రం నే నంగీకరించలేదు. కాని వేళ అవుతూందని నేను కదిలి పోయాను. వారూ నావెంట వచ్చారు. కాని ఎంతవరకు? భవంతికి ఎదురుగా వచ్చాం. చెట్లచాటునుండి ఎవరో ఏడుస్తున్నట్టుగా వినిపించింది. దానితో మా నడకలొక్కసారి స్తంభించిపోయాయి. నే నటూ ఇటూ చూశాను. ఆ ఏడుపు ఆగలేదు. వెనక వెనక ఇంకా గీపెట్టి ఏడుస్తున్నట్టుగా వినిపించింది. నేనూ భయపడుతున్నా ననిపించింది. కాని ఆ ఏడుపుమాత్రం మానవమాత్రు లెవరిదీ కాదు. గబ్బిలపుపిల్ల! ...ఆ సంగతి గ్రహించి నడక సాగించాను. కాని నా మిత్రులక్కడే ఆగిపోయారు.

నేను మహలుకేసి నడిచాను. మహలులో అడుగుపెట్టాను. వెలుగులోంచి ఒక్కసారి చీకటిలోకి వెళ్ళగానే కళ్ళకంతా అయోమయమయింది ఒక్క క్షణం. విరిగిన పైభాగాలి కంతల్లోంచి దూసుకువస్తున్న వెన్నెలవెలుగు అక్కడక్కడా చక్కగా నేలకొనిఉంది. ధూళిదూసరమైన మండపమంతా అతి వికృతంగా ఉంది. మూలల్లో పెద్ద పెద్ద సాలెగూళ్ళు. టార్చిలైటు వేసి చుట్టూ చూశాను. విచిత్రమేమీ కనిపించలేదు నాకు. ఓ మూలగా పైఅంతస్తుకి పోవడానికిబోలు పెద్ద మెట్లవరస. దానికి అడ్డంగా వికృతంగా సాలెగూళ్ళు. మెట్లనిండా దుమ్ము. ఏదో చెత్త. టార్చితో సాలెగూడును చెరిపి మెట్లు ఎక్కాను.

పైన అంతా చీకటి. ఎటూ ఏమీ కనిపించలేదు. రెండునిమిషాలు అలా చీకట్లోనే నిలబడిపోయాను. నా కుడిచేతిపక్క ఒక గది. తలుపు సగం తెరుచుకొని ఉంది. ధైర్యంచేసి ఆ గదిలో అడుగు పెట్టాను. కిటికీల్లోంచి దూసుకువస్తున్న వెన్నెల నేలపై చక్కగా పరుచుకునిఉంది. గది పరీక్షించి చూశాను. అబ్బ! గదా అది? కాదు. ఒక అపూర్వ కళామందిరం. శిథిలమయినా, ధూళిపట్టినా గోడలకున్న చిత్రాలు అపురూప సోయగాలకు ప్రతిబింబాలుగా ఉన్నాయి.

గదిలో ఉన్న సామానూ తక్కువేంకాదు. కాళ్ళు విరిగిన కుర్చీలూ, కోళ్ళు విరిగిన మంచాలూ, వాటి తిరుతెన్నులూ కళాభిరుచికి చిహ్నాలుగా మిగిలిఉన్నాయి. పెద్ద నిలువుటద్దాలు, వాటి నగిషీ. భూతప్రేత పిశాచ భ్రమలతో, భయాలతో ఎంతటి కళాసంపత్తిని మరుగున పడేశాడు మానవుడు! ఇంతకన్న అవివేకం మరేముంటుంది? శిథిల క్షేత్రాలను, కళాఖండాలను దర్శించినప్పుడల్లా నాకు ఏడుపు వస్తుంటుంది. మిథ్యాభియోగంతో మానవు డెంత అమూల్య సంపత్తిని వ్యర్థంగా గాలికి వదిలిపెట్టి, ఏమీ లేనిదానికై ఎందు కంతగా పాకులాడతాడో అర్థంకాదు. యోచనా, చింతా, దుఃఖమూ ఒక్కమారే వస్తుంటాయి నాకు. ఇక్కడా అంతే. ఊహించినంత భయానకమేమీలేదక్కడ. అంతా భ్రమ. ఒకప్పుడు రాజులదో, జమీందారులదో అయిఉంటుం దీ భవనం. అవసరంలేకో, అర్థంతలేకో తరవాత మరెవరూ నివసించిఉండరు ఇందులో. ఆ కారణాన, కాలమానాన పాడుపడిఉంటుంది. గాలికి ఏ చెట్టుకొమ్మో, ఏ గోడో కూలి ఏదో చప్పుడయితే అది విని భ్రమించారు. ఆపైన నీలివార్తలతో, అభూత నృత్యసంగీతసల్లాపాలతో నేడింతగా ప్రచారం అవుతూంది. అంతే. అంతకంటె ఇంకేం లేదు. గది విడిచి పైకి వచ్చాను. పక్కన ఓ గది. దానిపక్క మరొకటి. చివర గది మటుకు బోసిగా ఉంది. పైకప్పు పూర్తిగా కూలి గాలీ, వెలుగూ, వర్షమూ—అన్నిటికీ ప్రవేశానుమతి నొసగుతున్నదేమో, గదిఅంతా పరమాసహ్యంగా ఉంది. గదిమధ్యలో నిలబడి చూశాను. బయటి ప్రకృతిఅంతా అత్యంత నయనపర్వంగా కనిపించసాగింది. కాని హఠాత్తుగా ఒక సంఘటన.

ఒక్క గాలివిసురు ఎంతో ధూళిని రేగగొట్టి నా దేహంమీదుగా పోయింది. అది అణగకముందే రెండో విసురు. మళ్ళీ మూడవది పైనుండి పోయింది. మనసూ, తనువూ రెండూ కదిలిఅలోచనలో పడవేశాయి. "అరే! ఇదేమిటి! ఇంతవరకు లేశమయినా గాలి లేదు. ఇంతలోనే ఇంత విసురెలా వచ్చింది?" ఈ

కుసంస్కారాలనూ, అభూతకల్పనలనూ నేను నమ్మక పోవచ్చు. కాని నాలో గుప్తమై ఉన్న విశ్వాసాలకే చలనం ఏర్పడుతున్నట్టుగా అనిపించింది నాకు. క్రమంగా గాలి విసురు తగ్గింది. కాని ఎవరో పెద్ద నిశ్వాస వదిలినట్టుగా అయింది. దానితో నా గుండె ఆగినంత పనయింది. ధైర్యం సడలసాగింది. నా చేతిలో ఉన్న టార్చిలైటు వెలుగు అటూ ఇటూ తిరగడంబట్టి నా చెయ్యి ఎంత వేగంగా వణుకుతున్నదీ గమనించగలిగాను. ఇక అప్పుడే గదిలో ఓ పక్కనున్న పుర్రెలూ కనిపించ సాగాయి. బహుశా ఎప్పుడో నాలాగే మొండిధైర్యంతో ఇక్కడికి వచ్చి హడిలి చచ్చినవారివయి ఉంటాయి అవి. కాని వాటిని చూడటంతోనే నా భయమూ కాస్త తగ్గింది. ఏమంటే పుర్రెలోంచి గాలి వీస్తే సరిగా ఒక పెద్ద నిశ్వాస వదిలినట్టుగానే ఉంటుందన్న విషయం చాలమందికయితే తెలియదనుకుంటాను. కాని నాకు చాలాసార్లు అనుభవమయిం దా విషయం. అందుకే భయాన్ని అణుచుకోగలిగాను. ఒకవేళ ఆ స్థితిలోగాని భయాన్ని అణుచుకోలేకపోతే మృత్యువు పాల్పడటం అన్నది అసంభవమేం గాదు. కాని వణుకుతున్న నా కాళ్లనూ చేతినీ అదుపులో పెట్టడంమాత్రం నాకు మించిన పని అయిపోయింది.

'టంగు'మని వినిపించిన మోతతో అదిరిపడి వెనక్కి తిరిగి చూశాను. ఏంలేదు. గోడనున్న గడియారం గంటలు కొడుతూంది. నా భయానికి నాకే నవ్వు వచ్చింది. కాని సిగరెట్ వెలిగించి గడియారంకేసి పరీక్షగా చూసేసరికి ఆ పరిహాసం కాస్త ఎగిరిపోయి నా రక్తం గడ్డకట్టుకుపోయినట్టయింది.

గడియారం పెండ్యులం కదలడంలేదు. అయినా ముళ్ళు అంకెను చూపుతున్నాయి. గంటలు మోగుతున్నాయి. భయవిస్మయాలతో చూస్తున్నంతలో ఏదో ఆలాపన పవనతరంగాలలో సుళ్ళు తిరుగుతూ నా వీనులలో ధ్వనించసాగింది. ఆలాపన ముగిసి పాట వినిపించింది.

"నీడలా నిను వెన్నాడినా . . . నా
జాడ కనుగొనలేవో! . . ."

ఏమిటా పాట? ఎవ రా పాడేది? ఎక్కడ? తత్తరపాటుతో అటు ఇటు చూశాను. అడుగు ముందుకు వేశాను. పాట స్పష్టమైంది. నాకు తెలియకుండానే నా అడుగులు ఆ పాటను వెన్నంటి పడుతున్నాయి. మేడ దిగి పోయాను. తోటలో అడుగు పెట్టాను. అలా ముందుకు నడిచి నడిచి ఒకచోట సంభ్రమంతో నిలబడి పోయాను. పైన వెన్నెల. దిగువ పెద్ద అశోకవృక్షం. దానికి అటుపక్క కాస్తదూరంలో ఒక పొన్నచెట్టు. దానికి గజన్నరదూరంలో ఒక బాదంచెట్టు. ఆ రెంటికీ నడుమ ఒక ఊయల ఊగుతూంది. కాని ఊగేది, ఊపేది ఎవరో కనిపించడంలేదు. విస్మయాందోళనలతో అలా గుడ్లప్పగించి చూస్తూ ఉండి పోయాను. చూస్తున్నంతలో మొగిలు తొలగి వెలువడిన తొగవిందులా ఆ ఊయలపై చిరునవ్వులతో ఊగుతూ ఒక యువతి ప్రత్యక్షమైంది. అదిరిపడ్డాను. పాటా మారింది.

"మనసు కదా స్థిరమైనది
మాట కదా విలవైనది
మనసు, మాట ఒకటి కాగ
మనము వేరు కాముగా . . ."


కళ్ళు తిరిగిపోయాయి. ఒళ్ళు చెమర్చింది. మనసు స్మృతులతో సుళ్ళు తిరిగిపోయింది.

అదే నవ్వు! అదే పాట! అదే ఆలాపన! ఎవరు? ఎక్కడ? ప్రశాంత తటాకంలో, రాయి విసిరి హఠాత్చలనం కలిగించగా రేగిన అలలలా ఎద కదలిపోయింది. భావనాపథంలో స్మృతి తళుక్కున మెరిసింది. వకుళ! అవును, వకుళే! కాని ఇక్కడికి ఎందుకు వచ్చింది? ఎలా వచ్చింది? ఎప్పుడు వచ్చింది? అనిర్వచనీయమైన హృదయావేగంతో 'వకుళా!' అని అరిచి ఊయల దగ్గరికి పరుగుతీశాను. కాని నేను ఉయ్యాల చేరి చేరగానే ఆ జవ్వని అదృశ్యమయిపోయింది. నా ఆవేదనా అనంతమయిపోయింది. ఊయలను పట్టుకొని "వకుళా! వకుళా!" అని పిలుస్తూ అటూ ఇటూ చూశాను. కాని ఎక్కడా కనిపించలేదు! ఉన్మత్తుడనయ్యేంతలో హఠాత్తుగా చంపకాల పొదడాపున పాట ప్రారంభమైంది. అటు పరిగెత్తాను. నేను పొద చేరగానే పాట పొదను వీడి అశోకవృక్షందాపుల కేగింది. అటు నడిచాను. ఆ వెంటనే అటునించి అటు ఎటో సాగిపోయింది ఆ స్వరం. ఆ స్వరాన్ని వెంబడించి నేను పరిగెత్తుతూనేఉన్నాను. కాని వెనక్కి తిరిగేసరికి ఊయల ఊగుతూ కనిపించింది వకుళ. అదే నవ్వుతో నన్ను చూస్తూ పాడుతూంది. గభాలున ఊయల చేరి ఆమె చెయ్యి పట్టుకున్నాను. కాని అదృశ్యమై పోయింది. ఇక నా మనసు పిచ్చెక్కిపోయింది. ఏడుపూ వచ్చింది.

"వకుళా! ఎక్కడున్నావు, వకుళా! నన్నెందు కిలా తప్పించుకుపోతున్నావు?" అతి దీనంగా ప్రశ్నించాను. వెనక పొదలమాటున ఉన్న మందిరం మెట్లపై ప్రత్యక్షమయింది ఆ సుందరి.

"వకుళా!" అని పిలిచాను. ఆమె అక్కడే నిలబడి ఉంది. రెప్పలార్పక చూస్తూ నడిచి మెట్లు సమీపించాను. కాని వకుళ వెనక్కి నడుస్తూంది. ఎంత నడిచినా వకుళ నా కందలేదు. అలా అలా వెనక్కి పోతూంది. పోయి పోయి గది గుమ్మందగ్గిర అదృశ్యమయింది. ఇక అప్పుడే నన్నా భ్రమ వీడింది. వాస్తవిక జగత్తులోనికి వచ్చి నన్ను నేను గమనించుకున్నాను. నా వేళ్లమధ్య ఇంకా అంత్యస్థితిలో సిగరెట్ వెలుగుతూనే ఉంది. దానితో మరొకటి వెలిగించి అటు ఇటు చూశాను. అంతా క్రీనీడగా ఉంది. గదిలో ఏముంది? ఎవరున్నారు? ఆ అదృశ్యమైన జవ్వని ఎవరు? మనిషేనా లేక భ్రమా? అలా గుంజాటనపడుతూ తలుపుపై మునివేళ్ల వానించాను. ఆ వెంటనే తలుపులూ వెనక్కి కదిలినాయి. విస్మయంతో లోనికి అడుగుపెట్టి చూసి నివ్వెరపోయాను.

"లకోటా" ప్రశ్నలు — లాంగ్టన్



గది అతి సుందరంగా ఉంది. పైనున్న రత్నపు సెమ్మాలలోనించి దివ్యమైన కాంతి ప్రసరిస్తూ ఉంది. కిటికీలచెంత ఒక తల్పం. హంసతూలికాతల్ప మంటే ఎలాగుంటుందో నే నెరగను. కాని అదేదో ఇలాగే ఉంటుందనిపించేలా ఉన్న ఆ శయ్యపై ఆ జవ్వని పడుకునిఉంది. సంశయాందోళనలతో అడుగులో అడుగు వేసుకొంటూ ఆ శయ్యదిశగా నడిచాను. నా చూపు పడగానే ఆమె లేచి కూర్చున్నది.

"రవిబాబూ!" అని పిలిచింది మృదువుగా. ఉలిక్కి పడ్డాను. ఆమెకు నాపే రెలా తెలిసింది?

"మీరు వస్తారని నాకు తెలుసు. అందుకే నిరీక్షిస్తూ ఇక్కడే ఉండిపోయాను."

విస్మయంగా చూసి, "మీ రెవరు?" అన్నాను.

"నేనా?" అని లేచింది. ఆమె కన్నులలో ఎందుకో అశ్రువులు పొర్లుకువచ్చాయి. "నన్ను గుర్తించలేదా, రవిబాబూ!" అన్నది అశ్రుగద్గదస్వరంతో.

మరింత విస్మయం చెందాను. అస లామె ఎవరని నేను గుర్తించడానికి? తల పంకిస్తూ, "ఉహూఁ! మీ రెవరో నాకు తెలియదు. ఎక్కడా ఎప్పుడూ చూడలేదనే అనిపిస్తూంది. అలాంటప్పుడు ఎవరని గుర్తించేది?" అన్నాను మెల్లిగా.

"ఎక్కడా, ఎప్పుడూ చూడలేదా? అదిగో, అటు చూడండి. అప్పుడైనా చెప్పండి."

వెనక్కి తిరిగి చూశా నటు. గోడకు ఫోటోలు వేలాడుతున్నాయి. ఆమె ఉద్దేశించిన ఫోటో చూశాను. అంతే. చకితుణ్ణయిపోయాను. ఆ ఫోటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులలో ఒక వ్యక్తిలో అచ్చు నా పోలికలే ఉన్నాయి.

"ఇప్పుడు చెప్పండి, రవిబాబూ! వారు మీరు కారా?"

అటు తిరిగి ఆమె ముఖంలోకి స్నిగ్ధంగా చూసి, "అవును" అన్నాను. "కాని మీ విషయం నా కర్థం కావడంలేదు."

"అప్పుడంటే కాలేదు. కాని ఇప్పుడూ కాలేదా, రవిబాబూ!" అని కనురెప్ప లల్లార్చి, "జన్మలు మారినా మీరు మీరే, నేను నేనే. నా మనసులోని భావం వెలికి రాకమున్నే మిమ్మల్ని దూరం చేసుకున్నానాడు. ఎక్కడో ఉన్నారని తెలిసి అక్కడికి వచ్చాను. కాని అక్కడా మిమ్మల్ని పొందలేకపోయాను. తిరిగి ఇక్కడికే వచ్చాను. ఏమంటే ఎప్పటికైనా మీ తుది మజిలీ ఇదేనని నాకు తెలుసు. కాని ..." అని నన్ను చేరసాగింది.

"ఆగండి. నాకేం అర్థంకావడంలేదు. నా తల తిరిగి పోతూంది. వద్దు, నన్ను చేరవద్దు" అని దూరం తొలగసాగాను.


"చేరవద్దని మీరు శాసించినా ఈనాడు మీలో నేను చేరిపోకతప్పదు, రవిబాబూ! ఇక మనకు వ్యవధి లేదు. కాని మీరు నన్ను గుర్తించాలి. అప్పుడుగాని నా కోరిక నెరవేరదు" అని వెనక్కి చూసి, "అక్కడున్నదీ నేనే. దాన్ని చూసి అయినా నన్ను గుర్తించడానికి ప్రయత్నించండి" అన్నది. ఆ ఫోటోవంక చూశాను. ఒక నాట్యభంగిమలో ఉన్న ఆ యువతి చిత్రమది.

## 3

**పార్వతీ పతి తపోనిష్ఠలో** ఉన్నాడు. ఎదట ప్రణయమూర్తి పార్వతి నాట్యం చేస్తూంది. ఆ నాట్యభంగిమలు నవనవోన్మేషం కలిగిన భావతరంగాలను అలరింపచేసి పులకరింపచేస్తున్నాయి. పార్వతి పాత్ర అభినయిస్తున్న కేతకి పదివసంతాల విరియని మొగ్గ కాని ఆ అపరిపక్వ సౌందర్యంలోనే ఏదో దివ్యమైన ఆకర్షణ కోటిప్రభల కాంతితో వెలిగిపోతున్నది.

శివుడు కన్నులు తెరిచాడు. పార్వతి ప్రణయ విన్యాసాన్ని గుర్తించాడ [illegible]చాడు. కాని ఆ చలనానికి ముఖ[illegible]దో మరునిమిషమే అతనికి గ్రాహ్య[illegible]యింది. మితిలేని ఆగ్రహానికి గురిఅయ్యాడు. మన్మథుని బూడిద కావించాడు. భీకర తాండవం సలిపాడు. పార్వతి భీతిల్లిపోయింది.

మానవుడు చాలా చావులు చూస్తున్నా తను బతకాలనే తపిస్తాడు. ఇంద్రియ సంచలనంవల్ల జన్మించి, ఇంద్రియ లాలసత్వంతోనే జీవిస్తూంటాడు. ఆ లాలస తీరాకగానితుదిగతిని గూర్చి తను ధ్యానించడు. ఇదే సృష్టి రహస్యం. అందుకే ఏది నిషిద్ధమనుకున్నాడో దాన్నినాశనం కావించిన తరవాతే రుద్రుడు శాంతించాడు. లోకకల్యాణం కోసం మళ్లీ ఆ భ్రమలకూ, రాగద్వేషాలకూ లొంగిపోక తప్పలేదు. కనకనే పార్వతి మనోభీష్టం నెరవేరింది. శివుడుగా చంపాదేవి చక్కగా అభినయించింది.



భువనగిరి జమీందారు రాజామహీపతి గారాబు పట్టి చంపకమాల. గది గుమ్మంలో నిలిచి కుమార్తె నాట్యవిన్యాసాన్ని తిలకించి ముగ్ధుడై ఆనందోత్సాహాలతో చప్పట్లు చరిచి, "ఆహా! ధన్యుడనయిపోయాను, గురుదేవ్! జన్మ తరించిపోయింది. అమ్మాయి నృత్యం చేస్తూంటే ఆ నటరాజమూర్తే నా ఇంట వెలిసి తాండవమాడుతున్నట్లుగా ఉంది. మీ గురుత్వానికి, కళావైదుష్యానికి, ఆదరాభిమానాలకు సర్వదా కృతజ్ఞుణ్ణి గురుదేవ్!" అన్నాడు మహీపతి.

గురుదేవులు నిరహంకారంతో మందహాసం ఒలికించి, "అంతా ఆ దేవదేవుని కటాక్షం, ప్రభూ! మనం నిమిత్తమాత్రులంమాత్రమే" అన్నారు. సైగతో శిష్యురాండ్రకు సెలవు ఇచ్చారు. చంపకి, కేతకి కాలి అందెలు విప్పి అక్కడ ఉంచి గురువునకు ప్రణామాలర్పించి లోపలికి వెళ్లిపోయారు. మహీపతి ఆసనం అలంకరించారు.

"అమ్మాయి శిక్షణపూర్తి అయ్యేదెప్పుడుస్వామీ?" అని అడిగారు.

"అఁ ఎప్పుడో అయిపోయింది, ప్రభూ! ఇక నేర్పడానికి నాదగ్గిర ఏమీ లేదు."

"ధన్యుణ్ణి. ఇదంతా నా భాగ్యం, గురుదేవ్! ఇంత చిన్నవయసులోనే ఇన్ని విద్యల్లో పరిపూర్ణురాలిని చేయగలిగారు."

గురుదేవులు నవ్వి, "దానికి మీ పాత్రా ఉందిగా, ప్రభూ! మీప్రోత్సాహమూ, అమ్మాయిశ్రద్ధాసక్తులూ లోపిస్తే నా ప్రజ్ఞ ఎంతటిదయితే ఏం ప్రయోజనం, ప్రభూ! అన్నీ అలా కలిసివచ్చాయి. అంతే."

"అవును. అవును. కాని చూశారా, స్వామీ! ఇవాళ ఎంత సుదినమో! అన్నీ సంతోష విషయాలే. తిమ్మనగిరి రాజమహేంద్రుడు నేడే వర్తమాన మంపించాడు" అన్నాడు మహీపతి సంతోషాతిశయంతో.

"దేనికి?"

"దేనికా?" అని లేచి మెల్లిగా పచార్లుచేస్తూ, "మహేంద్రుని పుత్రులు జితేంద్రుడు ఈమధ్యనే కళాశాల చదువులు ముగించి ఇల్లు చేరుకున్నాడట. ఇక ఆ మిగిలిన ఒక్కముచ్చటా తీర్చడానికి తహతహలాడిపోతున్నాడు మహేంద్రుడు" అని నవ్వి "ఎవరికైనా అంతేగా, స్వామీ! సత్సంతతికయితే ఏ ముచ్చటకయినా తహతహగానే ఉంటుంది. కాని దుష్టసంతతి అయిననాడు బతుకంతా విలవిల్లాడుతూనే ఉంటుంది" అని నిట్టూర్చాడు.

ఆ నిట్టూర్పు భావాన్ని గురుదేవులు అర్థం చేసుకోలేకపోలేదు. రాజావారి ఏకైకపుత్రుడు సుఖరోగపీడితుడై ఆమధ్యనే కాలం చేశాడు.

"అంటే, చంపకి కల్యాణమా ప్రభూ!" అని అడిగారు.

"అవును. నిర్ణయం వారి చిన్ననాడే జరిగిపోయింది.

ఇక జరగవలసిందల్లా ఆ శుభకార్యంమాత్రమే. అదీ పూర్తిచేసేస్తే నా బాధ్యతలన్నీ తీరిపోయినట్టే. కాని కలకలలాడే ఈ గృహమే చిన్నబోతుంది" అన్నాడు మహీపతి. కాని ఎందుకో గురుదేవుల ముఖం అప్పుడే వెలవెలబోయింది.

"జితేంద్రునిలాంటి వరుడు ప్రపంచంఅంతా గాలించినా మనకు దొరకడు, స్వామీ! ఆహా! చదువుకు చదువు, రూపానికి రూపం, అన్నిటికీ మించి భగవద్భక్తి, వినయవిధేయతలు."

"నాకు తెలుసు, ప్రభూ! కుర్రవాడు బహు యోగ్యుడు."

"తల్లిలేని పిల్ల. ఎంతో గారాబంగా పెంచి పెద్ద చేశాము. ఇక ఈ ముచ్చటా తీర్చి పంపితే ఆ దేవదేవుని దయవల్ల నా లోపమేమీ ఉండదు."

"కాని ఆ పంజరంలో చంపాదేవి సుఖించలేదు ప్రభూ!" సంశయిస్తూనే అన్నారు గురుదేవులు.

మహీపతి ఆశ్చర్యపడి చూశారు. "ఏమిటి మీర న్నది గురుదేవ్! అమ్మాయి సుఖించదా? ఉహుఁ మీరు పొరబడుతున్నారు. మహేంద్రుని వంశ మర్యాదలూ, ఆచార వ్యవహారాలు —"

"చాలా కట్టుదిట్టాలు ప్రభూ!"

"అయినంతలో సుఖశాంతులకు కలిగే భంగ మేమిటి?"

"వంశ మర్యాదలూ ఆచార వ్యవహారాలూ వధువును సుఖపెట్టలేవు ప్రభూ! —" గంభీరంగా అన్నారు గురుదేవులు.

"అంటే వరుని సౌజన్యాన్నే మీరు శంకిస్తున్నారా?"

"లేదు. అతని సౌజన్యం హిమవంతంవలె మహోన్నత మైనది. చంద్రకాంతివలె అతి మృదువు అతని మనసు. అగ్నివలె తేజోవంతమయిన దాతని వర్చస్సు. వర్ణనం నిరుపమానం. కాని చంపాదేవి లాలస కనువైన లాలసే అతనిలో నిద్రాణమై పోయింది..." అన్నాడు.

"లాలస!" మందహాసం గావించాడు మహీపతి.


"అసలు లేకపోలేదుగా. నిద్రాణమై ఉంది. అంతేగా? అయితే భయం దేనికి స్వామీ! అమ్మాయి రూపలావణ్యాలు సామాన్యములా స్వామీ! ఆ నిద్రితశక్తిని మేల్కొలిపే సామర్థ్యం వాటికి లేదంటారా?" అన్నాడు యుక్తివంతంగా. కాని గురుదేవుల మ్లాన వదనం ప్రసన్నం కాలేదు.

అయినా కాకపోయినా ప్రభువుల నిర్ణయాలకు తిరుగేముంది? అయినా ఎప్పుడో నిశ్చయమయి పోయిందా సంబంధం. మహేంద్రుని మాటా బలీయ మైనది. దానికి భిన్నంగా నడవలేడు మహీపతి... నాలుగు నెలల అనంతరం మహా వైభవంగా కుమార్తె వివాహం జరిపించాడు. అలాటి కల్యాణశోభ అంతకు మున్నెన్నడూ కాననేలేదన్నారు. ఇక కానబోమనీ అన్నారు అశేష జనం. ఇక వరుని సంగతి.

జితేంద్రుడు చక్కనివాడు. విద్యావంతుడు. బుద్ధిమంతుడు. కళాశాల చదువులు చదివినా జితేంద్రుని తలమీది చిన్న శిఖకుగాని, ఆచారాలకుగాని ఎలాటి భంగమూ కలగలేదు. శ్రద్ధగా చదువుకొంటూ బహుమతులూ ప్రశంసలూ పొందేవాడు. అంతేగాక ఇటు నదీ స్నానాలూ, ఏకాదశీ వ్రతాలూ, పూజా పునస్కారాలూ సాగిస్తూ భగవంతుని మెప్పూ సంపాదించేవాడు. "ఇంగ్లీషు చదువులు చదివినంతలో హిందూజాతి ధ్వంసమైపోతూంది. అంతా మ్లేచ్ఛులైపోతున్నారు" అనే వివాదాన్ని అసత్యమని నిరూపించాడు జితేంద్రుడు. కేవలం పూజా పునస్కారాలేగాక ఎక్కడే వేదాంత గోష్ఠి జరిగినా తప్పకుండా హాజరయ్యేవాడు. శ్రద్ధగా వినేవాడు. అవసరం కలిగితే తనూ వాదప్రతివాదాలు చేస్తూండేవాడు. అతని దివ్యవాణి విని "ఇంత చిన్నవయస్సులో ఇంత శ్రద్ధా! ఇంత నైపుణ్యమా! ఇంత మేధాసంపదా!" అని పెద్ద పెద్దవాళ్లే ముక్కున వేళ్లు ఉంచుకొనేవారు. కాని సహపాఠులు అతని ఈ వేదాంత జిజ్ఞాసను పిచ్చితనంగా జమకట్టి హేళన చేస్తూండేవారు. అపర రామకృష్ణుడని పేరు పెట్టారు కూడా. కాని ఎవరేమన్నా చలించేవాడు కాడు జితేంద్రుడు. రామకృష్ణునితో పోల్చి హేళనచేస్తే "ఎంత భాగ్యమా!" అనేవాడు. కాని అంతా అదే తత్త్వం. అదే జీవితాసక్తి. అందుకే తలిదండ్రులు పెళ్లి తలపెడితే ఎలాటి అభ్యంతరాన్నీ సూచించలేదు. జితేంద్రుడు సదా భగవదనుభవంలో తేలుతూండే వాడు. ఇంద్రియపరత్వం అతనికి లేనేలేదు. ఆత్మ నిగ్రహాధీరులకు వివాహము, భయంకరమూకాదు, నివార్యమూ కాదని అతని ఉద్దేశము.

"భగవంతుని ఉద్దేశానికి విరుద్ధంగా ఎవరు వివాహానికి విముఖులు కాకూడదు. దాంపత్యమునకు సంతానప్రాప్తి శాస్త్ర విహితమయిన సామాన్య లక్ష్యం కావచ్చును. కాని ఆత్మప్రాప్తి అనే విశేషలక్ష్యం కూడా దంపతులకు ఉండవచ్చును. అతీంద్రియమైన పారమార్థిక పురోగతిలో దంపతులు సహయాత్రికులుగా ఉండవచ్చును" అన్నారు శ్రీ రామకృష్ణ పరమహంస. తన జీవితంద్వారా ఆ విషయాన్ని నిరూపించారు కూడా. ఆ నిరూపణే జితేంద్రుని హృదయంలో స్థిరపడిపోయింది.

చంపాదేవి అత్తవారింట అడుగుపెట్టిన నాటికి పన్నెండేళ్ల బాల. జితేంద్రుడు ఒక బాల్యవిద్యార్థినిలా ఆమెను స్వీకరించాడు. సతీపతుల మధురానుబంధ మేనాడూ ఏమరుపాటున కూడా వారిమధ్య తలఎత్తేది కాదు. గురుశిష్యుల కఠోరబంధమే వారిమధ్య నిలిచిపోయింది. సంస్కృతం, ఇంగ్లీషు చెబుతూండే వాడు. చెప్పిన పాఠాలు సవ్యంగా అప్పచెప్పకపోతే కోపపడే వాడు. అప్పుడప్పుడు కొట్టేవాడు కూడా. ఆమె అలిగినా ఊరుకొనేవాడుకాడు. కోపాని కసలు తావేలేదు.



'అయ్యా! తమరు నాకివ్వవలసిన డబ్బు ఇచ్చి మరీ మునగండి.'

చిత్రం — పద్మాకుమార్, మద్రాసు-21.

శిక్ష మాత్రం మరింత కఠోరమయ్యేది.

అత్తగారి అదుపు మరింత కఠినంగా ఉండేది. మహీపతి బ్రతికి ఉన్నన్నాళ్లూ ఆ అదుపాజ్ఞలకు కాస్త పట్టూ విడుపూ ఉండేవి. కాని మహీపతి మరణానంతరం ఆమె ఆజ్ఞలకూ అదుపులకూ దయా, దాక్షిణ్యం లేకుండా పోయాయి. అన్నపానాదుల విషయంలోగాని, ముస్తాబును గురించిగాని, ఆటపాటల గురించిగాని ఆమె కొన్ని నియమాల నేర్పరచింది. వాటి నే పరిస్థితులలోనూ చంపకమాల ఉల్లంఘించడానికి వీలులేదు. అంతే.

ఈ పరిస్థితుల్లో ఆమె బాల్యావస్థ దాటి ఎప్పుడు యౌవనావస్థలో అడుగు పెట్టిందో ఆమెకే తెలియకుండా పోయింది. అజ్ఞాత యౌవనంతో శరీర సౌందర్యం పరిపూర్ణమవుతూ వచ్చిందేగాని ఆమె మనసులోని కోరికలకు మటుకు దారితెన్నూ లేకుండా పోయాయి. వీణపై మమకారమూ లేదు. పాటపై ఆసక్తీ లేదు. నాట్యంపై అభిరుచీ నశించింది. విలాసాలపై రక్తి రసహీనమై పోయింది. అత్తగారూ కాలధర్మం చెందారు. కాని ఈ రసహీన పతి సాన్నిధ్యంలో కాలమంతా గడపడం ఆమె శక్తికిమించిన పనే అయింది. అయితే పతి దయామయుడు. తన బలవంతపు గురుత్వానికి తిలోదకాలిచ్చేశాడు. ఆసక్తీ అభిరుచీ ఉంటే ఆమె ఎప్పుడన్నా వచ్చి ఏవో అడుగుతూండేది. తగిన విధంగా ప్రతివాదం చేస్తూ తన సంయమాన్ని జాగ్రత్తగానే కాపాడుకుంటూ వచ్చేవాడు జితేంద్రుడు. వాద ప్రతివాదాలతో పతి మనసులోని ఆ వైరాగ్య భావాన్ని ఏకాస్తయినా సడలింప జేయడానికి చంపకమాల చేసే యత్నాలన్నీ విఫలములే అవుతూండేవి.

ఆలాగే ఒకనాడు జితేంద్రుని గదిలో దొంతరగా ఉన్న గ్రంథాలను చూస్తూ అడిగింది చంపకమాల—

"ఈ గ్రంథాలలో ఏముంది?" అని.

"ధర్మసూత్రాలు, నీతి ప్రమాణాలు, మహనీయుల చరిత్రలు." ఇంకా ఏమేమో చెప్పాడు జితేంద్రుడు.

"అవన్నీ హిందూమతానికి సంబంధించినవేనా?"

"కాదు. అన్ని మతాలకు సంబంధించినవీ ఉన్నాయి."

"అయితే మీ దృష్టికి సర్వమతాలు సమానమేగా!"

"అవును. మత సారాంశాలలో భేదంలేదు. దారులు వేరయినా గమ్యస్థానం ఒక్కటే..."

ఒక నిమిషం ఏదో పుస్తకం చూస్తూ ఉండిపోయి తరవాత ఇలా అడిగింది చంపకమాల: "ఒకనాడు ఒక ఉద్దేశంతో గౌతముడు బౌద్ధమతం స్థాపించా డన్నారు. ఏసుక్రీస్తు క్రైస్తవమతాన్ని స్థాపించా డన్నారు. అలాగే మహమ్మదు ఇస్లాం మతం స్థాపించాడు. మరి మన హిందూమతాన్ని ఎవరు, ఎందుకు, ఎప్పుడు స్థాపించారు?"

మందహాసంతో సతి ముఖంలోకి చూసి జితేంద్రుడు "చక్కని ప్రశ్న వేశావు చంపా!" అని, "హిందూమతాన్ని ఎవరూ ఎప్పుడూ ఏ ఉద్దేశంతోనూ స్థాపించలేదు. అదే దీని విశిష్టత. ఏ మానవుని జీవితచరిత్రపైగాని, ఏసంఘటనపైగాని ఇది ఆధారపడి ఉండలేదు. హిందూమతం ఒక అవసరానికై, ఒకరి ప్రోత్సాహంతో నెలకొల్పబడినదికాదు. సృష్టి మొదలయిందాదిగా వస్తూన్న మతమిది" అని వివరించాడు.

"మరి దీనికి ప్రమాణ మేమిటి?"

"నిత్యసత్యమే దీనికి ప్రమాణం. సత్యం ఎలా ఆద్యంతాలు లేనిదో, జరామరణాలు లేనిదో అలాగే మతమూను." అర్థమైనట్టుగా తలపంకించేది చంపకమాల. తమ మధ్య ఇలాటి సత్ప్రసంగం సాగుతున్నందుకు చాల సంతసించేవాడు జితేంద్రుడు.

"మానవజన్మ ఎత్తింది ఎందుకు?" అని హఠాత్తుగా ప్రశ్నించేది చంపకమాల. దానితో తెల్లబోయే వాడు జితేంద్రుడు. ఆమె ఏ ఉద్దేశంతో ఈ ప్రశ్న వేసిందో అతని కంతు చిక్కేదికాదు. కాని లాలస ఎరగని అతని అంతర్యం స్వకీయ దృక్పథంలోనే దీనికి సమాధానం ఇచ్చేది.

"భగవంతుని ఉత్కృష్టమైన సత్యస్వరూపాన్ని గుర్తించి తత్సాధనకై కృషి చెయ్యడమే మానవజన్మ లక్ష్యం..." కాని ఆమె ఆశించే సమాధానం ఇలా ఉండేది:

"మానవజన్మ ఎత్తింది ప్రకృతి సంపదను నిర్లక్ష్యిస్తూ ముక్కూ నోరూ మూసుకొని జపం చెయ్యడానికికాదు. ఆత్మతోపాటు దేహాన్నీ భగవంతుడే సృష్టించాడంటారు. అలాటపుడు కేవలం జీవిత లక్ష్యం తన సాన్నిధ్యం కోసమే అయితే భగవంతుని సృష్టి అంతా స్వార్థమే అవుతుంది. కాబట్టి ఆ ఉద్దేశం కానేకాదు. విరాగంతో, విముఖత్వంతో శరీరంలో ఉద్భవించే కోరికలను అణగదొక్కడం, దేహాన్ని శుష్కింప జేయడం సృష్టికర్తకు ద్రోహం చేసినట్టు కాదా?" కాని ఇలాటి వాదానికి అవకాశమే యిచ్చేవాడుకాడు జితేంద్రుడు.

"భగవంతుని సత్యస్వరూపం ఎటువంటిది?" అని అడిగేది.

"నిర్మల ప్రేమ!"

"దాన్ని బోధించేవి ఏవి?"

"రెండు. స్మృతి, శ్రుతి..."

"అందులో ఏది నిత్యమైనది?"

"శ్రుతి. స్మృతిదేహము. శ్రుతి ఆత్మ. దేహం పెరుగుతుంది. తరుగుతుంది. ఒకనాటికి నిశ్శేషమైపోతుంది. కాని ఆత్మ అలాకాదు. దానికి చావులేదు."

"అయితే ఒక తీవ్రమైన తీరని కోరికతో మృతి చెందినవారి ఆత్మలు ప్రేతాత్మలై పరిభ్రమిస్తూ యుంటారు. అది ఎంతవరకు నిజం?"

"దానికి ఇదమిత్థమని ప్రమాణమేమిలేదు. ఆత్మ నిలిచేదికాదు. నిర్యాణమయ్యేదీకాదు. పరమాత్మలో లీనం కావలిసిందే...."

చంప, మందహాసం చేసి "అది పుణ్యాత్ముల సంగతి. మరి పాపాత్ముల సంగతో?" అని అడిగింది.

"పాప పుణ్యాల విచక్షణ దేహానికే. ఆత్మకు లేదు. కనకనే మనం నిర్భయంగా పాపాలు చెయ్యగలుగుతున్నాం. తుదిలో ఆత్మశాంతికై పరితపిస్తూ పాకులాడుతున్నాం."

"అయితే శరీరం బుద్బుద ప్రాయమంటారు. అలాటి శరీరం పాపంచేస్తేనేం పుణ్యం చేస్తేనేం? ఆత్మకు క్షోభించే అవసరమేముంది? తను పవిత్రంగానే తనమేరలో ఉండవచ్చు గదా!"

"కాదు. శరీరంచేసే పాపపుణ్యాలవల్లనే ఆత్మకు శాంతి, క్రాంతి కలుగుతాయి."

"అయితే ఇంతకు ముందు మీరు ఆత్మకూ దేహానికీ సంబంధం లేదన్నారే!"

"సంబంధంలేదు. కాని ప్రభావం మాత్రం ఉంది. అద్దానికీ సూర్యునికీ ఉన్న సంబంధమేమిటి? కాని సూర్యకిరణాలు అద్దంపైపడి వక్రీభావం చెందుతాయి. అలాగే ఇది...."

"అదా! అయితే అర్థమైంది" అనేది చంపకమాల. అయితే ఆ అర్థమయిందేమిటో ఆమెకే తెలియదు.

"ప్రేమ భగవంతుని సత్యస్వరూపమన్నారొకసారి. జీవితలక్ష్యం కూడ ప్రేమే అని నేను నేర్చుకొన్నాను. దీని సంగతేమిటి?" అని అడిగింది మరొకనాడు.

జితేంద్రుడు చిరునవ్వుతో సమాధానమిచ్చాడు.

"అవును. ప్రేమే ఒకవిధంగా జీవితలక్ష్యమనవచ్చును. తక్కినవన్నీ ఉపలక్ష్యాలు మాత్రమే అని చెప్పవచ్చు కూడా. దయ, ధర్మం, ధనం, త్యాగం, క్షమ, ఆదరం ఇవన్నీ ఉపలక్ష్యాలు. ఈ లోకంలోగాని పరలోకంలోగాని, స్వదేశంలోగాని పరదేశంలోగాని పరులకుగాని, ఆప్తులకుగాని పంచిపెట్ట గలిగిందీ, తగిందీ ప్రేమ మాత్రమే. అలాగే దానితో సాధించలేనిదీ ఏమీ లేదు. అందుకే ఆ ప్రేమను స్వార్థసహితంకాకుండా, కల్మషభరితంగాకుండా, చూసుకోవడమే మానవుని ముఖ్య కర్తవ్యమయిఉంది. ఇక ఏవరాలోచనా పనికిరాదు. ఏమంటే క్రోధమదమాత్సర్యాలుద్భవించేవి దాని మూలంగానే. ఎప్పుడయితే మనిషి ఒక ఆశకు, ధ్యాసకు, పిపాసకు లోనవుతాడో అవి తీరనినాడు సర్వ నాశనమే అవుతాడు. అందుకే మనిషి పెంచే ప్రేమ వ్యామోహ రహితంగా ఉండాలి. ప్రతిఫలాపేక్షే ఉండకూడదు."

'అందుకేనా, నా ప్రేమను నాలోనే అణగదొక్కేస్తున్నారు. ఎంత స్వార్థం మీది!' అనుకునేది చంపకమాల.

"అయితే అది అందరికీ సాధ్యమేనంటారా?" అని అడిగేది.

"ఎందుకు కాదు? సాధనతో సాధించ లేనిదేదీ లేదు."

"కాని ఒక స్థితిలో అదిఆత్మవంచనే అవుతుందేమో!"

"ఏ స్థితి అది?" గంభీరంగా అడిగేవాడు.

"సతీపతుల హృదయాంతరాళాలలో ప్రవహించేది ప్రేమ కాదని అనలేము. కాని సతిని కోరకుండా పతి, పతిని కోరకుండా సతి ఎలా ఉండగలరు? ఉంటే సృష్టి ఎలా జరుగుతుంది?"

లజ్జారహితమైన ప్రశ్న. అయినా ఆ మనిషి దగ్గిర దేనికీ సంకోచించనవసరం లేదు. దీనికి చిరునవ్వుతోనే సమాధానం వచ్చేది. "సతీపతుల హృదయాలలో ప్రవహించేది ప్రేమకాదు. పరస్పర రూప యౌవనాకర్షణల సంఘర్షణ. అయితే ప్రేమ జనించేది వారి ఆత్మలలో. ఆత్మల ప్రేమ వ్యామోహ రహితమయినది. తనలో నిబిడీకృతమైన మాతృత్వపువాంఛ తీరేవరకే స్త్రీ పురుషుణ్ణి వాంఛిస్తుంది. అది తీరాక వారిలో వాంఛ నశిస్తుంది. అప్పుడు ప్రేమ కూడా నశిస్తుందని అనలేము. నశించదు కూడా. ఏమంటే అది దేహానికి సంబంధించినదికాదు. ఆత్మకు సంబంధించినది. కాబట్టే వృద్ధాప్యంలో కూడ *సతీపతుల ప్రేమ నిలుస్తుంది*" ఈ జవాబుతో చంపాదేవి తల తిరిగిపోయినట్టయేది. అయినా ఓటమి



రాము ఇంట్లో రాము, స్నేహితుడు సోము బంతి ఆట ఆడుతున్నారు. రాము బంతిని తన్నాడు. అది కిటికీ అద్దంలో నుంచి దూసుకుపోయింది. గాజు ముక్కలు పడ్డ శబ్దానికి రాము తల్లి పరుగున వచ్చి చూసి కంగారు పడింది.

"మీ నాన్న రాగానే చెప్పి తప్పు ఒప్పుకో. లేకపోతే చంపుతారు" అని రాముని బెదిరించింది ఆమె.

తండ్రి రాగానే రాము ఎదురు వెళ్ళాడు.

"నాన్నా, హాలులో పెద్ద కిటికీ ఉంది చూశావా? మేము బంతి ఆడుతూంటే..." అని చెప్పబోతూ ఉంటే తండ్రి అడ్డువచ్చి, "ఆ కిటికీ అద్దం కాని బద్దలు కొట్టలేదు కదా?" అని అడిగాడు.

"లేదు, నాన్నా. దాని పక్కనేఉన్న చిన్న కిటికీ అద్దం బద్దలైంది" అన్నాడు రాము.

రాము తల్లికి మనస్తత్వంలో అదొక పాఠం!

నంగీకరించేది కాదు.

"అయితే మాతృత్వపు వాంఛ స్త్రీకి అసహజమూ, అనుచితమూ, లజ్జాకరమూ అంటారా?"

"కానేకాదు. కాని ఎంత గొప్పదివిటీ అయినా పగటి వేళలో ప్రయోజనం పొందనేరదు. ఎంత చిన్న దీపమయినా ప్రయోజనం సాధించగలిగేది కటిక చీకటిలో మాత్రమే. అలాగే తీరని పరిమితులలో ఎంత గొప్ప వాంఛ అయినా నిష్ఫలమే అవుతుంది...."

దీనితో ఒక భారమైన నిట్టూర్పు వదిలి అక్కడ నుండి లేచిపోయేది చంపకమాల. '*జీవితమంతా ఇలా శుష్కవాదాలతోనే గడిచేట్టుగా ఉంది*' అనిపించేది ఆమెకు. అంతా మిథ్య అయిపోయింది. ఎటూ

తన ఆశ తీరేదారి కనిపించలేదు. అన్ని ద్వారాలు ఒక్క సారే ఒక లక్ష్యంతోనే విధాత మూసివేశాడా, అనిపించింది. అయితే ఎందుకని? తను చేసిన నేరమేమిటి? అపరాధమేలాటిదన్నాగానీ దానికి ఈ విధమైన శిక్ష ఎందుకు వేయవలసి వచ్చింది? జన్మగతసంస్కారమా ఇది? ఆలోచిస్తే అంతేనేమో అనిపించింది. తన జీవనజ్యోతి ఆ మార్తాండుని ముందర నిష్ప్రయోజనమే అయింది. ప్రయోజనం పొందాలంటే, చీకటిలో తను తపించాలన్నమాట. కాని అది వెనకదారి. రాచబాటలు వదిలి వెనక దారులు వెదుక్కోడానికి తనేం జారిణీ కాదు, కళంకినీకాలేదు. అయితే ఏ మవ్వాలి? ఏ మవ్వాలి? ఏ మవ్వాలి? అనుకొంటూనే తను ఇరవైఆరేళ్లదయిన సంగతి, జన్మదినంనాడు ఆమెకు హఠాత్తుగా జ్ఞాపకము వచ్చినట్టయింది. దానితో ఎక్కడలేని విరక్తి ఆమె నావేశించింది. అలంకరణపై అభిరుచీ, జీవితంపై లాలసా అన్నీ నశించినట్టయ్యాయి. భవంతినుండి ఆరామంలోని మందిరానికి మకాం మార్చేసింది. భవంతి కేసి చూడటమే మానివేసింది. పతివద్దకు రాకపోకలూ కట్టుబడ్డాయి. కాని సంధ్యవేళ జితేంద్రుడు తోటలోనికి వచ్చేవాడు. అశోకవృక్షం క్రింద కూర్చుని ధ్యానం చేస్తూండేవాడు. చంపకమాల ఉయలపై కూర్చొని పతి చేష్టలను గమనిస్తుండేది. అంతే. మరే మాటామంతీ ఉండేదికాదు. సంధ్య వెల్గులు అంతరించగానే జితేంద్రుడు లేచి వెళ్లిపోయేవాడు. ఆమె ఒక నిట్టూర్పుతో అతనికి వీడ్కోలు పలికి హృదయభారం తగ్గడానికై ఏదో పాడుకొంటూ ఉయలనూగుతుండేది.

## 4

"ఇదేమిటి జితేంద్రా! నీ దీక్ష ఇంకా పూర్తికాలేదూ?" అని నవ్వి, "కల్యాణమయి సంసారివయ్యావు. ఈ చేష్టలన్నీ ఎగిరిపోయి ఉంటాయని భావించాను. కాని ఇదేమిటి మరింత కఠోర నియమాల్లో బిగుసుకుని కూర్చున్నావే!" అన్నాడు భారవి, జితేంద్రుని కళాశాల మిత్రుడు.

భారవి ఆత్మబంధువెవరో ఆ ప్రాంతాలలోనే ఉన్నాడు. అతను మరణించాడు. తదనంతరం అతని ఆస్తిపాస్తులన్నీ చెందేవి భారవికే. అందుకే అవ్యవహారాలు పరిష్కరించు కొందామని వచ్చాడు. అపని పూర్తి చేసుకొని తిరిగివెడుతూ మిత్రుణ్ణి చూసి వెడదామని తిమ్మనగిరి వచ్చాడు. స్నేహితుని సందేహానికి సమాధానం చిరునవ్వుతోనే ఇచ్చాడు జితేంద్రుడు.

"మన రాజా, కృష్ణ, హరీ అంతా అలానే అన్నారు. కాని నాకు అనుమానంగానే ఉంది. 'పెళ్లయింది వధువు రూపసి అని విన్నాం. నిష్ఠలూ, నియమాలూ ఇక దేనికి? గడ్డం, గిడ్డం, వ్రతం దీక్ష అన్నీ ఎగిరి పోయిఉంటాయి. చూసిరా నీకే తెలుస్తుంది' అని వాదించారు. కాని నాఅనుమానానికి తగ్గట్టుగానే ఉన్నావు నువ్వు" అన్నాడు భారవి.

దీనికీ జితేంద్రుని చిరునవ్వే సమాధానమయింది.

స్నానసంధ్యాదులు ముగించి లోపలికి వస్తున్నాడు భారవి. జితేంద్రుని గదిలోంచి వినవస్తున్న గంభీర మంత్రోచ్చారణకు ముగ్ధుడై నిలబడిపోయాడు



శిల్పసుందరి (పాలగల్లు శిల్పానికనుకృతి)

చిత్రం — అబ్దుల్ అలమ్ (నల్గొండ)

భారవి. అతనికి తెలియకుండానే అతని కాళ్లు జితేంద్రుని గదివైపు నడిచాయి.

ఉపాసన ముగిసినట్టుంది. ప్రణామం ఆచరించి లేచి కూర్చున్నాడు జితేంద్రుడు. భక్తి పారవశ్యంతో తన్ను తాను మరిచాడు భారవి.

"నాగానంతో దేవిని ప్రసన్నపరుస్తాను. అనుమతించు జితేంద్రా!" అని కోరాడు దేవి సన్నిధిలో కూర్చుని. రాగద్వేషాల కతీతమయిన మందహాసం కావించి, "భగవదారాధనకు ఒకరి అనుమతులూ, ఆక్షేపణలూ అనుచితం రవీ! నీ తీరులో నువ్వు ఉపాసన సాగించు" అన్నాడు. ధన్యుడయాడు భారవి.

"నీరజ నయనా! సుందరీ! భవానీ
నీరజనయనా! సుందరీ....." అని భగవతీ

రాగంలో అత్యద్భుతంగా గానం చేశాడు భారవి. దేవిచెంత వెలుగుతున్న జ్యోతి దివ్యదీప్తుల్ని విరజిమ్మింది. రుచిరమందహాసాలతో దేవి వర్చస్సే వెలిగిపోయింది. జితేంద్రుడు తన్మయుడయ్యాడు.

"ధన్యుడవయావు రవి బాబూ! నీజన్మ పరమ పావనమైపోయింది. దేవి కరుణా కటాక్షవీక్షణం నీపై ప్రసరించడానికి ఇంకెంతో వ్యవధిలేదు. నీ గానం అమరమైంది. నీ ఆరాధనా అనుపమానమైంది. దశమివరకు నువ్విక్కడే ఉండి నీ మధురగానంతో దేవి నలరింప జేస్తావనే నే నాశిస్తున్నాను" అన్నాడు. వినమ్రభావంతో తలవంచాడు భారవి.

సంధ్యవేళ. ఆరామమందిరంలోంచి తోటలోకి రానున్నది చంపకమాల. మందిర సోపానపంక్తిని ఆమె పాదయుగళి మెట్టేంతలో తీయని ఆలాపన ఏదో ఆమె వీనులలో పడిచేసి తన్మయపరిచి నిలిపివేసింది.

"లే గులాబికింత సొగసు
ఏల కలిగెనో.....?
తీయనైన మధువు మమత
వలపు తలపు లేరికో......?"

మాల్కోస్ రాగంలో సాగుతున్న ఆ మధుర గీతం ఆమె వీనుల నిండుగా ధ్వనించి మంత్రముగ్ధను గావించింది.

"లేమొగ్గలోనె మధువులు మరి
నునుసిగ్గులోన మధురిమలలరె
వయసు సొగసు తూగెగా"—

"ఎవరా పాడేది? జితేంద్రుని మిత్రుడు భారవి కాని కాదుకదా!" అన్న భావనతో ఆమె ఇక అక్కడ నిలవలేకపోయింది. తడబడే అడుగులతో వడివడిగా తోటలోనికి నడిచింది.

"చెలిమి లోన చెలువ మెరి
తలపులోన వలపు లమరి
మరుల మనసు దోచెగా..."

పాట మరీ చేరువయింది. గాయకుడూ సన్నిహితుడయ్యాడు. చేత ఒక గులాబీ పూవు ఉంచుకొని అటు ఇటు తిరుగుతూ పాడుతున్నాడు భారవి. జితేంద్రుడు అశోకవృక్ష చ్ఛాయలో తన్మయుడై వింటున్నాడు.

"చేయ జాచి చెలినిచేర
ఆవరించియున్న ముళ్ళ
చేరనీయ వేలనో.....!"

అడుగు ముందుకు వేసింది చంపకమాల. కాని వెనకనుండి ఎవరో పయ్యెద లాగినట్టయింది. ఉలిక్కిపడి చూసింది. చేలము పట్టుకున్న పొద నవ్వులతో ఊగుతూంది. ఆబంధనాన్ని విడిపించి ముందుకు కదిలేంతలో జితేంద్రుని పలుకూ వినిపించింది.

"ఒక చిన్న గులాబిపై ఎంత చక్కగా పాడావు రవీ!" భారవి మందహాసంచేసి పొదకేసి చూసి విస్మితుడయ్యాడు. ఆవిస్మయ కారణాన్ని గుర్తించిన జితేంద్రుడు చిరునవ్వుతో, "పొదమాటున నిలచి పోయావేం? రా! పర్వాలేదు రా. భారవి పరాయివాడు కాడు. నాప్రియమిత్రుడు. నీకు సోదరతుల్యుడు. సిగ్గెందుకు? రా. ఇలా వచ్చి కూర్చో—" అని భారవి వంకచూసి, "అలా చూస్తావేం రవీ! ఈమె ఈ ఇంటి కోడలు" అని నవ్వి "సంగీత భారతి కీమె అపరిచితకాదు రవీ! దేవి ఎన్నడో వరం ప్రసాదించింది. ఆవరమే ఆమె నిక్కడికి పిలుచుకువచ్చింది" అన్నాడు. పతికి కాస్త ఎడంగా పాదాల చేరువలో కూర్చొన్నది చంపాదేవి.

"కృష్ణునిపై ఏదేనా ఒక పాట పాడు రవీ! చేరువలో ఉండి చంప వింటుంది. నాకూ సంతోషం అవుతుంది..." అన్నాడు జితేంద్రుడు.

భారవి తలపంకించి, "బహుశః వీరి దగ్గిర సితారో వీణో ఉంటుందనుకొంటాను. ఉంటే తెప్పించండి" అన్నాడు. జితేంద్రుడు సంతోషంతో తల ఊగించి, "లేకేం రవీ! వాటికేం కొదవలేదు. అన్నీ ఉన్నాయి. తెప్పించు చంపా!" అన్నాడు. చంపాదేవి లేచివెళ్లింది. కొంతసేపటికి తిరిగి వచ్చింది. ఆమె వెంట వచ్చిన దాసి వీణ తీసుకువచ్చింది. ఆమె నుండి దాన్ని అందుకొని పరీక్షించి చూసి, "చాల మంచిదీ, పురాతనమైనదీ జితేంద్రబాబూ!" అన్నాడు భారవి, వీణ తీగను శ్రుతిచేస్తూ. చంపాదేవి భారవి వంక చూస్తూ ఉండిపోయింది. జితేంద్రుడు చెలికాని చేష్టలు ఉత్సుకతతో గమనిస్తున్నాడు. సింధుభైరవి రాగంలో అతి శ్రావ్యంగా పాట ప్రారంభించాడు భారవి.

"కృష్ణా ... !"

గోపబాలుని దివ్య జీవిత గానంతో జితేంద్రుని హృదయవిహంగం బృందావన వీథులలో విహరించగోరి ఎగిరిపోయింది. తనువు యమునా స్రవంతిలో ఈదులాడినట్లు ఉప్పొంగిపోయింది.

రాధామాధవుల స్నేహసమ్మోహిత ప్రణయ విన్యాసస్మృతితో చంపకమాల హృదయస్రవంతి రాగలహరులతో పొంగి పరవళ్ళు తొక్కింది. ఆమె వీనుల్లో అనంతకోటి మంజీరాలు ఝణఝణమని నిక్వణించి మైమరిచిపోయేట్టుగా చేశాయి.

"అహా! జన్మ తరించిపోయింది భారవీ! చాలు, ఇక చాలు. ఆ లీలామానుష విగ్రహాకారుని దివ్యలీలలు కన్నులకు కట్టినట్లుగా నీ గానవాహినిలో కదిలించావు. విని నా జన్మా, పాడిన నీజన్మా ధన్యములైపోయాయి. నీ ఈ అనన్య గానమాధురికి జగతిలో సగం కావ్యమై అమర మైపోతుంది భారవీ! అమరమైపోతుంది!" అని లేచి ఉన్మత్తునిలా తలపంకిస్తూ సౌధంకేసి వెళ్ళిపోయాడు జితేంద్రుడు. చకితుడయ్యాడు భారవి.

"మీరంతగా చకితులయ్యేది వారి నిష్క్రమణానికేనా, రవిబాబూ?" అన్నది చంపాదేవి.

ఈ మాటలతో తెప్పరిల్లి ఆఁ అని ఇటు చూశాడు.

"వేళ ఎప్పుడో దాటిపోయింది రవిబాబూ! వేళ మీరి ఇక్కడ నిలవడమన్నది ఎప్పుడూ జరగలేదు. కాని మీ గానమాధురి వారి అంతర్యాన్నే మైమరువజేసింది. సంగీత ప్రభావానికి కఠిన శిలలు కూడా కరుగుతాయని అంటారు. కాని అది అతిశయోక్తి అని నేను భావించవలసి వచ్చింది. కాని నేటి ఈ ప్రమాణంతో నా భావపరంపరే దెబ్బ తినిపోయింది" అని నిట్టూర్చింది చంపకమాల. హతబుద్ధే అయ్యాడు భారవి, ఆమె భావం అర్థంకాక.

• • •

"వీణ మీటిన గాని
పాట పాడిన గాని
వినిపించనే లేద కృష్ణా?
నీ చెలి పిలుపు కృష్ణా....."

శరత్కాలీన ప్రభాత పవనాల చల్లదనానికి హాయిగా నిద్రపోతున్న భారవి ఒక్కసారి జాగృతుడయ్యాడు.

పాట వినిపించేది ఎక్కడనుండి? తోటలోనా? బృందావనిలోనా? కలలోనా? అతని ఊహలు పూర్తి అయ్యేసరికి పాట చివరి చరణంలోకి వచ్చింది...

"తెలిపేది కనుదోయి
తెలిసేది మనసోయి
కలిపేది చెలిమోయి
కలిసేది మమతోయి ... కృష్ణా ..."

ఎవరా పాడేది? రాధా? గోపికా? కాదు. "చంపాదేవి సంగీత భారతికి అపరిచితురాలేంకాదు" అని నిన్ననే జితేంద్రుడు సూచనగా చంపాదేవి ప్రతిభను తెలిపాడు. కాని అది ఇంతటిదని తా నూహించలేకపోయాడు. అసలు చంపాదేవి, జితేంద్రుల అనుబంధమే తన కర్థంకావడంలేదు. దాంపత్య చిహ్నలేవీ వారిలో పొడ చూపడంలేదు. అలాగని చంపాదేవిలో ఏ నిరాశా, ఏ చింతా, ఏ విరక్తి లేని గంభీరతే కానవస్తున్నది. ఏమిటి కారణం? జితేంద్రుని దివ్య తేజస్సే ఆమెనలా మార్చివేసిందా? ఆలోచనలోపడి ఆతనెప్పుడు తోటలోకి వచ్చేశాడో అతనికే తెలియని అయోమయంలో పడ్డాడు భారవి.

పాడుతూ ఊయల ఊగుతూన్న చంపాదేవి ఆ తరులతాపుష్ప సంచయాలమధ్య, ఆ ప్రభాతకాంతిలో వనదేవతలా శోభిస్తోంది. తెలియని వికార భావమేదో ఆవరించగా నిశ్చేష్టతతో ఒక పాదదాపున నిలిచిపోయాడు భారవి. కాని ఆతనిని గమనించి పాట ఆపి ఉయ్యాల దిగిపోయింది చంపాదేవి. చిరులజ్జతో ఆమె మోము వాలిపోయింది.

"చంపాదేవీ! ఏమిటి మీరు పాడింది! అసలు పాడింది మీరేనా? నావీనులు నన్నే భ్రమింప జేశాయి చంపాదేవీ! ప్రభాతవేళ ఎంత అదృష్టం!" అన్నాడు భారవి.

చంపాదేవి మోవిరేఖలపై మందహాసం లాస్యమాడింది.

"అదంతా అతిశయోక్తి రవిబాబూ! లేకపోతే అంత చక్కగా నేను పాడగలనా!" అన్నది మెల్లిగా. భారవి తల పంకించాడు. భావోద్దీపనతో "ఆ ప్రశ్న అడగవలిసింది నన్నుకాదు చంపాదేవీ! వినిన ఈ




చిత్రం—సజ్జా కుమార్ (మద్రాస్-21)

ఆరామాన్ని ప్రశ్నించండి. తన్మయతతో తలలూచిన ఈ కొమ్మరెమ్మల నడగండి. విరిసిమురిసిన ఈ పుష్పతతుల్నే గమనించండి. అవే మీ ప్రశ్నకు జవాబు ఇవ్వగలవు. సాక్ష్యమూ చెప్పగలవు" అన్నాడు. ఎందుకనో ఆమాటతో ఆమె కనులు చెమర్చాయి. ఆనాటి తొలిరేయి తా నీపాట పాడింది. దాని ప్రభావం పని చెయ్యకపోగా మందలింపులే లభించాయి. అలాటి అసభ్యపు గీతిక ఆలాపించినందుకు అత్తగారి ఆగ్రహానికీ గురి అయింది. ఆ ఆగ్రహానికి సంకేతంగా తన వీపుపై విరుచుకుపడిన అత్తగారి హస్తఘాతానికి స్మృతిచిహ్నంగా ఈనాటికీ ఇంకా మాయని మచ్చ మిగిలే ఉంది.

"కాని అవన్నీ నోరు లేనివి రవిబాబూ! రుచీ, అభిరుచీ, రాగమూ, ద్వేషమూగల జీవరాసుల్ని మెప్పించలేని నా గానమూ ఒక గానమేనా?" అన్నది అశ్రువులతో మందహాసంచేసి.

"అది అసంగతం!" అన్నాడు భారవి ఉత్తేజితుడై.

"ఏది?"

"మెప్పించడం, మెప్పించలేక పోవడమన్నది అభిరుచుల్ని బట్టి ఉంటుంది చంపాదేవీ! ఒక కఠిన శిలను కదల్చలేనంత మాత్రాన పవనానికి శక్తి లేదని అనలేము" అన్నంతలోనే "అది సరే. కాని నాపాట సౌధంలోకి వినిపించిందా?" అని అడిగింది చంపాదేవి.

"లేదు. రేయి నిద్రపట్టక తోటలోకి వచ్చి తిరుగాడుతూంటే ఒక తరుచ్ఛాయలో నిద్ర కమ్మేసింది. ఆ తరుచ్ఛాయే మీ ఉదయ గానానికి పరవశించి సంబర పడుతూంటే నాకు మెలకువ వచ్చింది. వచ్చి వెంటనే నన్నిక్కడికి తీసుకు వచ్చింది" అన్నాడు.

చంపాదేవి మందహాసంచేసి "మీరు గాయకులేగాక కవులు కూడాను" అన్నది. గగనంలోకి చూస్తున్న వాడల్లా తనూ నవ్వి "ఆఁ. ఉహుఁ కానేకాను" అని, "సరే వెడతాను" అని మెల్లిగా వెళ్ళిపోయాడు. చంపాదేవి ఊయల ఎక్కి మళ్ళీ పాట నారంభించింది.

"వీణ మీటినగాని, పాట పాడినగాని
వినిపించనేలేద, నీ చెలిపిలుపు కృష్ణా!
ఆటలాడదు వలపు వెన్నెల
పాటపాడదు కలువ కన్నియ
పాట లేలోయి ప్రేమకు, స
య్యాట లేలోయి ప్రేమకు కృష్ణా!
సిగ్గు చెందదు కొంటె కోయిల
మొగ్గ జేరదు గండుతుమ్మెద
సిగ్గు లేలోయి ప్రేమకు, లే
మొగ్గ లేలోయి వలపుకు కృష్ణా!
ముద్దు లాడవు కనుల కమ్మగ
పద్దు సేయవు మనసు మమతలు
తెలిపేది కనుదోయి
తెలిసేది మనసోయి
కలిపేది చెలిమోయి
కలిసేది మమతోయి కృష్ణా!"

పాట పాడుతుంటుంటే ఆనాటి మధురానుభూతులన్నీ మంచుతెరల్లా కమ్మి మైకం కలగజేశాయి. 'అంతా అడవిగాచిన వెన్నెలే అయింది. ఆ ఆశలూ ఊహలూ అన్నీ కనులముందే కర్పూరంలా హరించిపోయాయి. ఎండమావిని వెంటాడిన అవివేకమే చివరికి మిగిలింది. అంతేనా! ....' అనుకుంది.

• • •

ఆసంధ్యవేళ పతివద్దకుపోయి ఒక విన్నపం కావించింది చంపాదేవి—"రవిబాబువద్ద నేను సంగీతం నేర్చుకుంటాను" అని.

"ఇంకా నువ్వు నేర్చుకోవలిసినది ఉందా?" అని అడిగాడు పతి.

"అవును. ఎంతో ఉన్నది" అన్నది సతి.

"అయితే సరే. కాని ఎక్కడ?"

"ఆరామంలో."

"సరే."

ఆవెంటనే భారవినీ అడిగింది చంపాదేవి.

"మీవద్ద నేను సంగీతం నేర్చుకోవాలని సంకల్పించుకున్నాను. నేర్పుతారా?"

"నేనా! మీకా?" అని విస్మితుడై. "మీకు గురుత్వం వహించడానికి నాదగ్గి రేముంది చంపాదేవీ!" అన్నాడు భారవి.

"నిర్మల భావమూ, మంజుల గానమూ, జగత్కల్యాణ మంత్రమూ. అవే నేను నేర్చుకోవాలని అనుకుంటు

న్నవి—" అన్నది.

స్తబ్ధుడయ్యాడు భారవి. "మీరన్నమాటల భావమే నాకర్థం కావడంలేదు చంపాదేవీ! ఇక నేనేం నేర్పగలను?"

"నేర్పక తప్పదు రవిబాబూ! దీనికి స్వామి అనుమతి కూడా అయింది—"

రెండు నిమిషాలు ఏమీ మాట్లాడక ఆమె ముఖంలోకి చూస్తూ ఉండిపోయి తరవాత అన్నాడు భారవి: "వాస్తవానికి మీరు నాదగ్గర నేర్చుకోదగినది ఏమీ లేదనే నా ఉద్దేశం చంపాదేవీ! కాని ఎందుకో మీ స్నేహాభిమానాలు వాంఛిస్తున్నది నా మనసు. సరే. నేర్పుతాను. కాని లోకులేమంటారు? అది ఆలోచించారా?"

"పతికన్న నాకు లోకులెక్కువగాదు..." అని తలవంకించి అటు తిరిగిపోయి, "జీవితమంతా మీ సాన్నిధ్యంలోనే గడపాలన్న తృష్ణ నాలో కలిగినమాట వాస్తవం రవిబాబూ! కాని అది అనుచితమూ, అమంగళకరమూ అయిన వాంఛ అని నాకు తెలుసు. అందుకే నాతృష్ణను నాలోనే అణుచుకుని కేవలం మీ స్నేహానురాగాల్ని మాత్రమే ఆశిస్తున్నాను. అవే నేర్పండి" అని ఆ వెంటనే అక్కడనుండి తటిల్లతలా దూసుకుపోయింది. జడుడే అయ్యాడు భారవి ఆమాటకూ, పోకకూ.

## 5

భారవి తోటలోనికి వచ్చాడు. ఆరామ మందిరం దిశనుండి పాట వినవస్తోంది.

"మధురమైన ప్రేమలోన
మనసు దాగెనే, మమత తూగెనే.
సొగసు కదా అరుదైనది
వయసు కదా తీగేటిది.
వయసు సొగసు పొంగు సరసి
వలపు నావ సాగెగా.
మొగిలు గదా వెలుగు వెలుగు
కొలను గదా వలపు విరియు
నింగినేల లాయలుగాగ
తనువు తేలిపోయెగా!

మనసు కదా స్థిరమైనది
మాటకదా విలువైనది
మనసు మాట ఒకటికాగ
మనికి బరువు కాదుగా!"

భారవి దర్శనంతో పాట ఆగిపోయింది. ఆవెంటనే చంపాదేవి తీయని స్వరం తేటగా ధ్వనించింది—

"రండి రవిబాబూ!" అని.

భారవి మందహాసం గావించి ఆమెను చూస్తూ ఉండిపోయాడు.

ఊయల ఊగుతూనే, "కూర్చోండి రవిబాబూ! అదిగో ఆసనం" అన్నది చంప.

చూసి "ఇక్కడ ఇదివరకిది లేనట్టుందే" అన్నాడు.

"లేదు. నేడు మీకోసమే ఏర్పాటు చేశాను. కూర్చోండి."

కూర్చున్నాడు భారవి.

"నేటినుండి సంగీత సాధన మొదలన్నారు. మరి అలా ఊరికేనే వచ్చారేం?"

"ఊరికేనే రాక?" అని నవ్వి "మరెలా రావాలి?" అన్నది చంప.

"వీణగాని, సితారుగాని—"

"ఉహూఁ. అవి నా కక్కరలేదు. మీరు పాడుతుండండి. నేను వింటుంటాను — "

"ఊయల ఊగుతూనా!" అన్నాడు నవ్వి.

"అవును" అని తల ఆడించింది.

"అయితే అది సాధన ఎలా అవుతుంది? నేను పాడడం మీరు వినడం."

అన్నది.

"భారవి నవ్వాడు. "ఉయ్యాలపై మీకు చాలా మక్కువ లాగుందే" అన్నాడు.

చంపా నవ్వింది. ఆ నవ్వు వెన్నెల వెలుగునుమించిపోయింది. "మక్కువే మరి" అని నిట్టూర్చి, "మనిషి కనేక సరదాలుంటాయి రవిబాబూ! కాని అన్నీ తీరే అవకాశాలే ఉండవు. నాకు దక్కిందల్లా ఈ సరదా ఒక్కటే. చిన్నతనంనుండి నాకిదో సరదా రవిబాబూ! రాత్రీ పగలూ అంటూ లేక ఎప్పుడు మనసయితే



శిశుక్రీడ ఫోటో — ఎస్. సత్యనారాయణ (తిరుపతి)

"నే కోరింది అదే రవిబాబూ! వీణా, సితారూ నేనెరగనివికావు. వీణ మీటిమీటి నావేళ్ళు అరిగిపోయాయి. శ్రుతిచేసి శ్రుతిచేసి తీగలూ దుర్బలములయ్యాయి. ఇక నేను వినాలనుకున్నదీ, నేర్చుకోవాలనుకొన్నదీ మీగానమే —" అన్నది చంప జ్యోత్స్నాకాశంలోకి చూస్తూ.

భారవి తల పంకించాడు.

"పాడ్తా. పాడడానికి నాకేం అభ్యంతరంలేదు. కాని —"

"కానీ గీనీ ఏం లేదు రవిబాబూ! మీరు పాడవలసిందే, నేను ఊయల ఊగుతూ వినవలసిందే"

అప్పుడు ఊగుతూండేదాన్ని.

'రాత్రిపూట ఊగకూడదమ్మా! దయ్యాలు అలుగుతాయి.' అని మాదాది మందలిస్తున్నా లక్ష్య పెట్టేదాన్నిగాను. అని, "వెన్నెల వెలుగులో ఊయల ఊగుతూ తియ్యగా పాడుకొంటూంటే ఎంత హాయిగా ఉంటుందని! ఆశించి పొందని ఆనందాలను ఈ అల్పానందంతో నయినా పొందగలుగుతాను. అందుకే దీనిపై నాకింత మక్కువ" అన్నది చంపాదేవి. భారవి మాట్లాడలేదు.

"పాడండి రవిబాబూ!"

(తరువాయి 118వ పేజీలో)

(87 వ పేజీ తరువాయి)

"ఆగండి. మీదాసిని రానీయండి."

"దాసీ దేనికి?" విస్మయంగా చూసింది చంపాదేవి.

భారవి నవ్వాడు. "అలా విస్మయపడతారేం? దాసిని సితార్ తెమ్మన్నాను." అన్నాడు.

"ఓ"–ఊయల గొలుసును పట్టుకున్న చేతిపై తల ఆనించి చూస్తూ ఉండిపోయింది చంపాదేవి.

దాసీ వచ్చింది. సితారు భారవిచెంత ఉంచి వెళ్ళిపోయింది. సితార్ శ్రుతిచేసి ఆలాపన కావించాడు భారవి.

"రాధా మాధవ జీవనలీలా
కాదే మనసున మమతలడోలా!"

తనూ మెల్లగా ఆరాగాన్ని అనుసరిస్తూ పాడసాగింది చంపాదేవి. ఆమెకు తెలియకుండానే ఆమె కాళ్ళు నేలనొక్కి ఉయ్యాల ఊపుతున్నాయి.

"మనసే యమునా తటికాగా
మదికే బృందావని అయె!
మమతే, సుమమై మధువులు విరియ."

ఊయల ఊపునకు పొన్నపూలు రాలిపడుతున్నాయి. ఆ రాలిన పూలు చంపాదేవి తనువు నలంకరిస్తూ ప్రణయ పారవశ్యం కలిగిస్తున్నాయి.

"తలపే పిల్లనగ్రోవాయె
వలపే తీయని రవ మాయె
స్మృతులే,లయయై బ్రతుకులుమురియ"–

సితారు శ్రుతులు అద్భుతంగా ధ్వనిస్తున్నాయి కల్యాణి రాగాలాపనలో జగమే కల్యాణ శోభతో వెలిగిపోయింది. తీయని ఊహాలతో తనువు పులకరించి ఆ పులకలకు సంకేతంగా రుచిర కాంతుల చిరునవ్వులు చంపాదేవి లేతపెదవులపై లాస్యం చేశాయి

"నగవే వెన్నెల వెలుగాయె
వగలే చకోరి తపనాయె
సిగ్గే కలువై వాంఛల విరియ"–

ఉయ్యాల అతివేగంతో ఊగుతూంది వ్యాకులపాటు చెందాడు భారవి.

"చంపాదేవీ!" అని పిలిచాడు ప్రకంపితస్వరంతో

"ఆఁ"–ఉలిక్కిపడి చూసింది చంపాదేవి.

"పాట అయిపోయిందా రవిబాబూ!" అన్నది ఆర్ద్రస్వరంతో. ఆ ఆర్ద్రత కంఠతరార్థం అతనికంతు పట్టలేదు. విస్మయంగా చూసి "అలా అయిపోయారేం చంపాదేవీ! పాట బాగాలేదా!" అన్నాడు

"ఉహూ ఏంలేదు" అని తేలికగా నవ్వి "పాట బాగా లేదా! ఎంతమాటన్నారు రవిబాబూ!" అన్నది చంపాదేవి.

ఆనాటికి అది అయింది. మరొకనాడు.

"ఇలా ఎన్నాళ్ళు చెప్పండి చంపాదేవీ! నేను పాడడం మీరు వినడం. దీనివల్ల నా గురుత్వానికి సార్థకత ఏమిటో నా కర్థం కావడంలేదు" అన్నాడు భారవి.

చంపాదేవి సన్నగా నవ్వింది. "సార్థకత లేదని ఎవరన్నారు రవిబాబూ!"

"నాకే అలా అనిపిస్తూంది."

"ఎలా? అలాగేనా!" అని నవ్వి "సరే. నేటనుండి నేను పాడుతుంటాను. మీరు వినండి మీశిష్యురికానికి రాకముందు నా పాటలు విన్నారుగా మీరు. ఇప్పుడు విని వచ్చిన మార్పేమిటో గమనించండి" అని జవాబు కోసమయినా వ్యవధి ఇయ్యక పాడసాగింది చంపాదేవి.

"నీడలా నిను వెన్నాడినా, నా
జాడ కనుగొనలేవో కృష్ణా"–

ఉలిక్కిపడ్డాడు భారవి

"అలా చూస్తారేం? సితారు వాయించండి" అని మళ్ళీ పాడసాగింది చంపాదేవి.

"తెలుపలేను మాటలో నా కథా
చూపలేను చేష్టలో నా వ్యథా
మనసులోని వ్యథా, కథా
(నీ) మనసె తెలియవలెను గదా!"

సితారు మెట్లపై కదులుతూన్న అతని వేళ్ళలో అనూహ్యమైన కంపన ఏదో ప్రబలింది. అర్థంలేని భావంతో మనసు విచలించ సాగింది.

"వెలియైతి నేను, సరదాలకే
బలియైతి నేను, సమాజానికే
అన్నీ కలిగి ఏమీ లేనిదాననై,
పరదీననై, కడుదీననై నీడలా"–

భారవి ఇక నిలవలేకపోయాడు సితారును ఎదిరి పరితప్తహృదయంతో వ్యథిత స్వరంతో "చంపాదేవీ!" అన్నాడు మెల్లిగా కాని ఆమె చూపు ఇటులేదు. ధ్యాస లేదు పాటలో లీనమైపోయింది. భారవి లేచాడు

"రక్తి కోరి, ముక్తి కోరి
నీవు వినా దారిలేక
కడకు నీలోనె చేరిపోవ"–

దుస్సహంగా రెండుచేతులతోనూ చెవులు మూసుకుని గబగబా అక్కడనుండి వెళ్ళిపోయాడు అతని నిష్క్రమణకు విస్మయమూ చెందలేదు చంపాదేవి వ్యథా చెందలేదు మెల్లిగా నవ్వుకుంటూ అదేపాట పాడుకుంటూ ఉయ్యాల ఊగుతూనే ఉంది.

• • • •

"కూర్చో! నీ మన్ననలందుకోడానికి నే నిక్కడికి రాలేదు ఏనాడూ రాలేదు రానుకూడా. కాని ఒక విషయం" అని "కోడలు నిశివేళ తోటలో సంగీత సాధన చేస్తూంది విన్నావా!" అన్నాడు మహేంద్రుడు

జితేంద్రుడు తలపంకించాడు "అవును. అది నా అనుమతిమీదే జరిగింది ఆమె ముచ్చట కాదనలేక —"

"అది ముచ్చటే గావచ్చు దానికి నీవు అనుమతి ఇవ్వవచ్చు కాని ఒంటరిగా మాత్రం కాదు —"

"అవును నాన్నగారూ! భారవివద్ద ఆమె సంగీతం అభ్యసించాలని అభిలాషించింది — "

"అభిలాష!" మహేంద్రుడు గంభీరుడయ్యాడు. "స్త్రీ హృదయంలో అభిలాషలకంతే ఉండదు జితేంద్రా! కాని అవన్నీ ఉచితములూకావు వాంఛనీయములూకావు. అనుమతించ దగినవీగావు ఆసంగతి నీకు తెలియదా?"

తండ్రి మాటలలోని భావంతెలిసి జితేంద్రుడు చాలా బాధపడ్డాడు.

"మాటాడవేం?"

జితేంద్రుడు దేం మాట్లాడగలడు? కళంకమెరుగని అతని అంతర్యం కళంకఛాయలెలా సందేహించగలదు?

"నీ వైరాగ్యతత్త్వం అలాటి అభిలాషల అంతరార్థం గ్రహించలేక అనుమతిస్తే అనుమతించి ఉండవచ్చు కాని అది లోకరీతికే విరుద్ధం వంశమర్యాదలకే కళంకం. అయితే అది నీ కర్థంగాదు—"

"నాన్నగారూ!" స్థాణువే అయ్యాడు జితేంద్రుడు. తండ్రి మాటలలోని గూఢార్థాన్ని కించిత్తు కూడ అతను గ్రహించలేకపోయాడు కాని సూచనగా ధ్వనించిన అమంగళాన్ని అతను సహించలేకపోయాడు

"క్షమించండి నాన్నగారూ! భారవి నా ప్రియ మిత్రుడు. చంపాదేవి నిర్మలమూర్తి. వారి కళంకాన్ని నేను విశ్వసించలేను. సహించలేను." అన్నాడు బాధగా.

మహేంద్రుడు కాస్త చలించినట్టు అయ్యాడు.

"సరే. జరిగినదేదో జరిగిపోయింది. ఇకపై అలాంటివి జరగరాదు. ఆజ్ఞ కాదిది. అభ్యర్థన. మన్నిస్తావనే ఆశిస్తున్నాను. నే నీరోజే వేటకు

దిండికోసం తిప్పలు — ఫోటో — ఎమ్. శ్రీ రామప్రసాద్ (మద్రాస్-17)



వెడుతున్నాను. తిరిగి వచ్చేటప్పటికి నీస్నేహితుడు భారవి ఇక్కడ ఉండటానికి వీలులేదు'' అని వెళ్లడాని కుద్యుక్తుడయ్యాడు.

''ఆఁ''– వెలవెలబోయింది జితేంద్రుని జ్యోతిర్మయువదనం.

''బహుశా ఇది నీకు కష్టమే కావచ్చు. కాని తప్పదు. భారవి ఇక ఇక్కడ ఉండతగడు. మన వంశమర్యాదలినాటివికావు. ఇంతవరకు వాటికెలాటి మచ్చా ఏర్పడలేదు. ఇకపై ఏర్పడడానికి వీలులేదు. అంతే'' అని వెళ్లిపోయాడు. నిశ్చేష్టుడైపోయాడు జితేంద్రుడు.

కాని అనిశ్చయంగా అక్కడకు వచ్చి పతి గదిలో మామగారి స్వరం విని వెలపలే నిలచిపోయిన చంపాదేవి ఆ దూషణ తీవ్రవాక్యాలకు ఆవేశంతో కంపించిపోయింది. కోడెతాచులా బుసలు కొట్టింది ఆమె అభిమానం.


'భారవి ఇక ఇక్కడ ఉండడానికి వీల్లేదు. ఎందుకని? ఏం చేశాడని? లోకసంప్రదాయాలకు, వంశమర్యాదలకు కళంకం తెచ్చే ఛాయలు తమ ప్రవర్తనలో గోచరించాయా? హుఁ. ఎంతహీనం వారి దృక్పథం? ఎంత సంకుచితం వారి భావం? ఎంత తుచ్ఛాలు వారి మనసులు? ఛీ! ఛీ!'

అనూహ్యమైన ఆందోళనతో అంతులేని ఆవేశంతో ఆమె దినమల్లా తపించిపోతూనే ఉంది. ఈ అసత్యాభియోగానికి పతిదేవుని తీర్పు ఏమిటో అన్నదే ఆమెకు దురూహ్యం అవుతూంది. స్వామి అసత్యమాడడు. అది ఆమెకు తెలుసు. కాని నిజం చెప్పి భారవిని అతడు ఎలా పొమ్మనగలడు? ఆ నిష్కళంకమూర్తిపై నీలాపనిందలు మోపి ఎలా సమాధానపడగలడు? ఎంత ఆవేదన పడినా, తన తప్పులేదనీ, తండ్రి ఆదేశానుసారమేననీ, తన అవిశ్వాసం కాదనీ ఎంతగా తపించినా మిత్రుని నిందించలేకపోయినా భారవి గుండె పగలకమానదు. ఇక ఆశకలాలను తిరిగి అతకడం ఎవరి తరమూకాదు. కాని దాని ఫలితమేమిటో తను అప్పుడు వివరించి నిరూపించాలి. అంతవరకు తనలో పొంగే ఈ ఆవేశాగ్రజ్వాలను తను అణుచుకోక తప్పదు. పతివాక్కుకై నిరీక్షిస్తూ లోలోనే పరితపిస్తూ ఉండిపోయింది చంపాదేవి.

అయితే స్వామి తననే పిలిచి ''నీఅభిలాషే ఇంత అనర్థానికి హేతువయింది. దోషివినీవే. శిక్ష నీవే అనుభవించాలి'' అని అంటే తనేం చెప్పాలి? ఆ శిక్ష ఎలాటిదన్నాగానీ ఎలా భరించాలి? ప్రతీకార మేవిధంగా జరగాలి? ఏది జరగబోతున్నదని అనుమానించారో అదే చివరికి చెప్పి మరీ జరిగితే వీళ్ల బ్రతుకులెలా ఉంటాయి? తమ ఊహలు నిజమయినాయని సంతోషిస్తారా లేక దారి తెలియనివాళ్లకు దారి తామే చూపామని కుంగిపోతారా? జితేంద్రుని తీర్పు వెల్లడి అయితేగాని ఏదీ నిర్ణయమవదు. అంతే.....

• • •

తోటలోనికి వచ్చాడు భారవి. అతని ముఖంలో కళాకాంతులన్నవి లేనేలేవు. అది అవ్యక్త వేదనతో, అంతర్లీనితమైన లజ్జతో మ్లానమై ఉంది. ఊయల సమీపంలో ఎంతసేపు తారట్లాడినా ఎదురు చూసిన వారెవరో రానేలేదు. అంతలో ఎవరిదో మంజీరక్వణం లీలగా విని, ఆ ధ్వని వినవచ్చినదిశగా నడక సారించాడు. అతన్ని ఆ అచేతనశక్తి మెల్లిగా మందిరం లోనికే కొనిపోయింది. అక్కడ కనులకు గానవచ్చిన దృశ్యానికీ, చెవులకు వినవచ్చిన మంజులధ్వనులకూ స్థాణువే అయ్యాడు భారవి.



గోపురపాళి

ఫోటో — కె. రాజారామ్ రావు (మద్రాసు - 33)

రాధా మాధవ దివ్యమంగళ విగ్రహంముందు, అతి సుందరంగా అలంకరించుకొని నాట్యం చేస్తూంది చంపాదేవి. ఆ కళాతేజస్సులకు విభ్రాంతుడయ్యాడు భారవి. దివ్యమైన ఆవేశమేదో అతన్ని ఆవేశించింది. రెండు చేతులూ జోడించి రాధా రమణుని చరణాల చెంత మైకంతో సాగిలపడిపోయాడు. అనిర్వచనీయమైన తన్మయోద్రేకంతో నృత్యం సలుపుతున్న చంపాదేవి ఈ సంఘటనను గమనించనేలేదు. అభినయం పూర్తిచేసి వందనం సమర్పించే తరుణంలో అడ్డంగా పడి ఉన్న భారవిని గుర్తించి దిగ్భ్రాంతురాలయ్యింది.

''ఎప్పుడు వచ్చారు రవిబాబూ! ఏమిటి మీ ఈ వింతచేష్ట!'' అన్నది కలవరపాటుతో. భారవి లేచి తలపంకించాడు.

''వింత చేష్టే చంపాదేవీ! కాని ఎంత అదృష్టం! దివ్యచరితుని సందర్శనమే నాకు లభ్యమైనట్టయింది'' అని తన్మయతతో కన్నులు మూసి తెరిచి ''ఇన్ని కళలను ఇంత అదృష్టాన్ని ఒకేవ్యక్తిలో ఎలా పొందుపరచగలిగాడన్న విస్మయమూ, అపనమ్మకమూ, ప్రత్యక్ష సందర్శనంచేత నమ్మకమూ కలుగుతున్నాయి చంపాదేవీ!'' అన్నాడు భావావేశంతో.

చంపాదేవి నిట్టూర్చి భారంగా తలపంకించి ''కాని ఏమీలేని పేదనే నేను రవిబాబూ! ఏదీ అందని దౌర్భాగ్యురాలిని'' అన్నది. దీనితో భారవి ముఖం ఒక్కసారి నల్లబడిపోయింది. ఇక నోరూ విప్పలేకపోయాడు. తలా ఎత్తలేకపోయాడు. అతని ఈ పరివర్తన విస్మయంగా చూసి ''ఒక్కసారి అలా అయిపోయారేం రవిబాబూ!'' అన్నది చంప. భారవి తేరుకొని ''అహఁఏంలేదు'' అని వెనుదిరిగి ''నేను రేపు వెళ్లిపోతున్నాను చంపాదేవీ! ఇక రానేమో కూడా. అందుకే తుదిమాటకై వచ్చాను...'' అని వెళ్లబోయాడు. కాని చంపాదేవి చిరునవ్వుతో ''ఆగండి రవిబాబూ! ఇప్పుడే వీడ్కోలు పలకకండి. తోటలో ఒక్క నిమిషం కూర్చోండి. నేనిప్పుడే వచ్చేస్తాను'' అన్నది. భారవి వెనక్కి తిరిగి ఏదో అనాలనే నోరు విప్పి ఆమె ముఖంలోకి చూసి గొంతు పెగలకపోగా భారంగా తలపంకించి మెల్లిగా వెళ్లిపోయాడు. నిట్టూర్చి అతని వెళ్లినవైపే చూస్తూ ఒక్క నిమిషం అలా ఉండిపోయి తరవాత మాధవుని క్రీగంట వీక్షించి కనులు మూసి ''ప్రభూ'' అని పలికి ఆవెంటనే తనూ తోటలోనికి వెళ్లింది.

ఉయ్యాల చెంత నిలుచున్నాడు భారవి.

''మీరు వెళ్ళేది ఎప్పుడు రవిబాబూ! ఉదయమా?''

ఈ మాటతో వెనక్కి తిరిగి ''అవును. సూర్యోదయపువేళలో ప్రయాణం నిశ్చయమైంది'' అన్నాడు ముందుకు నడుస్తూ.

''ఉదయమా?'' అని మునిపంటితో పెదవినొక్కి ఏదో యోచించి గభాలున అటు తిరిగి ''వద్దు రవిబాబూ! ఉదయాన వద్దు. ఈ గోముఖవ్యాఘ్రాలు కృత్రిమ సంప్రదాయాలతో మిమ్మల్ని సాగనంపడం నేను సహించలేను...మూడోజాములో మీరు ప్రయాణానికి సిద్ధంకండి రవిబాబూ! నేనే వచ్చి మిమ్మల్ని సాగనంపుతాను —'' అన్నది.

విస్మయంగా చూశాడు భారవి. ''మీరా?'' అన్నాడు. ''ఏమిటి చంపాదేవీ! మీరు నన్ను సాగనంపుతారా? అదీ మూడోజాము వేళలో! —''

''అవును అప్పుడే, కాని ఇప్పుడు దాని విషయమై నన్నేం ప్రశ్నించవద్దు. అనుమానించనూవద్దు. అంతే.''

భారవి హతబుద్ధిలా ఆమెకేసి స్థిరంగా చూస్తూ ఒక్కక్షణం ఉండిపోయి తరవాత హఠాత్తుగా నిట్టూర్చి "సరే" అని వెళ్లబోయాడు.

"వెళ్లిపోతున్నారా రవిబాబూ!" అతిదీనంగా వినిపించిన ఆమె స్వరం అతన్ని నిలిపేసింది.

"వద్దు రవిబాబూ! అప్పుడే వెళ్లకండి. ఒక్కపాట వినిపించి మరీ వెళ్లిపొండి. మన తుది సమాగమానికి స్మృతిచిహ్నంగా నాలో కన్నీరే నిలపవద్దు —"

విచలించి పోయాడు భారవి.

"క్షమించండి చంపాదేవీ! నేను ఇక పాడలేను."

"పాడక తప్పదు రవిబాబూ! పాటతో మొదలయిన మన స్నేహం పాటతోనే ముగియాలి."

భారవి వెనుదిరగలేదు. అక్కడే నిలబడి ఒక లతను ఊతగాగొని "సరే. పాడతాను" అన్నాడు.

"నే నిక ఊయలా ఊగుతాను"_ఊయల ఎక్కింది చంపాదేవి.

"కృష్ణా ... !
నిజము తెలుపవో!
నింద బాపవో!
తేనె మనసుల మూగబాధ
జగతికి తెలుపవో! ....కృష్ణా!"

అశ్రుస్రవంతి చెక్కిలివీదుగా ప్రవహించి ఎదవద్ద వరదయై పోయింది.

"దివ్యజ్యోతి దిగువనే కటిక చీకటా!
భవ్యచరితుని నీడనే ఘోరపాపమా!
అనుమానాలకు, అమాయికులను
గురిచేసి, వెలివేసి బలిసేతురో....!
కృష్ణా!"

స్వరం అశ్రువులతో నిండి రుద్ధమయిపోయింది. దుఃఖ విచలితుడై వెనక్కి తిరిగి చూసి మరునిమిషం చకితుడైపోయాడు. చంపాదేవి ఊయలపై లేదు. ఊయలవెంత నేలపై పడిఉంది. వెన్నెల ఆమె ముఖాన నిండుగాపడి చెక్కిలిపైఉన్న అశ్రువులతో ప్రతిఫలిస్తున్నది. హతబుద్ధి అయి ఆమెనుచేరి "చంపాదేవీ! చంపాదేవీ!" అని వ్యాకులపాటుతో పిలవసాగాడు. కాని ఆమె పలకలేదు. భయకంపితుడై ఆమె చిబుకం పట్టి కదిపాడు. కాని ఆమెలో చలనమేలేదు. భీతిల్లి పోయాడు భారవి. పరుగున నీటిజల్లు దగ్గిరికిపోయి దోసిలితో నీరుతెచ్చి ఆమె వదనంపై చిలకరించాడు. బారం ఆకులను రెండింటిని జోడించి వీవనగా విసరసాగాడు.

"చంపాదేవీ! చంపాదేవీ!" మూగ బాధతో పరితపించసాగాడు.

"ఎవరది?" పొద చెదరింది. ఉలికిపడి అటు చూశాడు భారవి. రాజా మహేంద్ర భూపతి పొద వెనక ప్రత్యక్షమయ్యాడు. అతని భుజాన తుపాకి ఉంది.

"నేను మహేంద్రబాబూ! భారవిని" అన్నాడు భారవి.

"మీరింకా ఉన్నారా!" అని విస్మయపడి "కాని అదేమిటి భారవీ! నేల పరున్న వారెవరు?" అని అడిగాడు మహేంద్రుడు.

లజ్జతో భారవి వదనం భూమిలోనికి కుంగిపోయింది. తడి ఆరిపోయిన గొంతుతో "చంపాదేవి!" అన్నాడు.

"చంపాదేవి?"

"కాని నిదుర పోవడంలేదు మహేంద్రబాబూ! పాట వింటూ వింటూ స్పృహ కోల్పోయింది."

కాని ఆసంజాయిషీ వినడానికి మహేంద్రుడక్కడ లేడు. ఎప్పుడో అతడదృశ్యుడయ్యాడు. దానితో మరింత బాధతో, లజ్జతో కుంగిపోయాడు భారవి. చంపాదేవి కన్నులు తెరిచి "ఆ వచ్చిందెవరు రవిబాబూ! మా మామగారు కదూ! సరే! ఏమడుగుతున్నారు?" అన్నది. భారవి చివాలున లేచాడు.

"ఏమీలేదు" అని బెదురునడకతో గబగబా వెళ్లిపోయాడు. చంపాదేవి మందహాసంతో అతను వెళ్లినవేపే చూస్తూ ఉండిపోయింది. రెండు నిమిషా లనంతరం తోటలో తుపాకి పేలుడు విని అదిరి పడి లేచి కూర్చుని తత్తరపాటుతో దిక్కులు చూడ సాగింది. ఇక అప్పుడే అటుగా ఎవరో మందిరంవేపు పరిగెత్తడం చూసి "ఎవరది రజనీ!" అని పిలిచింది. రజని ఇటు వచ్చింది. రజని చంపాదేవి అంతరంగిక పరిచారిక.

"ఏమిటది రజనీ! తోటలో తుపాకి పేల్చిందెవరు?"

రజని ఎందుకో గజగజ వణికిపోతూంది. భీతిభరితమైన వదనంపైకెత్తి "అమ్మా, పెదబాబుగారు...." అన్నది.

నిశ్చేష్టురాలయ్యింది చంపాదేవి. "పెదబాబుగారా?" అంది. "కాని ఇంత రాత్రివేళ తోటలో వారి తుపాకి ఎందుకు పేలవలసి వచ్చింది?"

రజని ఇక సంభాళించుకోలేక ఏడుస్తూ "అమ్మా! సర్వనాశనమయింది అమ్మగారూ! భారవి బాబుగారు—" అన్నంతలో, అదిరిపడి "ఏమిటి నువ్వన్నది రజనీ! భారవికేమయింది?" అన్నది ఆత్రతతో చంపాదేవి.

రజని నోటమాట రాలేదు. బెక్కుతూ ఉండిపోయింది. ఆ తామసానికి సహించలేక, వ్యథాందోళనలతో తపించిపోతూ, "రజనీ! ఏమైంది రజనీ! చెప్పు—" అన్నది చంపాదేవి.

"అమ్మగారూ! భారవిబాబును పెదబాబుగారు కాల్చివేశారు....."

అశనిపాతమే పొందింది చంపాదేవి.

"భారవిని కాల్చివేశారు! భారవిని కాల్చివేశారు..."

ఆ ఘోషతో ఆమె వీనులు వ్రయ్యలు కాజొచ్చాయి.

'కాని ఎందుకు? ఏమిటి అతని నేరం? ఎవరి తీర్పు ఇది? ఇదేనా న్యాయం? ఇదేనా ధర్మం? ప్రభూ! —'


జితేంద్రుని గదికి పరుగు తీసింది చంపాదేవి.

దేవి సన్నిధిని దివ్యజ్యోతి వెలుగుతున్నది. జితేంద్రుడు ధ్యానమగ్నుడై ఉన్నాడు. వాతావరణం అతి ప్రశాంతంగా ఉన్నది.

"స్వామీ!" ఆకేక ఆనీరవ పరిసరాన్ని చీల్చివేసింది. ఉలికిపడి చూశాడు జితేంద్రుడు. ఆమె వాలకం గమనించి చకితుడే అయ్యాడు.

దుఃఖప్రకంపితఅయి తలఊచి "ఎంత ప్రశాంతంగా ఉన్నారు స్వామీ! అవతల ప్రళయం విజృంభిస్తున్నా మీకెంత నిర్వృతి! హా"_ చీత్కారం చేసింది చంపాదేవి. జితేంద్రుడు విస్మయంగా చూశాడు. "ఏమిటి చంపా?" అన్నాడు.

"స్వామీ! ఒక అమానుష శక్తికి ఒక అమాయక



మహానగరాలలో ముఖ్యంగా మోటారు బండ్ల రాకపోకల్ని అదుపులో ఉంచడానికి ఈ కాలం 'ట్రాఫిక్ లైటు' ఉపయోగిస్తున్నారు. ఈ కాలం కార్లు నడిపే స్త్రీల సంఖ్య అధికం. కారు నడిపే స్త్రీ అంటే పలువురికి భయం కూడా.

ఎర్రలైటు వెలిగినా సుందరి కారు ఆపలేదు. జంక్షన్ దాటింది. వెంటనే మోటారు సైకిల్ మీద ఉన్న ఒక ట్రాఫిక్ పోలీసు ఆఫీసరు ఆమెను నిలిపి, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినందుకు విమర్శించాడు. అంత వేగంగా నడిచే కారును అకస్మాత్తుగా నిలిపితే వెనక ఉన్న బళ్ళు ఢీకొనే ప్రమాదం ఉందని, అందుచేత జంక్షన్ దాటానని సుందరి వివరించింది. ఆఫీసరు అంగీకరించ లేదు. వెనక వచ్చేవాళ్ళు అప్రమత్తులుగా ఉంటే అలాంటి ప్రమాదాలు సంభవించవని సూచిస్తూ, జాగ్రత్త అని ఆమెను హెచ్చరించాడు. ఆమాత్రంతో గొడవ వదిలిందని సుందరి సంతోషించింది.

తరవాత జంక్షన్‌లో ఎర్ర లైట్ వెలిగింది. సుందరి అకస్మికంగా కారు నిలిపింది. వెనక ఏదో బండి కారు బంపర్‌ను గుద్దుకొన్న శబ్దం అయింది. సుందరి వెనుతిరిగి చూసింది.

ఆ ట్రాఫిక్ పోలీసు ఆఫీసరు వెర్రిమొహం వేసుకుని మోటార్ సైకిల్ మీద కూర్చుని ఎటో చూస్తూ ఉన్నాడు!



పేవి బలి అయిపోయింది. అధర్మమూ, అరాజకమూ ప్రబలిపోయింది స్వామీ!" పెల్లుబికే దుఃఖాన్నీ, ఆవేశాన్నీ అతి కష్టంతో అణుచుకొని మెల్లిగా చెప్పింది చంపాదేవి.

"బలి! ఈ ఇంట్లోనేనా?" సంశయంగా చూశాడు.

"అవును. ఈ ఇంటే. మీ ఇంట్లోనే జరిగింది ప్రభూ! దుర్మార్గులు భారవిని కాల్చి చంపారు..."

స్థాణువే అయ్యాడు జితేంద్రుడు. తన చెవులను తానే విశ్వసించలేకపోయాడు. దుస్సహంగా చెవులు మూసుకొని "కృష్ణ! కృష్ణ!" అన్నాడు.

చంపాదేవి ఏడవసాగింది.

"ఇంతకీ హంతకులెవరు చంపా?"

"ఎవరో నేను చూడలేదు. కాని విన్నాను"—

"వారెవరు?"

"మీనాన్నగారు"—

తుళ్ళిపడ్డాడు జితేంద్రుడు. "చంపా! ఎంత ఘోరం. కాని నేనిది నమ్మలేను."

దుఃఖావేశంతో విదలించిపోయింది చంపాదేవి. "నమ్మలేరు. కాని ఒక్కసారి తోటలోనికిపోయి చూడండి. రుద్ర జడనీడలో ఏముందో చూడండి ప్రభూ! భారవివిమృతదేహం రుధిరస్రవంతిలో ఎలా పొర్లాడుతున్నదో! అతని ఆత్మ పరితపిస్తూ ఎంతగా —"

"కాని కాని ఎందుకిలా జరిగింది చంపా! నాకేమీ తెలియటంలేదే?"

"ఎందుకా!" ఆగ్రహంతో చంపాదేవి కన్నులు ఆరుణిమ దాల్చాయి. "ఎందుకో మీకు తెలియదూ? అంతా తెలుసు. తెలిసీ ఎందుకలా తప్పించుకోజూస్తారు? మీనాన్నగారు మమ్మల్ని శంకించారు. ప్రతిక్రియగా ఈ హత్య జరిగింది. ఇదేనా మీ రాజనీతి? ఇదేనా మీన్యాయ విచారణ? ఇదేనా మీ ధర్మపాలనం? మీ నీడనే ఇంత ఘోరకృత్యమా ప్రభూ!" వలవలా ఏడవసాగింది చంపాదేవి.

బాధతో తలపంకిస్తూ "ఏడవకు చంపా! ఏడవకు. జరిగినదానికి ఎవరేం చెయ్యగలరు? అంతా విధికాని—" అన్నాడు జితేంద్రుడు. కాని ఈ తీర్పుతో ఉన్మాదినే అయింది చంపాదేవి.

"విధి! విధి అనుకుంటే సరిపోతుందా ప్రభూ! ఇదేనా మీతీర్పు. ఇదేనా మీవైష్ణవ నీతి! మీ రేమీ పాపం చెయ్యకపోవచ్చు. కాని మీ నీడను జరిగిన పాపానికి మీరు బాధ్యులు కామనుకుంటున్నారా? లేదు ప్రభూ, లేదు. దుశ్శంకలతో ఆ నిర్మాల్యమూర్తిని అంతం చేసిన మీ బ్రతుకులంత తేలిగ్గా విముక్తి చెందవు. ఏవంశ మర్యాదలయితే ఏ పరువు ప్రతిష్ఠలయితే మా ప్రవర్తనలవల్ల నాశనమవుతాయని అనుమానించి అపనిందలు వేసి ఇంత అఘాయిత్యానికి పూనుకున్నారో ఆవంశమూ, ఆ గౌరవమూ నిలవవు. సర్వనాశనమై బూడిద కూడ మిగలక భూమిలో కలియక తప్పదు. స్మృతీ గతీ అన్నీ కలుషితాలయిపోతాయి. అంతే! ఇది నాశాపం" అని ఆవేశంతో వణికిపోతూ వెనక్కి తిరిగింది.


"చంపా!" దుఃఖోద్వేగంతో అరిచాడు జితేంద్రుడు. "చంపా! ఆవేశానికి గురిఅయి స్థితినే విస్మరిస్తున్నావు. జరిగినదానితోనాకేం ప్రమేయంలేదు. నిజం చెబుతున్నాను. నన్ను విశ్వసించు. ఇదంతా నాకు తెలిసే, నాకోసమే జరిగిఉంటే బ్రహ్మహత్యా పాత కానికే నేను గురవుతాను. కాని చంపా! ఆవేశాన్నివీడు. అశుభాల్నీ, అనర్థకాన్నీ పలకకు. శాంతించు..." అని పరితపిస్తూ జితేంద్రుడు చెబుతున్న మాట లేవీ వినిపించుకోకుండా తోటలోనికి పరిగెత్తింది చంపాదేవి.

● ● ●

"పరిస్థితి నర్థం చేసుకోలేక భారవినంతమొందించింది ఒకరు. నేను ఆవేశంతో విరుచుకుపడింది మరొకరిపై. ఎందుకలా చేశానని మీ రీనాడు ప్రశ్నించవచ్చు రవిబాబూ! కాని ఆనాటి నా ఆవేశంలో నేనేం చేస్తున్నానో నాకే తెలియదు. కాని నా స్వామి అన్నట్టు నేను పలికిన పలుకులు అశుభాన్నీ అనర్థాలనే సృష్టించాయి. నా శాపం వెన్వెంటనే క్రియారూపం దాల్చేసింది.

"అంతవరకు అతి ప్రశాంతంగా వెన్నెలలు విరజిమ్ముతున్న జాబిలి, హఠాత్తుగా కమ్ముకున్న నల్లమబ్బులమాటునఅదృశ్యమైపోయాడు. ఉరుములు, మెరుపులూ చుట్టుముట్టాయి. ప్రశాంత వాతావరణం ఒక్కసారి ప్రళయమైపోయింది. పెనుగాలి విజృంభించి చెట్లనూ పుట్లనూ కదిల్చివెయ్యసాగింది. ఫెళఫెళా రావాలతో, హాహాకారాలతో ప్రకృతి దద్దరిల్లిపోయింది! అంతా చీకటి. కటిక చీకటి. ప్రళయ విన్యాసం.

జల చక్రాలు ఫోటో — జి. వి. రత్నం (కాకినాడ-1)





శయనస్వామి (నేపాళ్)　　ఫోటో — సమీర్‌కుమార్ బోస్ (కలకత్తా-6)

శివమెత్తిన దానిలా అటు ఇటు పరిగెత్తాను. ఒక్క మెరుపు మెరిసింది. ఆవెలుగులో ఊగుతున్న నా ఊయలా కనిపించింది.

'జీవన మధువనిలో
జవ్వని ఊగే ఉయ్యాలా
ఉయ్యాలా, జంపాలా'

అని పాడుతున్న రవిబాబూ కనిపించాడు. అయితే అదంతా ఒకే ఒక క్షణం. మెరుపు వెలుగు మాసిన తరవాత అంత చీకటే. కన్ను పొడుచుకున్నా కానరాని కటిక చీకటి. అంతలో వర్షమూ విజృంభించింది. మందిరంవేపు పరుగిడే అంతలో భవంతి దిశనుండి ఏదో కూలినట్టు పెద్దశబ్దం వినవచ్చింది. ఆశబ్దానికి, నా ఎద అదిరి వీనులు బ్రద్దలై నన్ను నిస్తబ్దురాలిని కావించాయి. అలా ఎంతసేపు నేను నిస్పృహలోపడి ఉన్నానో నాకే తెలియదు. కాని కనులు తెరిచి చూసే సరికల్లా అంతా కొత్తగా కనిపించింది. సౌధమంతా శిథిలమై ఉంది. ఉత్తర భాగమయితే నేలమట్టమే అయింది. అటు వెళ్లాను. అక్కడ మాదాసీజనం కొందరు అటూ ఇటూ తిరుగుతున్నారు. వారి మాట లనుబట్టి సౌధాన్నానుకుని ఉన్న రావివృక్షం కూలి భవంతిపై పడగా ఆభాగమంతా శిథిలమయినట్లుగా వెల్లడిఅయింది. జితేంద్ర మహేంద్రు లిరువురూ అక్కడే ఉన్న కారణంగా ఆశిథిలాలకింద వారూ కూలి పోయారు.

'అహ్హాహ్హా!' వికటాట్టహాసం గావించాను. 'నిర్మల హృదయాంను శిథిలం గావించిన ఉన్మత్తుల కింతకన్న శిక్ష ఇంకేం గావాలి?' నానవ్వు వినీ, నన్ను చూచీ అక్కడ ఉన్నవారంతా కకావికలై పరుగుతీశారు. 'నిన్నటివరకు నా అడుగులకు మడుగులొత్తే నా నౌకర్లు వీరు. కాని ఇప్పుడు నన్ను చూసి ఎందుకిలా పరిగెత్తారు? ఏమైంది వారికి? నాలో వచ్చిన మార్పేమిటి? ఏమో!' అనుకున్నాను.

"అంతా అక్కడనుండి పారిపోయారు. ఆతరవాత ఇక్కడికి కూడ రావడం మానేశారు. మానేస్తే మానెయ్యనీ! నాకేం! కాని నా రవిబాబు తప్పకుండా రావాలి. కాని ఎప్పుడు? ఎలా?—" అని నావంక చూసి నిట్టూర్చి "ఒకనాడు మీజాడ తెలిసింది. నేనే అక్కడికి వచ్చాను. కాని అక్కడా మిమ్మల్ని పొందలేక పోయాను. చివరికి ఇక్కడికే రాకతప్పలేదు ఏమంటే ఏనాటికైనా మీతుది మజిలీయిదేనని నాకు తెలుసు.." అని ముగించింది. నేను మందబుద్ధిలా చూస్తూ ఉండిపోయాను. నా ఒళ్లంతా చెమటతో తడిసి పోయింది. నాకేం అర్థం కావడంలేదు. అసలింతవరకు జరిగింది భ్రమో, కలో, వాస్తవమో తెలుసుకోలేని అయోమయంలో పడిపోయాను. ఆమె కన్నీళ్లతో నావుఖంలోకి చూస్తూ హఠాత్తుగా నాచెంతకు వచ్చి, నాచెయ్యి గ్రహించి, "నావెంట రండి రవిబాబూ!" అని ఎక్కడికో తీసుకువెళ్లసాగింది. నేను బిత్తరపోతూ ఆమె నాటంకపరచకుండా ఆమెవెంట నడిచాను. సౌధోత్తర భాగాన ఉన్న రాళ్లగుట్ట దగ్గిరికి తీసుకు వెళ్లి నాచెయ్యి విడిచిపెట్టి, "ఇప్పుడు చెప్పండి రవి బాబూ! ఈ శిలలలోనుండి మీకేం వినిపించడం లేదా? ఏమీ కనిపించడంలేదా?" అన్నది.

నేను విస్మయంగా చూసి "ఏమీ కనిపించడం లేదు" అన్నాను. కాని ఏమీ వినిపించడంలేదని అనలేకపోయాను. అతి గంభీరంగా, స్పష్టంగా ఏదో వినిపించసాగింది.

" —జే అఘ మాతుపితా సుతమారే।
గాయిగోఠ మహిసురపుర జారే॥
జే అఘ తియ బాలకబధకీన్హే ।
మీతమహీపతి మాహుర దీన్హే॥
జేపాతక ఉపపాతక అహహీ।
కరమ బచన మనభవకబిక హీ॥
తేపాతక మోహిహోహఁకిబిధాతా।
జౌంయహు హో ఇ మో రమత మాతా॥—"

(భావం : ఓదైవమా! తలిదండ్రులను పుత్రులను చంపినందువల్ల ఏ పాపం కలుగుతుందో, బ్రాహ్మణ నివాసాలను, గోశాలలను దహించినందువల్ల ఎటువంటి

పాపానికి తొయ్యబడతావో, శిశువులను స్త్రీలను హత్యచేసినందువల్ల ఏ పాపం సంక్రమిస్తుందో, మిత్రులకు, ప్రభువులకు విషం ఇచ్చి చంపించినందువల్ల ఏ పాపం లభిస్తుందో, మనోవాక్కాయ కర్మలద్వారా ఏ పాపాలు చెయ్యబడగలవని కవులు వర్ణిస్తుంటారో ఆ పాపాలన్నీ, యీ రామవనవాసం కుట్రలో నాకే కనక ప్రమేయం ఉంటే నన్నే అంటి నరకానికి ఈడ్చుగాక! —)

తులసీ రామాయణంలో, శ్రీరామ వనవాసానంతరం అయోధ్యకు వచ్చిన భరతుడు కౌసల్యాదేవి కడకేగి రామచంద్రుని వనవాసయాత్రలో తన ప్రమేయమేమీలేదని విలపించే వర్ణన ఆది. కాని భరతుని స్థానంలో నాకు జితేంద్రుడే కనిపించాడు. "ప్రియమిత్రమా! నిన్ను అకాలమృత్యువు పాలు చెయ్యడంలో నా సహకారమేమీలేదు ఉంటే పై విధంగా పాపాలన్నీ నాకంటుగాక. నాకు విముక్తి లేకుండుగాక" అని జితేంద్రుడే విలపిస్తున్నట్టుగా వినిపించసాగింది. నామస్తిష్కంలో ఏవోస్మృతులు కెరటాలలా ఎగిసిపడుతున్నాయి. తల తిరిగిపోసాగింది. కళ్లు బైర్లు కమ్మాయి. ఆ గాఢాంధకారంలోనే ఏదో దివ్యదీప్తి. అంతే... నన్ను నేను గుర్తించాను. అంతలో...

"జీవన మధువనిలో
జవ్వని ఊగే ఊయాలా —"

అటు చూశాను. "చంపాదేవీ!" అని బిగ్గరగా పిలిచాను. చంపాదేవి ఇటు చూసింది. ఊయల వేగం తగ్గింది. నే నటు నడిచాను. కాని చంపాదేవి ఊయలదిగి అటు నడవసాగింది.

"ఆగు, ఆగు చంపాదేవీ! నేనూ వస్తున్నా ఆగు" అని పిలుస్తూ పరుగు తీశాను. కాని ఆమె నాకందకుండా ఎటో పోతున్నది. విరిగిన ప్రహరీగోడ మీదుగా విశాల మైదానంలోకి దారి తీసింది నేనూ వెళ్లాను. కాని గోడపక్కఉన్న రెల్లు పొదపైపడ్డ ఒళ్లంతా గీచుకుపోయింది. అయినా లేచి ఆమెకై పరిగెత్తాను. గట్టు ఎక్కింది. నేను పిలుస్తున్నా వినిపించుకోవడం లేదు. నేను గట్టు ఎక్కి చూశాను. నేరుగా ఆమె వెనక్కి చూస్తూనే నడుస్తూంది. నేనూ అడుగు వేశాను కాని తరవాత —"

• • •

ఆ తరవాత ఏం జరిగిందో మనం ఊహించుకోగలం. గట్టు అవతల ఏరుఉంది. ఏటిమీదుగా ఆమె అయితే వెళ్ల గలిగింది. కాని రవిశంకరుడు వెళ్లలేకపోయాడు. ఏట్లోపడి మునిగిపోయాడు. అయితేనేం? అతనికి విముక్తి లభించింది. జితేంద్రుని ఆత్మ విముక్తి చెందింది. చంపాదేవికీ ముక్తి లభించింది. విముక్తి చెందిన ఆమూడు ఆత్మలూ విలీనమయ్యాయి. అందుకే నాటినుండి ఏఘోషా, ఏ ఆటా, ఏ పాటా వినిపించలేదు. కనిపించలేదు.

కాని, నేడు ఆ భవంతీ లేదు, భయమూలేదు. అంతా చదును చెయ్యబడి విశాల వ్యవసాయక్షేత్రంగా మార్చబడింది. కాని ఆ అశోకవృక్షం మాత్రం ఇంకా అలానే ఉంది. ఎందరికో నీడ ఇస్తూ ఉంది. నాటికీ, నేటికీ, ఏనాటికీ చెక్కుచెదరని సుస్థిర స్మృతిలా అదొక్కటే మిగిలిపోయింది. అంతే. ★



'తొలి తలపుల మలుపులలో'    ఫోటో—సి. ఎస్. రావు (భోపాల్)

(క్రిందటి సంచిక తరువాయి)

వీధి గుమ్మంలో నిలబడి దారిలో వచ్చే పోయే వాళ్ల నందరినీ పరీక్షగా చూస్తున్నాడు రవి. సాయంసమయం కాబట్టి రోడ్డంతా హడావిడిగా ఉంది. వచ్చే జనం పోయే జనంతో రోడ్డంతా కిటకిటలాడుతూంది. మంజుల ఎన్నిసార్లు లోపలకు రమ్మన్నా రాలేదు. తలిదండ్రులతో వెళ్లే పిల్లలు మరీ ఆకర్షిస్తున్నారు రవి కళ్లను.

'ఛ. అమ్మెప్పుడూ రాదు. అమ్మ వస్తే ఎంచక్కా తనుకూడా వాళ్లలాగే అమ్మా, నాన్నలతో షికారు వెళ్లచ్చు.' ఆశగా అనుకున్నాడు రవి. అంతలో వచ్చీరాని నడకతో ఒక చిన్న కుర్రవాడు ఒకపక్క నాన్నచేతినీ, మరోపక్క అమ్మచేతినీ పట్టుకుని నడుస్తున్నాడు. అతని అమ్మ నాన్నతో ఏదో చెప్పి నవ్వుతూంటే అతను కూడా నవ్వుతున్నాడు. అది చూసి రవి మనసు మళ్లీ అమ్మ మీదికి మళ్లింది.

'అమ్మ ఎందుకని రాదు? వస్తే అలా నాన్నతో హాయిగా కబుర్లు చెప్పొచ్చుగా. అలా నన్నూ పట్టుకుని నడిపించొచ్చుగా. నాన్నమ్మలాగా, అత్తయ్యలాగా నన్ను ముద్దు పెట్టుకోవచ్చుగా. అమ్మ కెప్పుడూ ఇక్కడకు రావాలనిపించదా? నన్ను ముద్దులాడా లనిపించదా? ఇవాళ వచ్చినట్లయితే మరి నన్ను ముద్దులాడుతుందా?' గుమ్మంలో నిల్చున్న రవిలో ఏవేవో ఆలోచనలు.

అంతలో ఇంటిముందు కారాగింది. రజనీకాంత్ అందులోంచి త్వరగా దిగి వచ్చి ఇవతలి తలుపు తెరిచాడు. అందులోంచి శైలశ్రీ కూడా దిగి, నవ్వుతూ థాంక్స్ చెప్పింది. రజనీకాంత్‌కూడా నవ్వుతున్నాడు.

రవి కళ్లు మిలమిలలాడాయి. తన ఎదురుగా జరుగుతున్నది నిజమేనా అని కళ్లు మరింత పెద్దవి చేసుకుని చూడసాగేడు. సందేహం లేదు. అమ్మే! కానిదే నాన్నతో ఎందుకు వస్తుంది? అలా నవ్వుతూ ఎందుకు మాటాడుతుంది? నాన్న ఎంత మంచివాడు! అమ్మను తీసుకు వచ్చేశాడు. రాజ వాళ్లమ్మ ఏమీ బాగోదు. మా అమ్మెంత బాగుంది? ఎంత మంచి బట్టలు కట్టుకుని ముస్తాబయింది . . .

“ఏం రవీ! ఇక్కడున్నావేం?” నవ్వుతూ ప్రశ్నించాడు రజనీకాంత్. రవి సమాధానం చెప్పకుండా ఆశగా శైలశ్రీవంక చూస్తున్నాడు.

శైలశ్రీ చేతులు చాచింది. వెంటనే రవి ఆ చేతుల్లో ఇమిడిపోయాడు. రవిని ఎత్తుకుని ముద్దుపెట్టుకుంది శైలశ్రీ.

“నీ పేరేమిటి, బాబూ?”

“రవికాంత్.” ముద్దు ముద్దుగా శైలశ్రీ కళ్లలో ఏదో వెదుకుతూ అన్నాడు రవి. అమ్మకు తన పేరు తెలీదా? నాన్న చెప్పి ఉండడా అని ఆలోచిస్తున్నాడు.

“కూర్చోండి” అని సోఫా చూపించాడు రజనీకాంత్. శైలశ్రీ రవిని ఒళ్లో కూర్చోబెట్టుకుంది.

రజనీకాంత్ లోపలికి వెళ్లి తల్లిని, చెల్లెలిని వెంటబెట్టుకుని వచ్చాడు. వాళ్లను చూడడంతోనే రవిని దింపి వినయంగా లేచి నిలబడి, చేతులు జోడించి, “నమస్కారం” అంది శైలశ్రీ.

ప్రతినమస్కారం చేశారు ఇద్దరూ.

“మా అమ్మ, చెల్లెలు మంజుల.” పరిచయం చేశాడు రజనీకాంత్.

“మిమ్మల్ని తీసుకు వస్తానని చెప్తాడన్నయ్య ఇందాకా. మీరు మా ఇంటికి వచ్చినందుకు చాలా సంతోషం.” నవ్వుతూ పలకరించింది మంజుల.

నవ్వింది శైలశ్రీ.

“కూర్చోండమ్మా. నేను ఇప్పుడే వస్తాను. లోపల కొంచెం పనుంది. మీరంతా మాట్లాడుకుంటూ ఉండండి” అని రవి వైపు తిరిగి, “ఏం బాబూ! ఇంకా బట్టలు మార్చుకోలా? పద” అన్నారు సుభద్రమ్మ



గారు రవిచేతిని పట్టుకుంటూ. శైలశ్రీ చీర కుచ్చెళ్లను పట్టేసుకుని దాగుని పెరాయిస్తాడు రవి.

“నే నిందాకటినుంచీ పిలుస్తున్నానమ్మా. మొదటినుంచి వీధి గుమ్మంలో కూర్చుంటే పనుగెత్తి ఉరుకున్నాను” అంటూ, “వెళ్లు, రవీ. నాన్నమ్మ బట్టలు తొడుగుతుందట” అంది మంజుల. రవి వెళ్లలేదు.

“పద, బాబూ” అని మళ్లీ అన్నారు సుభద్రమ్మ గారు, రవి చేయి పట్టుకుని లాగుతూ.

“ఊహుఁ” అంటూ శైలశ్రీ కాళ్లను చుట్టేశాడు రవి, సుభద్రమ్మగారి చేయి విడిపించుకుని.

“వెళ్లు, బాబూ.” తియ్యగా మోగింది శైలశ్రీ కంఠం.

“రా, బాబూ! బట్టలు వేసుకుని మళ్లీ వద్దువుగాని. చూడు, అంతా ఎంత మంచి బట్టలు వేసుకున్నారో! నువ్వూ కొత్తబట్టలు వేసుకోవూ? రా.” మళ్లీ చేయి పట్టుకోబోయారు సుభద్రమ్మగారు.

“అమ్మా” అంటూ శైలశ్రీని పెనవేసుకుని ఏడుపు మొదలుపెట్టాడు రవి.

అంతా తెల్లబోయి చూశారు రవిని. శైలశ్రీ పరిస్థితేమీ అర్థంకాక అందరివంకా చూసింది బెదురుగా. 'ఏమిటీ విచిత్ర పరిణామం? ఇప్పుడిందుకు? జరుగుతున్నదేమిటి?' అన్నట్లుగా ఉన్నాయి ఆమె చూపులు. రజనీకాంత్‌కు చాలా ఇబ్బందిగా అనిపించింది.

తని ప్రవర్తన వింతగా తోచింది. కానీ తల్లిలేని రవి, తల్లి కోసరం పడే ఆరాటాన్ని, ఆమె లభించిందన్న ఆనందంతో శైలశ్రీని చుట్టుకుపోయి అనుభవిస్తున్న హాయినీ ఎలా తెంచగలడు? రవి ప్రవర్తన తన అతిథిని అవమానపరిచేదిగా, అభిమానపరిచేదిగా ఉన్నదని రవిని ఎలా కోప్పడగలడు? అనుకోకుండా రజనీకాంత్ కళ్లు చెమ్మగిల్లాయి. అక్కడ నిలబడలేక గ్రరున లోపలకు వెళ్లిపోయాడు. మిగతా అందరి పరిస్థితీ అంతకే ఉంది.

"ఆ మధ్య నెవరో అబ్బాయి ఏడిపించినప్పటినుండీ వాఁ ఏదో లోకంలో ఉన్నాడమ్మా! ఎంతసేపూ 'అమ్మ కావాలి, ఎప్పుడొస్తుంది, పుట్టిన రోజున వస్తుందా' అంటూ ఒకటే గొడవ." ఏమి చెప్పాలో తోచక ఏదో సర్ది చెప్పబోయారు సుభద్రమ్మగారు.

"అమ్మ కావాలనే ఆరాటంలో మీరు రావటంతోనే . . ." నీళ్లు నమిలింది మంజుల.

పరిస్థితిని గ్రహించగలిగింది శైలశ్రీ. అమ్మకోసరం అపసి మనసుపడే ఆ రాటాన్ని అర్థం చేసుకోగలిగింది ఆ స్త్రీ హృదయం. మెల్లగా రవి వీపు నిమురుతూ, "రవీ, మరి నిన్ను పుట్టిన రోజు డ్రెస్‌లో చూడాలని అంతా వస్తారు. నువ్విలా ఏడుస్తూ ఉంటే మరి ఎవ్వరూ ఉండరు ఇక్కడ. నేను కూడా వెళ్లిపోతాను. నేను ఉండాలంటే త్వరగా బట్టలు మార్చుకుని రా. మంచివాడివి కదూ." బుజ్జగించింది శైలశ్రీ.

"బట్టలు మార్చుకుని వస్తాగానీ నువ్విక్కడే ఉంటావా?" మళ్లీ అమ్మ ఇంటి నుండి వెళ్లిపోతుం దేమోననే శంక పీడిస్తుండగా అడిగాడు రవి.

"నే నిక్కడే ఉంటాను గానీ నీవు త్వరగా తయారయి రా. వెళ్లు" అంది.

నాన్నమ్మ వెంట వెళ్లాడు రవి లోపలికి. వాతావరణం గంభీరంగా తోచింది మంజులకు. ఏదో విధంగా సంభాషణ మొదలు పెట్టింది.

"మీకు హైదరాబాద్ నచ్చిందా, కాకినాడ నచ్చిందా?"

"రెండూ రెండు రకాలుగా ఉన్నాయి. కాకినాడలో స్వచ్ఛమయిన తెలుగు. ఇక్కడి పేషెంట్లు చాలా మంది యాసగా మాట్లాడితే నా కేమిటో అర్థమేకాదు. ఇక స్థలం గురించి చెప్పాలంటే రాజధాని కాబట్టి ఇక్కడే బాగుంటుంది కోలాహలంగా."

"ఇక్కడి ముఖ్యమైన స్థలాలన్నీ చూశారా, మీరు?"

"ఏదో అలాగలాగే. మాకు అంతగా తీరికే చిక్కదు. సమయం కలిసి వచ్చినప్పుడల్లా ఏదో ఒక స్థలానికి వెళ్లేదాన్ని మరో లేడీడాక్టరుతో కలిసి. చార్‌మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, జూ, పబ్లిక్ గార్డెన్స్, గోల్కొండ కోట, గండిపేట చెరువు, గ్లాస్ ఫాక్టరీ, షుగర్ ఫాక్టరీ—ఇంచుమించు అన్ని ముఖ్య స్థలాలూ చూసినట్టే లెండి."

అంతలో రజనీకాంత్ వచ్చాడు. జరిగినదానికి చాలా పశ్చాత్తాప పడుతున్నట్టుగా ఉంది అతని ముఖం.

"మీకు చాలా బోర్ కొడుతూండచ్చు ఇక్కడ." ఏదో మాటాడక తప్పలేదు రజనీకాంత్‌కు.

"అబ్బే, అదేమీ లేదు. మంజులగారుండగా బోర్ కొట్టవలసిన అవసరమేమొచ్చింది." ఎప్పటి మాదిరి నవ్వుతూనే జవాబిచ్చింది శైలశ్రీ.

"ఇంతకూ మీరేం చదువుతున్నారో చెప్పనేలేదు." మంజులను ప్రశ్నించింది శైలశ్రీ.

# మమత

"బి. ఎ. ఫైనలియరండీ." జవాబిచ్చింది మంజుల.

"మంజులా!" లోపలినుండి సుభద్రమ్మగారి గొంతు వినిపించింది.

"ఇప్పుడే వస్తానుండండి" అంటూ లోనికి వెళ్లింది మంజుల.

రెండు ప్లేట్లలో కారప్పూస, కోవా, కజ్జికాయలు తెచ్చి ముందు పెట్టింది మంజుల.

"పుచ్చుకోండి" అన్నాడు రజనీకాంత్.

"మీరూ రండి." మంజులతో అంది శైలశ్రీ.

"మీరు కానివ్వండి. నేను రవిని తయారుచేసి తీసుకు వస్తాను" అంది మంజుల లోనికి వెడుతూ.

## బద్ది తారకేశ్వరి

పుచ్చుకొమ్మన్నట్టుగా శైలశ్రీ వంక చూశాడు రజనీకాంత్. ఆమె ఒక ప్లేటు తీసుకుని అతనికి ఇచ్చి, రెండవది తాను తీసుకుంది. ఏవో కబుర్లు చెప్పుకుంటూ ఫలహారం ముగించేసరికి కాఫీ తెచ్చి పెట్టారు సుభద్రమ్మగారు.

రవికి కొత్త బట్టలు తొడిగించి, ముఖానికి పౌడరు అద్ది, అందంగా క్రాపు దువ్వి తీసుకు వచ్చింది మంజుల. రజనీకాంత్ రవిని దగ్గరికి పిలిచి ముద్దు పెట్టుకుని ఒడిలో కూర్చోబెట్టుకోబోతే జారిపోయి శైలశ్రీ వద్దకు వెళ్లాడు. శైలశ్రీ నవ్వి రవిని పక్కలో కూర్చోబెట్టుకుని, వానిటీ బాగ్ తెరిచి, అందులో నుండి బట్టల పాకెట్ తీసి రవి చేతి కిచ్చింది. ఎంతో

**జరిగిన కథ** తల్లి లేని బిడ్డ రవి . . . ఆ లోపం అతనికి తెలియకుండా పెంచాలని సుభద్రమ్మ, మంజుల ప్రయత్నం రవికి ఆ సంగతి తెలిసిపోయింది. డాక్టర్ రజనీకాంత్‌కు బాబు అంటే అమిత ప్రేమ. రజనీకాంత్‌కు మళ్లా పెళ్లిచెయ్యాలని తల్లి సుభద్రమ్మ ఆరాటం. మంజుల అత్తవారింటికి వెళ్ళిపోతూ రవి ఆలనా పాలనా చూచేవా రెవరని ఆమె బెంగ. రవికి తల్లిని గురించి బెంగ . . . అమ్మ ఎప్పుడో వస్తుందని అత్త, నాన్నమ్మ చెప్పిన మాటలు విని ఎదురు చూస్తున్నాడు.

ఆప్యాయంగా, ఆనందంగా పుచ్చుకున్నాడు రవి.

"ఆదేమిటండీ! పార్టీకి రమ్మని పిలిచినంతమాత్రాన ప్రెజెంటేషన్సు పట్టుకు రావాలని ఉందా?" అంది మంజుల వారిస్తున్నట్టుగా.

"మీరు తెమ్మన్నారని నే ననలేదు కదండీ. నా తృప్తి కొద్దీ నేను తెచ్చాను." మందహాసంతో అంది శైలశ్రీ.

రజనీకాంత్‌మాత్రం ఏమీ మాటాడకుండా రవికేసే చూస్తున్నాడు.

"థాంక్స్ చెప్పవా?" కొడుకును మందలించాడు రజనీకాంత్.

"థాంక్యూ" అన్నాడు రవి తృప్తిగా శైలశ్రీ ముఖంలోకి చూస్తూ.

నిండుగా నవ్వింది శైలశ్రీ.

రవి మెల్లగా మంజుల వైపు వెళ్లి మెల్లగా ఏదో గొణగసాగాడు.

"ఏమంటున్నాడు?" ప్రశ్నించాడు రజనీకాంత్.

"శైలశ్రీగా రిచ్చిన బట్టలే బాగున్నాయిట. అవి తొడుక్కుంటానంటున్నాడు" అంది మంజుల. నవ్వాడు రజనీకాంత్.

"ఇలా రా, బాబూ." శైలశ్రీ మెల్లగా రవి చేతిని పట్టుకుని దగ్గరికి పిలిచింది. "ఆ బట్టలకంటే నువ్వు తొడుక్కున్నవే బాగున్నాయి. అవే ఉండనీ. ఇవి రేపు వేసుకుందువు గాని."

"కాస్సేపు ఇవే ఉంచుకో, రవీ. అందరికీ ఒకసారి నీ బట్టలు చూపెట్టేసి మళ్లీ ఈ బట్టలు వేసుకుందువు గాని. అప్పుడు అంతా నీ దగ్గిర ఎన్ని బట్ట లున్నా యను కుంటారు. సరేనా." మంజుల సర్ది చెప్పింది. తల ఊపుతూ శైలశ్రీ ఒడి నెక్కి, "నువ్వు మళ్లీ వెళ్లిపోతావా?" అని ప్రశ్నించాడు రవి శైలశ్రీని.

"నువ్వేమిటి? మీరు అనాలి." సరిదిద్దాడు రజనీ కాంత్ కోపంగా రవికేసి చూస్తూ.

"పోన్లెండి, చిన్న కుర్రాడు. వాళ్ల కేమనాలో ఏం తెలుస్తుంది?" తేలికగా, సంతోషంగా రవిని సమర్థించింది శైలశ్రీ.

ఆమె ఒడిలో కూర్చుని రవి ఏమేమో చెబుతున్నాడు. ఆమెను వెళ్లవద్దనీ, రాజుకు ఆమెను చూపెడతాననీ... ఇంకా ఏదేదో చెబుతున్నాడు. అన్నిటికీ నవ్వుతూ, ఊకొడుతూ కూర్చుంది శైలశ్రీ. రవి మాటాడు తూంటే విన సొంపుగా ఉంది ఆమెకు.

మెల్ల మెల్లగా అతిథుల సంఖ్య పెరగజొచ్చింది. రజనీకాంత్‌కు అందరినీ ఆహ్వానించడంతో ఒక్క క్షణం తీరిక లేకుండా పోయింది. సుభద్రమ్మగారు అందరి కోసం లోపల ఫలహారాలు తయారు చేస్తున్నారు. మంజుల స్త్రీలందరినీ ఆహ్వానించి, శైలశ్రీని పరిచయం చేసింది. రవిమాత్రం ఆమె ఒడిలోంచి కదలలేదు.

వచ్చిన వాళ్లంతా రవికేసీ, శైలశ్రీ కేసీ ఆశ్చర్యంగా చూడసాగారు. చాలా మంది మంజులను అడిగారు:

"శైలశ్రీ మీ బంధువా?"

"కాదు. అన్నయ్యతోబాటు పనిచేస్తారు." నవ్వుతూ అందరి అనుమానాన్నీ తీర్చేది మంజుల.

అక్కడకు వచ్చిన వాళ్లంతా శైలశ్రీతో రవి ముచ్చట్లేమిటని ఆశ్చర్యంగా చూడసాగారు. చాలా మంది అమ్మలక్కలు చెవులు కొరుక్కోవడం చూచి, చూసీ చూడనట్టుగానే రవితోబాటు లోనికి వెళ్లి సుభద్రమ్మ గారికి, మంజులకు సహాయపడింది.

సరిగ్గా ఏడు గంటలవడంతోనే రవిని తీసుకువచ్చి టేబిల్ ముందున్న కుర్చీలో కూర్చోబెట్టారు మంజుల, శైలశ్రీ. టేబిల్ మధ్యగా పెద్ద బర్త్ డే కేక్ పెట్టి ఉంది. దాని మీద ఉన్న ఐదు కొవ్వొత్తులు వెలిగించాడు రజనీకాంత్. అవి బాగా వెలుగుతూన్నప్పుడు ఒక్కసారిగా నోటితో ఊది అన్నింటినీ ఒకేసారి ఆర్పమంది మంజుల రవితో. ఎలా అయితేనేం తంటాలుపడి రవి అన్నింటినీ ఆర్పివేశాడు. అంతా చప్పట్లు కొట్టి, తాము తెచ్చిన ప్రెజెంటేషన్లు అందచేశారు. రవి అన్నింటినీ పుచ్చుకుని థాంక్స్ చెప్పాడు. రవిచేత కేక్ ముక్కలు కోయించి, అన్ని ప్లేట్లలో పెట్టించి, అందరికీ అందచేశారు శైలశ్రీ, మంజుల, సుభద్రమ్మగార్లు.

శైలశ్రీ అందరిలో కలిసి మెలిసి సుభద్రమ్మగారింట్లో ఒక వ్యక్తిగా వ్యవహరించడం సోమయాజులు గారి కుటుంబానికి నచ్చలేదు. ఆయన భార్య అన్నపూర్ణ మంజులను పిలిచి

"ఆ అమ్మాయి మనవాళ్లమ్మాయేనా?" అని ప్రశ్నించింది.

"తెలీదండీ. ఆవిడ మా ఇంటికి రావడం ఇదే మొదలు. ఇంకా ఆ సంగతులేమీ నాకు తెలీదు."

"ఏమి చదివిం దేమిటి?"

"అన్నయ్య వాళ్ల ఆస్పత్రిలోనే లేడీ డాక్టర్."

"ఎం. బి. బి. యస్సా లేక..." కుతూహలం కనబరిచారు సోమయాజులుగారు.

"ఎం. బి. బి. యస్సేనండీ" అంటూ అక్కడి నుండీ వెళ్లిపోయింది మంజుల.

వాళ్లు ముగ్గురూ ఒకళ్ల ముఖాలొకళ్లు చూసుకున్నారు.

"బహుశా రజనీకి చేసుకుంటారేమో." భర్త చెవిలో గుసగుసలాడింది అన్నపూర్ణ.

"కావచ్చు. ఆ రవిగాడూ ఆమె వెంటే తిరుగుతున్నాడు." నాగరికత ముసుగు వెనుక రాధిక మీద ఈర్ష్యతో రగిలింది.

రాజు పరుగున వచ్చి,

"చూశావా, మా అమ్మను?" అని గర్వంగా ప్రశ్నించాడు రవి. "నా కోసం బట్టలుకూడా తెచ్చింది."

రవి వంక, శైలశ్రీ వంక వింతగా చూసి నెమ్మదిగా జారుకున్నాడు రాజు వాళ్ల తల్లిదండ్రుల దగ్గిరికి. తరవాత రవికి శైలశ్రీ తెచ్చిన బట్టలు తొడిగించింది మంజుల.

పార్టీ ముగియడంతోనే బంధువులంతా ఒకరొకరుగా వెళ్లిపోయారు. అతిథులంతా వెళ్లిపోగానే సందడంతా సద్దుమణిగింది. శైలశ్రీ ఎన్నిసార్లు వెళ్ల ప్రయత్నించినా రవి అడ్డుపడి ఏడ్చేసరికి, అతను నిద్రపోయాక వెళ్లమని కోరింది మంజుల. ఆమె మాట కాదనలేక అక్కడే ఉండిపోయింది శైలశ్రీ, రవి నిద్రపోయేవరకు. రవి నిద్రపోయేసరికి రాత్రి పదిన్నర అయింది.

"వెళ్లొస్తానండి, నమస్కారం" శైలశ్రీ సుభద్రమ్మగారికి నమస్కరించి బయలుదేరింది. రజనీకాంత్, మంజుల ఆమెను క్వార్టర్స్ వద్ద దిగవిడిచి వచ్చారు కారులో.

* * *

మరునాడు పొద్దున్నే నిద్రలేచి శైలశ్రీ కోసం ఇల్లంతా గాలించాడు రవి. ఆమె ఎక్కడా కనబడక పోయేసరికి మంజుల దగ్గిరికి వెళ్లి,

"అత్తయ్యా, అమ్మ వెళ్లిపోయిందా?" అని ఆదుర్దాగా అడిగాడు రవి.

రవి ఏడవడం మొదలు పెడితే ఇక సముదాయించడం కష్టమని గ్రహించిన మంజుల,

"ఉద్యోగానికి వెళ్లింది. మరి, నువ్వు బడికి వెళ్లడానికి తయారవు" అని సముదాయించబోయింది.

మంజులకేసి ఒకసారి అనుమానంగా చూస్తూ లోపలికి వెళ్లిపోయాడు, మళ్లీ పుట్టినరోజువరకూ రాదేమో అమ్మ అనుకుంటూ. ఎందుకు నిద్రపోయానా అని బాగా తిట్టుకున్నాడు. వెళ్లనంటూ మోసంచేసి వెళ్లిపోయిందేం అమ్మ అన్న ఆలోచనే రవికి.

రవి రోజూ బడికి వెళ్లడం, రావడం తప్పితే మిగతా విషయాల్లో ఆసక్తి చూపించడం లేదు. దానికి కారణం ఇంట్లో అందరికీ తెలిసిందే. రవికి అమ్మ కావాలి. అందుకని రజనీకాంత్ ఎలాగో ఒకలా పెళ్లి చేసుకోక తప్పదు. ఆ విషయమే అతనితో చెప్పి రాధికనెలాగైనా అతను పెళ్లి చేసుకోడానికి సుముఖుణ్ణి చేయాలనుకున్నారు సుభద్రమ్మగారు. అన్నపూర్ణకు చిన్నప్పటినుండీ రాధికను రజనీకాంత్‌కు చేసుకుంటే బాగుంటుందనే అభిప్రాయం ఉంది. కానీ అతనికి మేనరికం ఉన్న కారణంగా ఆ ఆశ తీరే అవకాశం లేకపోయింది. కానీ రవి పుట్టిన రెండేళ్లకు టైఫాయిడ్ వచ్చి పది రోజులు తిరగకుండానే శ్యామల చనిపోయేసరికి అణగారిపోయిన ఆశ మళ్లీ చిగురించసాగింది అన్నపూర్ణలో.

> సంతోషంకోసం అన్వేషించడమంటే దానిని వదులుకోవడమే. సంతోషం గురించి స్మరించకుండా కర్తవ్యమార్గాన్ని మెల్లగా అనుసరించినట్లయితే దానిని పొందవచ్చు.
>
> —ఎ. మెక్లారిన్

ఒక రోజున మాటల సందర్భంలో అన్నారు సుభద్రమ్మగారు రజనీకాంత్‌తో:

"ఇంకా ఎన్నాళ్లు పెళ్లి చేసుకోకుండా ఉంటావు, బాబూ, నువ్వు. పోయినది తిరిగి రాదు. పోయినంత మాత్రాన మళ్లీ పెళ్లి చేసుకోకూడదనేమీ లేదుగా! రాధికకు పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారు. మనమేమైనా చేసుకుంటే కాదా." ఆశగా కొడుకు ముఖంలోకి చూశారావిడ.

"అమ్మా! నేను నీకు ఎన్నిసార్లు చెప్పాను, ఇప్పట్లో నాకేమీ పెళ్లి చేసుకోవాలని లేదని." బాధగా మోగింది అతని కంఠం.

"పెళ్లి చేసుకోకుంటే పిలుపేదు. రాధిక కాకపోతే మరెవరినైనా సరే నీ ఇష్టం. కానీ రాధికని గురించి కూడా ఆలోచించి చూడు. అందం, చదువు, తెలివితేటలు అన్నీ ఉన్న అమ్మాయి."

* * *

ఒకరోజున మంజులను చూడడానికి వచ్చింది రాధిక. ఆ టైంలో రవి వచ్చాడు బడినుండి. ఎప్పటి మాదిరిగా మంజుల అతని బూట్లు విప్పి, బాగ్ తీసేసింది వీపు మీదినుండి. లోపలికి తీసుకువెళ్లి ముఖం, కాళ్లూ, చేతులూ కడిగి, స్కూల్ యూనిఫారమ్ మార్చి మామూలు దుస్తులు వేసింది.

"మా అమ్మను చూశావా, రవీ? వచ్చిందిగా." రాధికను రజనీకాంత్‌కు చేసుకోవాలనే ఉద్దేశంతో, రాధికను మచ్చిక చేయజూశారు సుభద్రమ్మగారు.

"ఆమె ఏం మా అమ్మకాదు." ముఖం చిట్లించుకుంటూ వెళ్లిపోయాడు రవి. తెల్లబోయారు సుభద్రమ్మగారు. వెళుతూన్న రవిని పట్టుకుని "ఏమ, బాబూ, అత్తయ్య దగ్గిర కూర్చుందువుగాని" అంటూ తీసుకువెళ్లి మంజులతోబాటు సోఫాపై కూర్చోబెట్టారు.

రాధిక ప్రేమగా రవిని దగ్గిరకి పిలిచి పక్కలో కూర్చోబెట్టుకుంది. రవికి తన కళ్లపట్ల చాలా నమ్మకం ఉంది. ఆమెను తన అమ్మగా చూపి మభ్యపెట్టజూస్తున్నట్లుగా తెలిసిపోయింది. ఆరోజున చూసిన ఆమె, ఈమెమాత్రం ఒకరు కాదని అతనికి నిర్ధారణగా తెలిసిపోయింది. నాన్నమ్మ చూపిన అమ్మాయితో ఎంతో కలుపుగోలుగా మాట్లాడడం రవికి నచ్చలేదు. ఆమె వెళ్లిపోగానే మంజులతో అన్నాడు:

"అత్తయ్యా! మళ్లీ అమ్మ ఎప్పుడొస్తుంది?"

"ఇంకా అమ్మనుగురించే ఆలోచిస్తున్నావా? మళ్లీ పుట్టినరోజుకు వస్తుంది."

"ఆ లోపున రాదా?"

ఏమీ జవాబివ్వకుండా రవినే చూస్తూ ఊరుకుంది మంజుల. ఏమీ మాట్లాడకపోవడంతో అతనికి ఏడుపు వచ్చినంత పనయింది. కానీ ఏడుపును దిగమింగుకుని మంజులతో కబుర్లలో పడిపోయాడు.

రాత్రి భోజనాలు పూర్తవగానే నెమ్మదిగా తండ్రి పక్కకు చేరాడు రవి. అతని కేదో ఆలోచన వస్తే అది చేసి చూసేవరకూ నిద్రపట్టదు. అలాంటి ఆలోచనలన్నీ కార్యరూపంలోనికి రావడం అతను ఇంట్లో అందరికీ ప్రీతిపాత్రుడవడం కారణంగానే. అమ్మ నాన్నతో కలిసి వచ్చింది. కాబట్టి అమ్మ ఎక్కడ ఉండేదీ నాన్నకు బాగా తెలుసుననిపించింది. కాబట్టే నెమ్మదిగా నాన్న దగ్గిరికి వెళ్లి నిలబడ్డాడు. రవిని చూసి దగ్గిరకి తీసుకుంటూ అడిగాడు రజనీకాంత్:

"ఏం రవీ, అలా ఉన్నావు?" రవి మౌనంలోని కారణం ఊహిస్తున్నాడు.

తండ్రి ముఖంలోకి చూస్తూ మెల్లగా, "అమ్మ దగ్గిరికి వెళ్దాం" అన్నాడు.

రజనీకాంత్‌కు సంగతి అర్థమయింది.

"ఏం? వెళ్తేనా ఏమంటుంది?" నవ్వుతూ ప్రశ్నించాడు.

రవి ఏమీ పలకకుండా తల వంచుకున్నాడు.

"ఎప్పుడయినా వెళ్దాంలే. పోయి పడుకో."

రవి వెళ్లిపోయాడు రజనీకాంత్‌ను ఆలోచనలకు వదిలిపెట్టి. తండ్రి మాటపై అతనికి నమ్మకం ఉంది.

రజనీకాంత్ ఆలోచనలు గతంలోకి వెళ్లాయి. గతమంతా అతనికి ఒక అందమయిన కల. చిన్నప్పటినుండీ ఆశలన్నీ శ్యామలపైనే పెట్టుకుని చదువు పూర్తి చేశాడు. అతను జీవితంలో శ్యామలను తప్ప మరెవరినీ ఆరాధించలేదు, ప్రేమించలేదు. ఆమెతో గడిపిన రోజులు జీవితంలో ఎన్నటికీ మరిచిపోజాలడు. ఆమె

వంటి అనురాగమూర్తులు ఈ లోకంలో చాలా తక్కువ. ఆమె ఈ లోకం విడిచి వెళ్ళిపోయినా తనను తోడు రానీయకుండా, రవి బాధ్యత తనపై ఉంచింది. అటువంటి రవి శైలశ్రీని తల్లిగా భావిస్తున్నాడు. ఇక జీవితంలో వివాహమాడకూడదనుకున్న తనను రవి వివాహోన్ముఖుని చేసేలా ఉన్నాడు. అదే తీరని వ్యథగా తయారయింది అతని మనసులో. శైలశ్రీ వచ్చి వెళ్ళిన నాటినుండి రవి ఆరోగ్యం నానాటికి తీసికట్టులా తయారయింది. ఆవేళ ఎంత ఉత్సాహంగా ఉన్నాడు రవి. ఇప్పు డెలా ఉన్నాడు? ఆలోచనల భారంతో, తీరని ఆవేదనతో తనలో తానే కుళ్ళి కృశించిపోతున్నాడు రోజురోజుకు. తాను చేస్తున్న దేమిటి? తన జీవన జ్యోతిని దేదీప్యమానంగా వెలిగించాలనుకుంటూ ఆర్పి వేయడానికి సాహిస్తున్నాడు. భగవాన్! ఏమిటీ విచిత్ర పరిణామమంటూ తల్లడిల్లసాగాడు.

రవికి తల్లిగా శైలశ్రీని ఊహించుకొనలేకపోయాడు. ఆమె అందం, అంతస్తు అతని ఊహ కందని దూర తీరాలలో ఉన్నాయి. అటువంటప్పుడు ఆమె తనతో వివాహానికి ఎలా అంగీకరిస్తుంది? శ్యామలను ఇంతగా ఆరాధించిన తానుమాత్రం శైలశ్రీని వివాహమాడడం సాధ్యమా? ఏది సాధ్యమో, ఏది అసాధ్యమో ఆలోచించ లేక పోతున్నాడు. తన సాధ్యాసాధ్యాల పంజరంలో, శ్యామలమీది మమతానుబంధాల పంజరంలో చిక్కుకున్న రవికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, ఆనందోత్సాహాలు ప్రసాదించగలిగేవాళ్ళు తామిద్దరే.

రవిని గురించి ఆలోచించాలనుకున్నా—తల్లిలేని రవి ఊహా సౌధంలో అపూర్వ మాతృమూర్తి శైలశ్రీ. విషాద సముద్రంలో కొట్టుకుపోతూన్న రవిని ఆదుకుని, సేద దీర్చే జీవిత నౌక శైలశ్రీ. భవిష్యత్తును గురించి దారి తెన్నులు వెదుకుకొనకుండా ఆరోగ్యాన్ని పాడుచేసుకునే రవికి ఎడారిలో దప్పికగొన్న వానికి ఒయాసిస్సు వంటిది శైలశ్రీ. రజనీకాంత్ మదిలో ఆమె ప్రతి రూపమే గిరున తిరుగుతూంది.

రవిని ఆదరంగా ఎత్తుకు ముద్దులాడిన శైలశ్రీ, ప్రేమతో ఒడిలో కూర్చోపెట్టుకున్న శైలశ్రీ, అతని మాటలను సహనంతో వింటూ కూర్చున్న శైలశ్రీ, అతని పుట్టిన రోజు సందర్భంలో ఎంతో ఉత్సాహాన్ని ప్రదర్శించిన శైలశ్రీ...

శైలశ్రీ చేతిలో పెరగబోయే రవి మధుర జీవితాన్ని ఊహించుకోలేకపోయాడు రజనీకాంత్. బాగా ఆలోచించిన మీదట అతను తన నిశ్చయాన్ని మార్చుకున్నాడు. జీవితంలో ఒకసారి ఓడిపోయి మృత్యువుతో పోరాడుతూ అనుక్షణం మానసికంగా ఓడిపోతూన్న తనకూ ఉత్సాహాన్నిచ్చి, తన ఆవేదనలో, ఆనందంలో పాలుపంచుకునే స్త్రీ కావాలి. తన జీవితానికి ఒక ఆలంబన కావాలి. తామిద్దరి జీవితాలను తీర్చి దిద్దగలిగే నైపుణ్యం శైలశ్రీలో కనిపించిం దతనికి.

* * *

ఆదివారం ఉదయాన్నే లేచి ఎలా అయినా సరే శైలశ్రీని తనను వివాహం చేసుకొమ్మని అడిగేయా లనుకున్నాడు రజనీకాంత్. మెల్లగా పక్కమీదనుండి లేచి,

"రవీ" అని పిలిచాడు.

తండ్రి పిలుపు విని త్వరగా వచ్చాడు రవి.

"మీా అమ్మ దగ్గరికి వెళతావా?"

ఆయోమయంగా తండ్రి ముఖంలోకి చూశాడు రవి. అంతవరకు అతనెప్పుడూ ఎదురుచూడని ప్రశ్న. అతనికి వెళ్ళాలని ఉన్నా అతని ఆలోచనను అంతా అణచివేసినవాళ్ళే! అటువంటిది తండ్రి ఇలా అడగ డంలో అర్థమేమిటి?

"వస్తావా?" నవ్వుతూ రవిని ఎత్తుకుని అడిగాడు.

రవి ఆనందానికి పట్ట పగ్గాలు లేవు.

"ఓ." అమితోత్సాహంగా జవాబిచ్చాడు.

"అయితే వెళ్ళి త్వరగా తయారవు."

రవి టపటప చప్పుడు చేస్తూ లోనికి పరిగెత్తాడు. అతని ముఖంలో వేయిజ్యోత్స్నల వెలుగు రేఖలు. మంజుల వద్దకు వెళ్ళి,

"మేము అమ్మ దగ్గరికి వెళ్ళాలి! త్వరగా నాకు స్నానం చేయించు" అని మారాం చేయసాగాడు.

"ఎవరు చెప్పారేమిటి అమ్మ దగ్గరికి వెళ్ళాలని?"

"నాన్న."

"నిజంగా నాన్నే చెప్పాడా? నువ్వే అంటున్నావా?"

"నా మీద ఒట్టు" అంటూ మంజుల చేతులు తీసుకుని తలపై పెట్టుకున్నాడు.

మంజుల కేమీ నమ్మ శక్యంగాలేదు. వెంటనే రవితో బాటు రజనీకాంత్ గదికి నడిచి,

"శైలశ్రీగారి వద్దకు వెళ్ళడం నిజమేనా, అన్నయ్యా!" అని ప్రశ్నించింది మంజుల.

"అవును."

ఆశ్చర్యంగా, అనుమానంగా అతన్ని పరీక్షించింది మంజుల. గంభీరమైన అతని వదనంలో ఎటువంటి మార్పూ లేదు. వెంటనే రవిని తీసుకు వెళ్ళింది స్నానం చేయించడానికి.

రవి త్వరగా తయారయి తండ్రి దగ్గరికి వెళ్ళి నిలబడ్డాడు. రజనీకాంత్ కూడా బాగా టకప్ అయి, "పద" అన్నాడు రవికి చేతి నందిస్తూ.

తండ్రి చేతిని పట్టుకుని చెంగు చెంగున గంతులు వేస్తూ తండ్రికంటే ముందుగా నడిచి కారు చేరుకున్నాడు రవి. ఫ్రంట్ డోర్ తెరిచి రవిని ఎత్తి లోపల కూర్చోబెట్టాడు రజనీకాంత్. సీటుపై నిలబడి అద్దంలో ఒకసారి నవ్వుతూ తన ముఖం చూసుకున్నాడు రవి. రజనీకాంత్ లోపలికి వచ్చి కూర్చుని, రవిని కూడా కూర్చోబెట్టి తిన్నగా ఆప్సరి కాంపౌండులోకి కారును నడిపి, ఒక ప్రక్కగా కారు పార్కుచేశాడు.

* * *

తలుపు శబ్దం విని తలుపు తెరిచి చూచిన శైలశ్రీ ఆశ్చర్యపోయింది ఎదురుగా ఉన్న వ్యక్తిని చూసి. అతని చేయి పట్టుకు నిలబడి ఉన్నాడు రవి. రవిని ఎత్తుకుంటూ,

"రండి లోపలకు" అంటూ లోనికి నడిచింది.

ఆమె వెంటనే వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు రజనీకాంత్. అతనికి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ, "చాలా హఠాత్తుగా వచ్చారు" అంది శైలశ్రీ సంభాషణ మొదలుపెడుతూ. ఆమె ఒడిలో కూర్చున్న రవి ఆమె చెంపలకు తన చెంపను ఆనించాడు. ఆనందబాష్పాలు రాల్చుతూ శైలశ్రీ చెంపను తడిపేశాడు రవి.

"ఎందుకు, రవీ, ఏడుస్తున్నావు? తప్పుకదూ." రవి చెక్కిళ్ళపై కారుతూన్న నీటిని తుడిచింది శైలశ్రీ. ఆమె మెడను గట్టిగా చుట్టేసి ఏడవడం మొదలుపెట్టాడు, సంతోషాతిరేకంలో మాటలు రాని రవి.

"తప్పు, రవీ. అలా ఏడవకూడదు. ఏదీ ఇలు చూడు" అంటూ అతని గడ్డం పట్టుకుని తనవైపుకు తిప్పుకుని ధారగా కారుతూన్న కన్నీటిని తుడిచింది. "ఎందు కేడుస్తున్నావు చెప్పు మరి."

"ఉంటానని వచ్చేశావెందుకు ఆ రోజున?"

సందిగ్ధంలో పడింది శైలశ్రీ.

"నీవు నిద్రపోయావు కాబట్టి వచ్చేశాను."


"ఇంకెప్పుడూ అలా చేయుద్దు."

"అలాగే."

"నేను నీతోనే ఉండిపోతాను."

"అలాగే. మరి నువ్విక్కడ ఉండిపోతే నాన్నగారికి రవి ఎలా వస్తాడు?"

"నాన్నా ఇక్కడే ఉండిపోతారు." చటుక్కున జవాబిచ్చాడు రవి.



రూపు రేఖలు

చిత్రం—జి. వి. రమణ (సూర్యాపేట)

వెంటనే తల తిప్పి రజనీకాంత్‌ను చూచింది శైలశ్రీ. వినోదంగా తమనే తిలకిస్తున్న అతని కళ్ళను ఎదుర్కొన లేక టపటపలాడాయి ఆమె కనురెప్పలు. రజనీకాంత్ అన్నాడు:

"మీారు వచ్చేసి నప్పటినుండీ మీా కోసమే బెంగ పెట్టుకుని ఎప్పుడూ మీా దగ్గరికి వెళ్దామనే వాడు గాడవ."

"రవిని తీసుకురమ్మని నేనే చెప్పాలనుకున్నాను మీాతో. అతనిని వదిలి వచ్చేసినప్పటినుండీ నా మనసు అతని చుట్టూ పరిభ్రమిస్తూంది. నన్ను వెళ్ళిపోవద్దని అంతగా బ్రతిమాలుకున్నా నేను వచ్చేసినందుకు అతనికి చాలా బాధ కలుగుతుందని నాకు తెలుసు." ప్రేమతో మిళితమైన బాధ అది.

నిజంగానే రవిని వదిలి వచ్చిన దగ్గరనుండి ఆమె మనసు మనసులో లేదు. ఎంతసేపు అతని బొద్దు స్వరూపం, ముద్దు మాటలే జ్ఞాపకం వస్తాయి. అమ్మ లేదని అతను పడే ఆవేదన, తనను చూడగానే వదే

ఆమెను పదే పదే వేధించేవి. రవి 'అమ్మా' అని 9స్తే ఏదో చెప్పలేని ఆనందం. అతని పిలుపులో ృత ధారలు తన అంతరంగాన్ని ఏదో తెలియని రితో తడిపివేస్తాయి. అతన్ని మళ్లీ మళ్లీ ), పదే పదే 'అమ్మా' అని పిలిపించుకోవాలనీ ఉరకలు వేస్తుంది. అమ్మకోసం పరితపించే తన మాతృప్రేమను పంచిపెట్టాలనిపిస్తుంది. ం లాభం? తనలో రేగుతున్న సంచలనాన్ని తో చెప్పగలదు? ఎన్నోసార్లు తాతయ్య ఉంటే గుండు ననిపించేది. కానీ నాలుగు గోడల మధ్య న్న తన అంతరంగంలో తల్లిలేని రవిపట్ల లే అనురాగాన్ని తాను ఎవరితో చెప్పగలదు? ర్థం చేసుకునే వాళ్లు మటుకు ఎవరుంటారు? టి ఆలోచిస్తున్నారు?''

పడింది శైలశ్రీ. తా నాలోచిస్తున్న విష జ్ఞాపకం వచ్చి సిగ్గుతో తల వంచుకుంది ఆమె. మదటిసారిగా శైలశ్రీ ఎంతో అందంగా అని రజనీకాంత్‌కు.

" అమ్మ నన్ను మళ్లీ పెళ్లి చేసుకొమ్మని పెడుతూంది. రవి ఏమో మిమ్మల్ని మరవ కున్నాడు. నాలోని విశ్వాసాన్నీ, నా అదృష్టాన్నీ కోడానికి వచ్చాను.'' శైలశ్రీ ముఖంలోకి చూస్తూ కొంచెం ఉత్సాహంగానూ, కొంచెం అనుమానం గానూ అన్నాడు.

అతను చెప్పింది విన్నదన్న మాటేగాని ఆమెకు అతని సంభాషణ ఏమీ అవగాహన కాలేదు. కాని, ఆమె ఏమి చెప్పుతుందోనని ఆత్రతగా ఆమె వంక చూశాడు ర నీకాంత్.

''జవాబు చెప్పండి.'' కొంచెం నిరుత్సాహంగా అన్నాడు రజనీకాంత్.

''మీరు నన్నేమీ ప్రశ్నించలేదే? దేనిలో మీ అదృష్టాన్ని పరీక్షించుకొన దలిచేరు?'' అమాయికంగా అడిగింది శైలశ్రీ. నిజంగా ఆమెకు అర్థంకాలేదా అని పరీక్షగా చూశాడు ఆమె ముఖంలోకి. కానీ ఆమెకేమీ అర్థమైనట్లుగా తోచలేదు అతనికి. అలాగే ఆమె కళ్ల లోకిచూస్తూ, కొంటెగా నవ్వుతూ, కుర్చీని టేబిల్‌కు మరింత దగ్గిరగా ముందుకు లాక్కుని కూర్చుంటూ,

''అర్థంకాలేదా? అర్థమయే విధంగా అడగమం టారా?'' అన్నాడు.

అతని చొరవకు భయం వేసింది ఆమెకు. అప్పటికి గానీ ఆమెకు అసలు విషయం బోధపడలేదు. తల దించేసుకుంది.

''నిస్సంకోచంగా అడిగెయ్యమంటారా?''

''అడగండి.'' నవ్వుతూనే సమాధాన మిచ్చింది.

"తెరచాప లేకుండా సాగే మా జీవిత నావను ఒక దరికి చేర్చే భాగ్యం కల్పిస్తారని . . ." మాటలు మధ్యలో ఆపివేసి ఆమె ముఖంలోకి పరీక్షగా చూస్తూ ''అర్థమయిందా?'' అని కుతూహలంగా అడిగాడు.

''అయింది.''కళ్లెత్తకుండానే జవాబిచ్చింది శైలశ్రీ.

''మీ నిర్ణయాన్ని ఎప్పుడయినా తెలపండి" అంటూ లేచి నిలబడ్డాడు.

''కూర్చోండి.''

''మీ నిర్ణయాన్ని తెలిపాక వస్తాను" అంటూ, ''పద, రవీ, ఇంటికి వెళ్దాం'' అన్నాడు రవితో.

''నేను రాను''అంటూ గట్టిగా శైలశ్రీని వాటేసు కున్నాడు. ఆమె స్త్రీ హృదయంలోని వాత్సల్యం పొంగి పొరలింది. రవిని దించబోతే దిగలేదు.

''కూర్చోండి. నా నిర్ణయాన్ని ఇవాళే తెలుపుతాను" అంది శైలశ్రీ.

''అయితే చెప్పండి.'' తిరిగి కుర్చీలో కూర్చున్నాడు ఆమె వంక చూస్తూ.

''సమ్మతమే'' అంది శైలశ్రీ చూపులు మరల్చు కుంటూ.

రజనీకాంత్ ఆనందానికి పట్టపగ్గాలు లేవు.

''నిజంగానా, శైలా!'' అంటూ ఆమె రెండు చేతులూపట్టుకున్నాడు ఉద్రేకంగా. అయితే, ''పద, మనింటికి వెళ్దాం.''

రవిని దింపి తాళంచెవి పట్టుకు వచ్చింది శైలశ్రీ.

''మళ్లీ వచ్చినప్పుడు కాఫీ ఇస్తానన్నావుగా!''

''అయితే కూర్చోండి. కాఫీ పట్టుకు వస్తాను."

''ఫర్వాలేదులే. మనింట్లో తాగుదాం, పద."

రజనీకాంత్ తనను ఏకవచనంలో సంబోధిస్తుంటే ఏదో తెలియని ఆనందం ఉరకలు వేసింది ఆమెలో. అతను చూపే సాన్నిహిత్యం ఆమె అంతరంగంలో అన్యో న్యతను రేపింది.

ముగ్గురూ బయటకు రాగానే గదికి తాళంవేసింది శైలశ్రీ. రవిని చెరొక చేయి పట్టుకుని కారువద్దకు నడిపించుకు వెళ్లారు. అతని ఉత్సాహానికి పట్టపగ్గాలు లేవు. వాళ్లిద్దరి మధ్యన కారులో కూర్చున్న రవి ఏదో వింత అనుభూతిని పొందాడు.

ఇంటిదగ్గిర కారు దిగి తలుపు కొట్టాడు రజనీ కాంత్. సుభద్రమ్మగారు తలుపు తీశారు. ఆవిడ వెనకాలే మంజులకూడా ఉంది. లోపలికి వస్తూనే,

''అమ్మా! నన్ను మళ్లీ పెళ్లి చేసుకోమన్నావు కదా. రవి దృఢపరిచాడు సంబంధాన్ని. మరి నీకు నచ్చిందా. ఈ కోడలు?'' అని అడిగాడు.

ఆశ్చర్యపోయారు మంజులా, సుభద్రమ్మగారూ. సిగ్గు పడింది శైలశ్రీ. కొడుకు మనసు మార్చుకున్నందుకు ఎంతగానో సంబరపడ్డారు సుభద్రమ్మగారు. మంజుల సంతోషానికి అంతులేదు. వాళ్లెవ్వరి సంతోషంతోనూ అవసరం లేదు రవికి. తన కోరిక తీరింది. అమ్మ ఇంటికి వచ్చింది. తన కంతే చాలు.

''కూర్చో, అమ్మా'' అన్నాడు రవి. అంతా కూర్చు న్నారు.

రవి శైలశ్రీ ఒడిలో కూర్చుని,

''అమ్మా! మళ్లీ ఎప్పుడూ వెళ్లిపోవు కదూ" అని గట్టిగా ఆమెను కౌగలించుకున్నాడు.

''ఊహూఁ! ఇటుపైన నీ దగ్గిరే ఉండిపోతాను" అంది శైలశ్రీ మమత ఉప్పొంగగా. ★

